ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



27-4-'55

4 అణాలు

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 48
సంచిక 34
27-4-55

మన్మథ వైశాఖ శుద్ధ షష్ఠి బుధవారం



ఏప్రిల్ 18-వ తేదీన కాలధర్మం చెందిన గణిత, భౌతిక శాస్త్రవేత్త, మేధావి, తాత్త్వికుడు

ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

కాంబోడియా కబుర్లు 11:

వర్షాల తరవాత

క్రొవ్విడి లక్ష్మన్న

ఆశ్వీజ బ॥ పాడ్యమి లగాయతు కార్తీక పూర్ణిమవరకూ కాథేన్ (నీటి వేడుకలూ, పిక్నిక్కులూ) రోజులు.

ఈ కాథేన్ వేడుకలు బుద్ధుడినాటినుంచీ ఆచారంలోకి వొచ్చేయనీ, అసలు బుద్ధభగవానుడే యిలా చెయ్యవలసిందిగా ఆనతి యిచ్చేడనీ అంటారు. "వొస్సా" అనంతరం రోడ్లమీద భిక్షాటనానికి బయలుదేరిన బుద్ధభిక్షువుల బట్టలు, బురదరోడ్లమ్మటా, వానలోనూపడి, బురదఅయిపోయి పాడయిపోతాయి. అందుకని వర్షాల తరవాత భక్తులు వీళ్లకి తిరిగీ కొత్త కాషాయవస్త్రాలు యివ్వడానికిగాను బుద్ధభగవానుడే యీ కాథేన్ వేడుకలు స్థాపించేడని చెబతారు. ఈపద్ధతి ప్రకారం నిజంగా ఒక్క కాషాయ వస్త్రాలే యివ్వవలసి ఉంటుంది, శాస్త్రాల్లో చెప్పిన ప్రకారంన్నా. కాని అసలు ఆ చరణలో మాత్రం అన్నిరకాల వస్తువులూ సమర్పించుకుంటారు. భక్తులు - భిక్షాపాత్రలూ, ఆసనాలూ (కృష్ణాజినం లాంటివి), పెగోడాల్లో భిక్షువులకి ఉపయోగించే పరికరాలూ, దోమతెరలూ (ఇండోచైనా ఏమూల చూసినా దోమలు జాస్తీ!), వంటకి పనికివచ్చే గిన్నెలూ, తినుబండారాలూ అవీ యివీని.

ఈ కాథేన్ వేడుకలు ఎవరిమట్టుకు వారుగాని, సమూహంగాగాని జరిపించవచ్చును. సాధారణంగా పదిమందీ కలిసి చేస్తూఉంటారు. మాటవరసకి ఓ సంస్థలో పనిచేసేవాళ్లందరూ ఏకమొత్తం అయి, యీ వేడుక జరిపించి, వస్తువులు సమర్పించుకుంటారు - వాళ్ల వాళ్ల తల్లిదండ్రులూ స్నేహితులూ కూడా పాల్గొనవొచ్చు. అయాస్థలాల్లో ఆర్థికంగాబాగా వెనకపడిన పెగోడా ఒకటి చూసుకొని అక్కడ భిక్షువులని ఆహ్వానించి, గౌరవించి, యీ కాథేక వేడుక జరిపిస్తారు. ఒక ఏడాది ఒకే పెగోడాలో రెండు కాథేక వేడుకలు జరగడానికి వీల్లేదు; జరగవుకూడాను.

ఇలా పెగోడా నిర్ణయంచేసుకున్న నాటికి ముందురోజున కానుకలన్నీ ఒకచోట చేర్చి, పళ్లేల్లోనూ వాటిల్లోనూ పెట్టి, బాజాలతో ఊరేగిస్తారు. ఊరేగింపుసమయంలో కానుకలమధ్య ఒకగిన్నె (పెద్దదే, కేసినుకీ గిన్నెకీ మధ్యరకంలో ఉంటుంది); ఊరేగింపు జరుగుతూన్నప్పుడు, దారినిపోయే వాళ్లు యథాశక్తి వాళ్లకి తోచినది వెయ్యడానికని ఉంచుతారు. ఈ ఊరేగింపు అంతం అయ్యేచోట ప్రార్థనలూ, వగటివేషాలూ, పాటలూ యింకా అలాంటి వేడుకలూ జరుపుతారు.

ఇహ మర్నాడు ఉదయాన్నే ప్రతీవాడూ అక్కడికి చేరుకోవాలి, పిక్నిక్కుకి వెళ్లడానికి. చాక్కగా ముస్తాబై వొస్తారు పెళ్లికివెళ్లినట్టు; తీసుకువెళ్లవలసిన వొస్తువులూ అవీ ఉంచినబళ్లు ముచ్చటగా అలంకరిస్తారు. (పల్లెటూళ్ళలో అయితే యింత అట్టహాసం ఉండదుగాని అక్కడవాళ్లు ట్రెయిలరు లాంటి దానిమీద యీ వొస్తువులన్నీ పెట్టి ఓ సైకిలుకి కట్టి లాగించి ఊరేగిస్తారు. ఈ సందర్భంలో వాళ్లు పచ్చని పరిచేలరంగు గల బట్టలూ, రంగురంగుల గొడుగులూ వేసుకుని వస్తారు, గుంపులు గుంపులుగాను.)

ఆ తరవాత పెగోడా చేరుకున్నాక కుడినుంచి ఎడమకి ముమ్మారు ప్రదక్షిణం చేస్తారు, మనం కోవెల్లో చేసినట్టుగా నేను. అయితే యీ ప్రదక్షిణం చేస్తూన్నప్పుడు బాజాలుకూడా ఉండాలి. ఈ బాజాల్లో ముఖ్యం అయింది "సాయాం." ఇది మన మృదంగంమోస్తరుగా ఉంటుంది కాని, సైజులో అంతకన్న పెద్దది. దీన్ని పాము తోలుతో మూస్తారు; పైన రంగుగుడ్డల తొడుగున్నూ.

వాయిద్యగాళ్లు చేతుల్తో యీ "సాయాం"లు వాయిస్తూఉంటే, మిగతావాళ్లు ఆ "లయ"కి అనుగుణ్యంగా గెంతుతూ కేరుతూ నాట్యం చేస్తారు; పాటలు పాడతారు.

ఈ తతంగం అంతా అయింతరవాత కోవెలలో ప్రవేశిస్తుంది. ఆసరికి అప్పటికే బుద్ధభిక్షువులు అక్కడ ఉంటారు. వాళ్లముందు యీ పట్టుకెళ్ళిన కానుకలన్నీ పేరుస్తారు; భక్తులు బుద్ధభగవానుడి విగ్రహానికి సాష్టాంగపడతారు; బౌద్ధమత ధర్మాలు వింటారు. అంతలో ఓ భిక్షువు వొచ్చి యీ భక్తులు సమర్పించిన వస్త్రాలు కొలుస్తాడు; పొడుగూ వెడల్పూ శాస్త్రసమ్మతంగా ఉన్నాయో లేదో అని! ఆ తరవాత ఓ బ్రాహ్మడు (వీడు బౌద్ధుడుకాడు!) వొచ్చిన అందరి తరఫునా వినయ విధేయతలతో యీ వొస్తువులు సమర్పిస్తాడు బుద్ధభిక్షువులకి. వాళ్లు ఆశీర్వదిస్తారు; వొస్తు స్వీకారంచేసి.

ఆపైన "ప్రీతి భోజనం." ఈ వంట చాలా దక్కగా, ఎంతో శ్రద్ధాభక్తులతో వొండుతారు. అయితే యీ భోజనానికి బుద్ధభిక్షువులూ యీ "కాథేన్" ఆర్గనైజు చేసినవాళ్ళేకాని మిగతావాళ్లు ఎవ్వరూ సహాపంక్తిని కూర్చోడానికి వీల్లేదు. ఈ ప్రీతిభోజనం ఏడాదిలో వొచ్చే అన్ని పండుగులకంటే కూడా ఎంతో ఎక్కువగా ఆనందిస్తారు. యిహ తిరిగి వొచ్చేస్తూన్నప్పుడైతే యువకుల పాటలూ కేరింతాలు మైలు దూరానికి వినిపిస్తాయి!

ఇహ కార్తీక పున్నమనాడయితే కాంబోడియాలో ఎంతో ప్రసిద్ధికెక్కిన "జలోత్సవం" (*Fête des Daux*). ఏదో ఓ గాథ ఆధారంగా లేనిదే ఏ పండుగూ లేనట్టు కనిపిస్తుంది యీ దేశంలో. (మన దేశంలో మట్టుకు ప్రతీ వ్రతానికీ, ప్రతీ నోముకీ ఓ కథ లేదూ?) యీ నాక్ (లావోస్)లో ఉన్న "నిమోక్తా" నది ఒడ్డున యిసకలో బుద్ధభగవానుడు నడిచివెళ్లేడనీ, ఆ అడుగుల జాడలు జ్ఞాపకం పెట్టుకుని వాటిని పూజించడానికి యీ "జలోత్సవం" అంటూ ఓ అవకాశం కల్పించేరనీ అంటారు

విషయానుక్రమణిక

ముఖచిత్రం : "సిగ్గు దొంతరలు" ఫొటో: డి. రామలింగేశ్వరావు.

కొందరు; మరికొందరు "అబ్బే, అది ఏమీకాదు. అసలు బుద్ధభగవానుడే ఓ కోటుబ్రిడ్జి (Coad bridge) కట్టించేడు; వైశాలీరాజ్యంలో క్షామం అనే మాట లేకుండా కాస్తూ ఉండేది యీ బ్రిడ్జి; కాబట్టి యీ జలోత్సవంనాడు పడవల మీద గుంపులు గుంపులుగా వెళ్లాలి" అంటారు. నాగరాజుకి బుద్ధభగవానుడు ప్రసాదించిన దంతం, తాను జలాంతర్భాగంలో కదా ఉంచేడు అందుకని యీ ఉత్సవం అని ఇంకొందరు. అసలు ఏడాది పొడుగునా రహదారిపడవలు – మీ కాంగ్ నదిలో నయితేనేం, తోంలి సాప్ నదిలో నయితేనేం – బౌద్ధాలయాల ఆవరణల్లో ఉండిపోతాయి. ఇహ వీటిని మళ్లీ నీటిలో వొదిలినప్పుడు పెద్ద సంబరం చెయ్యాలి. అదుగో అదే యీ సంబరం. ఇలా అనేకరకాలు.

ఇక్కడే ఓ ముచ్చటకూడా చెప్పాలి. పలదేవతల్లాగే జలదేవతలుకూడా ఉన్నారు. వీళ్లు ప్రతీ పడవనీ ఆవహించి, ఆ పడవ కళ్ళ వాడికి ఐశ్వర్యం, ఆరోగ్యం చేకూరుస్తారు. వీటి ప్రభావం అంతా పడవ "సైడు"న ఉంటుంది. పడవని జలారోహణం చేస్తూ, శంఖారావం అదీచేసి, మంత్రాలు చదువుతూ ఉంటే యీ దేవత పూనేస్తుంది పడవవాళ్ళకి. ఆ మట్టుగా వాళ్లు ఒక్కసారిగా పడవలోంచి నీళ్లలోకి దూకి, యీదుతూ, కేరుతూ, వాగుతూ నానా గల్లంతూ చేస్తారు. ఒక్కొక్కప్పుడు వీళ్ల చేతులకి నూలు తోరాలో, లేకపోతే చేతి రుమాల్లో కడతారు, మంత్రించి అలా కడితే మంచి లాభం రావడమే కాకుండా, పడవ ఏ దిక్కున పోయినా మరి ప్రమాదం ఉండదు!

ఈ తతంగం అంతా సాయంకాలం జరుగుతుంది. ఆనాటిఉదయాన్నే పెద్దవి రెండు గిల్టు కళ్లు తయారుచేసి పెగోడా శిఖరంమీద ఉంచుతారు. సాయంకాలం బాజాభజంత్రీలతో మేళం జరిగించి, ఆ తరవాత మూడుసార్లు "పాలి" కేక పెట్టి, అన్నింటికన్నా పొడుగాటి పడవని ముందు నీళ్ళలో వొదులుతారు.

నాంపెన్‌లోనయితే బోట్ రేసులు జరుగుతాయి యీనాటినుంచీ మూన్నాళ్లు. పడవలనిండా దీపాల తోరణాల అలంకరణ. ఈ పడవలో దీపాలు రాజుగారు స్వయంగా వెలిగించడం ఆచారం. నదినిండా యీ దీపాల పడవలు రేసుల్లో తిరుగుతూఉంటే ఆ ప్రతిబింబాలతో నది ఎంతో ఆకర్షకంగా ఉంటుంది. మూడురోజులూ రాజుగారు యీరేసులు చిత్తగిస్తారేమో, ఊళ్లో జ

అంతా నదిఒడ్డునే ఉంటుంది. ఇహ కోలాహలం చెప్పనేఅక్కర్లేదు.

కార్తీకపున్నంనాడు రాజుగారు తూంలి సాప్ నదిమీదఉన్న *Floating house* లోనుంచి చంద్రుడికీ జలదేవతలకీ ఓనమస్కారం చేసి, వెన్నెట్లో మిలమిల మెరుస్తూన్న నీళ్లతో చేతులూ మొహం కడుక్కుని, శివుడికి అత్యంతప్రీతయిన మారేడుదళంతో ఆనీళ్లు తమ పిల్లల శిరస్సున ప్రోక్షిస్తారు.

(ఇంకా ఉంది)

కన్నీటి బరువు

జీవన ప్రభాత

ఆమె స్మృతి నన్ను గాఢంలో ముంచింది. మిట్ట మధ్యాహ్నమే సూర్యాస్తమయం. ఉరకలూ పరుగులతో ముంచుకు వస్తున్న గోదారి ఒక్కసారి ఇంకిపోయినట్లయింది నా బ్రతుకు.

నాకున్నదే ఆమె ఒక్కతె. ఆమెతోనే అన్ని దిక్కులూ నాకు సమసి పోయాయి. గుండెలు పగిలిపోయేలాగ ఏడ్చి యేడ్చి దినాలు గడుపుతున్నాను....

ఆమెను దహన పరచిన స్మశానాన దివారాత్రాలు పడికాపులు కాచేను; ఆమె నడయాడిన స్థలాలు పుణ్య క్షేత్రాలుగా సాక్షరించి యుగాలు గడపేను.—

ఆమె వస్తుందేమోనని; ఆమె ఛాయ అయినా వచ్చి నిలుస్తుందేమోనని; పరామర్శించి నన్ను—నాతో కలసి తిరుగుతుందేమోనని!

—ఆవిధంగా తిండికి నిద్రకు, ఉద్యోగానికి మిత్రులకు, దూరమయ్యాను.

పారిపోతున్నాను— సాటి మనుష్యుల సన్నిధినుండి భయపడి; వారి దృష్టులు సహించలేక, ఒక విపరీత కృత్యం ఏదో ఆచరించినట్లు!

ఒక దోషిగా — ఒక అపరాధిగా— తప్పించుకు తలవంచుకుని తిరుగుతున్నాను.—

వీధి వీథుల, వాడల, గోదావరిగట్ల మలుపుల, పొలిమేరల పొలాల నంబడి, దూరాల శీతల తరుఛాయల —తిరుగుతున్నాను.

ఆమె వెళ్లడంకాదు — నన్ను మృతప్రాయుణ్ణి చేసింది.

ఆమె లేని ఈ ప్రపంచమెందుకు ? ఈ కర్కశ మానవులతో ... ఈ గుట్టలతో గట్టులతో ...ఈ గోదావరితో... సాంధ్య సువర్ణిత కాంతుల మందమలయ పవనోర్మికా డోలికలతో ...ఏమి పని నాకు!

*　　　*　　　*

నేను నా వ్యావృత్తిలోపడి నలిగిపోతూ విరిగిపోయి నడచి పోతున్నాను. నాకళ్లకు "బాబు" విగ్రహం కనపడింది. చూడలేక వాడిని, తలవంచుకుని, ప్రక్క వీధిలోకి తిరిగి పెడుతున్నాను.

పినకొక్కలే వచ్చి నా రెక్క పట్టుకున్నాడు: తల రెండో వేపే పెట్టుకున్నాను.

"నీ...కో...స...ం..." అని మాటలు రింగు రింగు మంటున్నాయి.

బలవంతాన నన్ను రెండు చేతులతోనూ పొదివి పట్టుకున్నాడు.

"నీకోసం వూరంతా తిరుగుతున్నా—" అన్నాడు. "యెంతపని జరిగిందీ—"

నే న్నీళ్ళ పడిపోయాను, గుడ్లు వప్పగించి.

"నిన్నెంత అన్యాయం చేసిపోయిందీ — అందర్నీ గంగలో ముంచి పోయింకే! ...కడుపుతో కూడా వుందిట? ఇంకా పిల్లా జల్లా పుట్టుకొస్తారు.— ఏగో అదీ ఇదీ అంటూ...రామరామ...!"

నాకళ్లు ప్రయాగా సంగమ మయ్యాయి. చెవులో రేగిన సుడిగాళ్లు నదీ కెరటాలను అంచెలంచెలమీద అంతస్థుల పైకెత్తి అగాధాలను సృష్టిస్తున్నాయి.

వాడు నడుస్తున్నాడు. వాడి అడుగుల్లో అడుగులు వేస్తున్నాను.

మైదానంలో ఒక చెట్టు కింద కూలపడ్డాం...

"చెల్లెమ్మ...ఎంత మంచిది! ఎంత చక్కనిది! ఏం మర్యాదా!!"

"........................"

"నన్నంత దూరాన్నే చూస్తూ అంత మొహం చేసుకునేది. ఇద్దరం ఒక తల్లి బిడ్డలుగానే ఒకవేళ పుట్టివుండినా రమ్మన్నా రాని ఆప్యాయత..."

"........................"

"చేసే ప్రతి పనిలోనూ ఎంత జాణతనం; ఎంత పనితనం—"

"...................."

"అటువంటి యిల్లాలు ఇక లేదు; ఒకలక్ష్మి! నిన్ను ఎందుకూ పనికిరాని దిక్కుమాలిన వాడిని చేసి — మా చిట్టి తల్లి — వెళ్ళిపోయింది."

వాడి నోటవస్తున్న ఒక్కొక్క మాటే నన్ను శూలాలతో పొడిచేస్తోంది. నేను వలవల లాడుతూ నేలపడి దొర్లి పోతున్నాను.

"చూస్తూండగా బంగారంలాటి కాపరం నట్టేట కలిసిపోయింది. నీ బతుకు..."

నిజం. ఆమె నా జీవితానికి ఛందస్సు— ప్రతిభ. ఆమె మళ్ళిన మరుక్షణంలోనే నా బండారం బయలు పడింది.

బాబు ముఖంకేసి చూశాను. కందగడ్డలా గుంది...లోలోన కుమిలిపోతున్న అగ్ని పర్వతం. నాకంటేకూడా ఎంతో బాధ పడిపోతున్నాడు....

"యేం వొచ్చిందిరా ? యెలా వచ్చి పోయిందిరా ? ఒక్క కొడుముక్కా నా రాసేవు కాదేంరా ? నా సొంత కడుపున పుట్టిన పిల్లే అనుకున్నా గద ! అక్కడ లక్ష్మి ఒకటే గోల— తిండి కూడా మానేసింది. వాళ్ళిద్దరూ కలిసున్న నాళ్లు రోజులూ ఒక్క కంచంలోతిని ఒక్క మంచంమీద పడుకునేవారు గదరా !"

నాకు ఎగవూపిరి దిగ వూపిరీ అవుతోంది. కంటికి కట్టినట్టు నా మూడుసంవత్సరాల బతుకూ కనపడుతోంది... శరీరం మీద స్పృహ లేకుండా, ఇరుప్రక్కలా విస్తరించివున్న వాతావరణాన్నే మరచి, మమ్మల్నే మరచి, ఒకొక్కసారి తిండిని నిద్రను అన్నీ మరచి —ఏక శరీరలమూ ఏక హృదయులమూ అయి ఒకే గతిలో గడపిన తరుణాలు...!

"ఆమె చితికి నువ్వెలాగ నిప్పంటించగలిగేవు? నీకు చేతులెలా గొచ్చాయిరా?"

ఇవి చేతులు కావు - యమకింకరుల కోరలు... నా ప్రణయమే చివరకామె ప్రళయమయ్యింది.

నా మీద నాకే అసహ్యం వేసుకొచ్చింది. ఎందుకు బతికున్నా?

చాలాసార్లు చద్దామనుకున్నానే కాని... పిరికి వెధవని...చాతకాని—

చద్దామనుకొని! నువ్వుకూడా చచ్చివుంటావు — లేక చావుబతుకుల మీదుంటావు— ఈ చేతులతోనే అయిందని పించాలిసొస్తుంది కాబోలు రా దేవుడా అనుకున్నాను...."

ఛీ—నా బతుకు. నిజమే. ఎంతో ప్రేమించాను; ఏం చెయ్యగలిగేను? పరలోకంలోనే కాకుండా ఇక జన్మజన్మలకీ కూడా కలిసుంటామని ఒప్పందాలు చేసుకున్నాము.

"అంతా అయిపోయింది—" అన్నాను, ఇక ఏడ్వలేక, ఉడుకుబోతు తనంతో— బయటికి శూన్య ప్రపంచానికి, పురిపెడు

ఎండిన కన్నీళ్లతో ఒక్క తర్పణం ధార పోశాను.

*   *   *

వాడేదో మాట్లాడుతూనే వున్నాడు. వింటున్నానో లేదో నాకు తెలియదు. అలాగలాగ చీకటి ముంచుకు వచ్చింది. వాడు నడుస్తున్నాడు కాబోలు. నేనూ కదులుతున్నాను.

నాకళ్లు చెమ్మ యెండిపోయింది. వళ్లంతా దిమ్ముగావుంది. అసే మైకంలో ఏమీ సంబంధం లేని ప్రపంచంలో ఈదుకుంటూ పోతున్నాను.

"పద యింటికి పోదాం—"

ఏయిల్లు? నాకిల్లేమిటి?

"సారె!! ఈ వారంరోజులూ ముద్ద ముట్టలేదాయేం? నాకడుపు మాడి పోతోంది. రెండు రోజులైతిన్న మెతుకులు. ఈ హోటల్లోకి పోదాం పద.!!

"నువ్వుపోయి తిను—"

"ఏడిశావ్ లేరా—"

"………………….."

"తిండీ నిద్రా ఇల్లూ అన్నీ వదిలేశావన్న మాట?"

"……………"

"నీ మొహమే చెపుతోంది."

నాకు మహా కష్టమనిపించింది. "ఏం చెప్పుతుంటావురా—!" అన్నా దీనాతి దీనంగా.

"రెండు మెతుకులు కొరుకుదామంటే?"

నే దిగాలుపడి నిలుచుండి పోయాను. "ఈ మెతుకులోటి తక్కువా?"

"యీడవడానికూడా శక్తుండొద్దూ? పద. ఏదో కక్కుర్తి—"

"నాకివన్నీ అనవసరం… వొక్కటీన్నీ యెప్పుడూ తినలేదు.—"

"నేనున్నాగా—?"

"……………"

"ఐతే యేమంటావ్?"

"నేనుండలేను, ఇలా బతకలేను. ఆత్మహత్య చేసుకుంటా—"

"ఛీఫ్— అప్రయత్నంలో వున్నవాడివి ఇన్నాళ్లెందు కూర్చున్నావ్? ఉపవాసాలతో మాడి మాడి ఛావటం చాలా కష్టం. సుఖమైన చావు కోరుకోవాలి … అర్రె! కోపమొచ్చిందా?… ఊరిశిఖంటే వెళ్ళిపోతా వేమిట్రా?"

"……………"

"సరే కానియ్యి. ఏం చేస్తాం? తినక తప్పుతుందా? బతక్క తప్పుతుందా? యెవరో ఒకరి కోసం!"

"ఇంక నాకెవరున్నారని?"

"నేలేనూ? నా పెళ్లాం లేదూ? నువ్ తిండి మానుకూచుంటే చెల్లెమ్మ చూస్తూ వూరుకునిదా? పద—"

"నే తినలేనబ్బాయ్—"

విస్తరిముందు బలవంతాన్ని కూర్చో బెట్టేడు.

వుర్తి పసువు అనిపిస్తా డొక్కొక్కప్పుడు. గోవు జాతికి చెందినవాడు. ఉపన్యాసం దంచసాగేడు.—

"నువ్ తినకపోతే నేనూ తినను. నువ్ తిండి మానుకుంటేనూ, బికారి వెధవలాగ పీధులంటుకుని తిరుగుతుంటేనూ ఆవిడ ఆత్మకి శాంతి కలుగుతుందా? గొల్లున ఏడవదూ? మనం పువ్వుల్లో పెంచిన ఈ మొక్క నేలవాలి కుళ్లిపోతోందేమిరా అని వాపోవదూ… ఏదో కక్కుర్తిపడు …ఇంక మాట్లాడకు. నిన్ను ఘోరంగా ఆమె ప్రేమించినందుకు ప్రాయశ్చిత్తమేమిటయ్యా అంటే ఆమె కుత్తరగతులు లేకుండా నీ అంతట నువ్వే చెయ్యడం……………. అంతేనా?…"

"……………"

"అబ్బ తిండిలేకుండా ఒక్క నిమిషం నేనుండలేను సుమా. అసలు … చచ్చి ఎవరి నుద్ధరిద్దామనిరా? సరే — చచ్చావయ్యా— నీ పెళ్లాన్నే కలుసుకోగలవనే నిర్ధారణ యెలాగ?… ఊఁ…రెండు మెతుకులు— లెఖ్ఖ రెండు…యేఁగో అలాగ —"

"నాకు సహించడంలేదు—"

"విస్తట్లోకి చెయ్యి పోనియ్యి. నువ్ తినకపోతే నేనూ మానేస్తాను. బ్రహ్మహత్యాదోషం కూడా పట్టుకుంటుంది. — ఆవిడ స్వర్గంలో ఓమూల యెదురు చూస్తూ కూచుంటే నిన్ను నరకందగ్గిర దిగపెట్టేసి పోతారు….కోపంవద్దురా—!"

"……………"

"లేచినట్టైతే నే చచ్చినట్టే! మావూళ్లో వున్న నీ చెల్లెల్ని చంపుకు తిన్నట్టే!"

ఒకవంక ఏడ్పింపు : ఒకవంక బుజ్జగింపు.

ఎంత సహిస్తే అంతే కానియ్యి. ఏదో పథ్యం పుచ్చుకున్నట్టు—"

ఏదో తినబోయాను. మొహం తిరుగుతోంది. గుండె దడ ప్రారంభమయ్యింది. నోరంతా వెగటుగానూ చేదుగానూ వుంది. అన్నం కంటికి కనపడడమే లేదు. అంతా చీకటి కమ్మినట్లయింది.

"ముందు ఇన్ని మంచినీళ్లుతాగు"

*   *   *

"పద—యింటికి—"

ఇల్లెక్కడుందో. నేనావేపే వెళ్లడం లేదు. "ఇక నన్ను వేధించకురా—"

ఒక రిక్షామీద నన్ను కూలవేసి ఇంటికి చేర్చి, మెల్లమెల్లగా మెట్లెక్కించేడు తనే తాళం తీశాడు. దీపం వేశాడు. నేమళ్లీ ప్రారంభించేను.

"నేనిక్కడ నుంచోలేన్రా…"

"ఆమాట నిజమే! మూడేళ్లు ఒకళ్లలో ఒకళ్ళయి ఇక్కడ గడిపేరు. ప్రతి వస్తువులోనూ… ఈ ఇంట అడుగడుగునా నాకామె కనపడుతుంది. అది తప్పదు. ఇల్లంటే మార్చెయ్యగలం గాని— వస్తువులన్నీ కొత్తవి కొనుక్కోలేము కదా!"

నే కూలబడిపోయాను.

వాడు మెల మెల్లగా ఇంటి సామానంతా సర్దసాగేడు. దుమ్ములు దులప సాగేడు. చీపురు తీసుకుని గది తుడిచి శుభ్రంచేశాడు. ఒక వంక ఏవేవో కబుర్లు చెప్పుకు పోతున్నాడు.

"సిగరెట్లింకా కాలుస్తున్నావా?"

"ఆమధ్య మానేశాగాని—"

"కర్మ మీ అత్తారు చేస్తున్నారా?"

"ఊఁ—"

"అమ్మాయితోటే నీకూవాళ్లకీ సంబంధం పోయింది. అంతేలే—"

"అక్కడికొచ్చెయ్యమన్నారు—"

"అవున్లే…మీ పెద్దత్తగారి కూతురుండా లనుకుంటా—"

"బి యస్ సీ జూనియర్ చదువుతోంది. అంతా వొచ్చేరు.—"

"ప్రభాకరం ఇప్పు డెక్కడున్నాడు? ఈ వూర్నించి బదలీ అయిపోయిందనుకుంటా—"

"మరదల్ని పెళ్లి చేసుకున్నాడు — రెండు నెలలు కూడా తిరక్కుండానే!"

ఎలా మనస్సొప్పుతుందో! ఏపిల్లా పీనూ వుంటే అనుకోవచ్చు...."

"దానికేంలే— అలా యెన్ని జరగడం లేదు?"

"మూడో మరదల్నిచ్చి చేసేరు. పెద్ద పిల్ల లిద్దరికీ పెళ్ళిళ్ళయి పోయాయ్‌ట. ఇద్దరికీ చాలా తేడావుంది కూడా—"

"దానికేంలే—అనేక కారణాల కొద్దీ అలా చేస్తారు...." అంటూ భార్యా భర్తల మధ్య వయస్సులో విపరీతపు తేడాలున్నా సుఖసంసారం చేస్తున్న డజను కేసులు ఏకరవు పెట్టేడు. ఇంతట్లోకే మాచిన్నప్పటి రోజులకు వెళ్ళిపోయాం.

కాలేజీ చదువులు— ఆడపిల్లలూ... మా కథావస్తువులయ్యేరు.

ఒక్కొక్కసారి నాదృష్టి పరావర్తనం చెందుతోంది.

"ఆవిడ పేరేమిటి?"

"ఏవిఁడ?"

"నువ్వినడం లేదు—"

"వింటున్నా."

"నీమొహం...ఆవిడ—మని రూం కెదురుగా వుంటేది—"

"పాపం! ఆవిడ చనిపోయింది. కూతురేమో అనుకునేవాళ్ళంకదూ చాలాకాలం......" నాకు తెలియకుండానే నా ముఖంలో ఒక నవ్వు కనిపించబోయింది. తన ఈడుకి తగిన అత్తగారిలోటే వుండేవాడు ఆయన.....ఆవిడ చనిపోయిందట. ఈ వూరు బదిలీ అయింది....చివరి రోజుల్లో మొగుడూ పెళ్లాలనిద్దర్నీ కలుసుకున్నా—"

* * *

బాబుని మరచి పోలేను. వాడునన్ను రక్షించేడు— దుఃఖం నుంచే కాదు, మృత్యువునుంచి కూడా.

ఆ మర్నాడే నన్ను వాళ్ళింటికి తీసుకుపోయి వారంరోజులు కడుపులో పెట్టుకున్నాడు. తిరిగి నన్ను నావూళ్లో దిగబెట్టేడు.

మెల్లమెల్లగా నేను నిత్య జీవితంలో ప్రవేశించాను. అన్ని సరదాలలోనూ కలగజేసుకుంటున్నాను. పనిలోకి వెడుతున్నాను. నారుగ్మతలు పోయాయి. ప్రపంచాన్ని అర్థం చేసుకుంటున్నాను.

బాబు ప్రయాణమయ్యేను. గట్టి గుండె కలవాడు.

"నేవచ్చినపని సక్రమంగా నెరవేరింది. నీ దుఃఖాన్ని ఉపశమింపచేశాను. ...... కన్నీళ్లు తేలికకాదు ...... వల్లరాళ్లు ... పిసపుగుండ్లు........."

ఒకసారి ప్రవాహంలో పడిన మనిషి వలె నేను గమనవేగానికి పడి కొట్టుకు పోసాగేను. నాకు తెలియకుండానే అన్ని జరిగిపోయాయి. బి. ఎస్. సి. అమ్మాయి చదువు చాలించి నా కాపరం నడుపుకు వెడుతోంది!

* * *

రెండు సంవత్సరాలు గడిచి పోయాయి. ఒకరోజు బాబుదగ్గర్నించిఒక కార్డువచ్చింది.

నా కళ్లు, తల, ప్రపంచం...గిరగిర తిరగసాగేయి. మళ్లీ మళ్లీ చదువుకున్నా నా వుత్తరాన్ని. నమ్మలేకపోయాను. నమ్మకుండా ఉండలేకపోయాను. వాస్తవ జగత్తులో నూటికి నూరుపాళ్లూ వచ్చిపడే విషయాలు ఇలాగే భ్రాంతి కలిగిస్తాయి.

"మహాలక్ష్మీ సమానురాలైన నా భార్య లక్ష్మీదేవి 10-2 1945వ తేదీ రాత్రి 10-30 గంటలకు స్వగృహంలోనే స్వర్గస్తురాలయింది."

ఎన్నిసార్లు చదివితేమాత్రం ఆ ఉత్తరం ఒక్క పిడుగుపడిన చోటుని స్పష్టంగా చూపుతూ కూర్చుంది.

నా స్నేహితుడికి అటువంటి కష్టం ముంచుకువచ్చింది. ఏనాడో వాడన్న మాటలు నాకు గుర్తుకు వచ్చేయి. నే వెళ్ళి వాడిని రక్షించాలి. ఇది నావిధి కాబోలు!..

నే గుమ్మం ఎక్కేసరికి - ఎదురుగా బల్లదగ్గర రాసుకుంటూ కనపడ్డాడు బాబు. ఇల్లంతా బంధువులతో కలకల్లాడుతూవుంది. కాని ఏదో మంచుపొగ క్రమ్ముకుని ఉన్నట్లు తోచకపోలేదు.

బాబు చాలా గంభీరంగా నే కనపడ్డాడు.

"వొచ్చేవా! సాయంత్రమే వొస్తా వనుకున్నా.. గోపిగా! సామాను లోపల పెట్టరా."

"ఎలాగ జరిగింది?"

"అంతా తోసుకొచ్చింది. జ్వరం. మూడురోజులు. ఏం కాంప్లికేషన్లు కూడా లేవు. మూసుకుపోయింది."

"ఉహుఁ. అని మాత్రం మూలిగేను.


వాడేమీ చెదరిపోయినట్లు కూడా కనపడలేదు. నేను బలహీనుడిని. గుండె దిట్టం లేనివాడిని. కానీ వాడి విషయం వేరు. వాడు మంచి వేదాంతి వ్యవహార దక్షుడు. కాలేజీ చదువు మినహా వాడు భావకవిత్వ మెకటే అబ్బింది. వాడు అలాగ కాదు: జీవితంలో బాగా దెబ్బలు తిన్నవాడు. పదిరకాల మనుష్యుల చిత్తవృత్తులను ఎరిగి మసలుకోనగల సమర్థుడు.

భార్య జబ్బును గురించి వాడు మాట్లాడుతోంటే ఏవిధమైన ఆవేదనా కనపడలేదు.

"దాని తల్లి - అక్క - తండ్రి అంతా వచ్చేరు. నా వేపు నెవ్వళ్లున్నారు కనక? మేనమామ అత్తా ఒచ్చేరు. మిగిలిన అందరు బంధువులకీ కూడా రాస్తున్నా. కర్మనాటికి అంతా దిగుతారు. నే వొక్కణ్ణే...అన్నీ ఎలాగ మోసుకుంటా? ఏం యుక్తుకు తెంగుకు వీల్లేదు. నువ్వు కొంచెం ఇల్లంతా మేనేజ్ చెయ్యాలి.."

నేనూ నా భార్య ఎలాగుండేవారిమో అంతకు తీసిపోకుండానే బాబు తన భార్యతో ఉండేవాడు. పెళ్లికి పూర్వం కొంత అటూ ఇటూ అనుభవం సంపాదించుకున్నాడని మిత్రులలో వాడుకపడ్డాడు కూడా భార్య అంటే అపారమైన అనురాగం కలవాడే అని యెరుగుదును

—కాని, విధికి తలవొగ్గి, మరుమాటాడకుండా శిక్ష అనుభవిస్తున్నాడు. నేకొంచెం



చంద్రగ్రహణం (మహాబలిపురం)

ఫొటో: సి. గురుమూర్తి—మద్రాసు.

ఆశ్చర్యం పోయాను. వాడు ఏడిపవడం కాని, ఏమువు మొగం పెట్టడం కాని, అఖరికి విచారించడంగాని నే చూడలేదు. వాడు నాకంటే ఎన్ని విధాల ఏమయిపోతాడో అని, అన్నింటికీ సిద్ధపడి వచ్చేను... వాడి కంటినీటి చుక్కైనా నే చివరికి చూడలేక పోయాను. మార్దవం వాడికి లేదు కాబోలు.

గట్టిగుండె అంటే నే నాడు అర్థం చేసుకు వచ్చింది.

కర్మ రోజులన్నీ సక్రమంగా జరిగిపోయాయి. అన్నిరకాల దానాలూ యథావిధిగా చేశాడు. భారీగా సంభావనలూ సంతర్పణాలూ జరిగించేడు. సుమారు ఒక వంద మంది బ్రాహ్మణాకం అఖరి రోజున సభతీరి కూర్చుని "ఆశీర్వచనం" చేశారు. తిరిగి వివాహం చేసుకుని గృహస్థాశ్రమం సాగించవలసిందని ఏకగ్రీవంగా నివేదించుకున్నారు.

మరి అయిదారు రోజులు అక్కడే ఉండి నేనుకూడా వెళ్ళిపోయాను.

* * *

ఆరు నెలలతర్వాత ఒక పెద్ద రిజిస్టర్ కవరు బాబువద్దనుంచి వచ్చింది:

"తమ్ముడూ! నేను నీకు చాలా విచారకరమైన సంగతులూ - నువ్వు జీవితంలో నమ్మలేనివీ - తెలియపరుస్తున్నాను...... నువ్వుకూడా వెళ్ళిపోయావు.

"ఆ రాత్రి సిలాంటి ఇంట్లో నే నొక్కడిని. నౌకర్లు - కూలీలు - పిరంతా పన్నమీద వచ్చి వెళ్ళేవారు. చివరికి, సాయంకాల మయ్యేసరికి నే నొక్కడిని మిగిలిపోయే వాడిని.

"నాకు తెలియని ఎన్ని వ్యవహారాల లోనో ఆమె ఇదివరకు కలగజేసుకునేది. అవన్నీ ఇప్పుడు నా నెత్తిమీద విరుచుకు పడిపోయాయి. అనుక్షణం ఆమెను గుర్తుకు తీసుకురాసాగేయి.

"ఇంక నాకు దిగులు ప్రారంభ మయ్యింది. ఆ యిల్లంతా నా భార్యది. ఆమె ఛాయ సంచరిస్తున్నది. ఏ వస్తువు చూసినా - ఆమె నీడ!...

"రానురాను రాత్రులు నాకు దుస్స్వప్న ప్రాయాలయినాయి.

"ఆమె ఉన్నంతకాలం నాకు విలువ లేదు. ఇప్పు డిక అసహాయుణ్ణి. ఏడవ డానికి ప్రయత్నించాను. నా వేదాంతం దుఃఖతిమిరానికి నన్ను దూరుని చేసింది. నాకు దుఃఖం అనే అదృష్టదేవత ప్రసన్నం కాలేదు.

"ఈ బ్రతుక్కు అవధి యేమిటో అర్థం కాలేదు.

"నేను రాను రాను అన్నిటికీ దూర మయ్యాను - సుఖానికి దుఃఖానికి! అశ గాని అడియాసగాని నాకు కేవలం ఛాయా మాత్రాలయ్యాయి. ఎందుచేతనో...

"జీవితం చివరకు ఒక భీకరస్వప్నంగా మారింది. నా గుండె బరువెక్కి, అంత కంతకు భరింపరానిదయింది. ఆ వేదన కరిగి కరిగి అశ్రువుల రూపంలో బయటికిపోవాలి. ఆ అదృష్టం నాకు లభ్యం కాలేదు.

"నీకు మళ్ళీ ఉత్తరం రాద్దా మను కున్నాను. పోనీ నీ దగ్గరకు చేరదామను కున్నాను. అందువలన ఇక లాభం లేదనీ, ఇప్పటికే ఆలస్యమైపోయిందనీ, నా శరీరం శిథిలించిపోయిందని స్పష్టం చేసుకున్నాను.

"ఈ ఉత్తరంతో నావీలు పంపిస్తున్నాను. నిన్ను కర్తగా నిర్ణయించేను. నా ఆశయా లన్నీ అనులంఘనవలసిన బాధ్యత నీమీద పెడుతున్నాను. నువ్వొక్కడివే నాకు ఆప్తుడివి.

"సౌఖ్యవంతమైన ఈ జీవితాన్ని భరింపలేక - నన్ను నేనే అంతం చేసుకుంటు న్నాను......"

మాబాబు గుండెబరువును నేను కరిగించలేకపోయాను. నా చేతులారా వాణ్ణి పంపి వేసినవాణ్ణయ్యాను. ★

విజ్ఞానవీధులు

"డాక్టర్"

206. తెలుగులో ఆధునిక విజ్ఞానం

తెలుగులో ఆధునికశాస్త్రవిజ్ఞానాన్ని వివరించే పుస్తకాలు తండోపతండాలుగా వస్తున్నాయి. వాటిలో ఏవి మంచివి? కొంచెం వివరిస్తారా అని రాజమండ్రినుంచి ఎ. విశ్వనాథముగారట అడుగుతున్నారు. ఈ ప్రశ్నను ప్రెసిడెన్సీ కాలేజిలో ఫిజిక్సు ప్రొఫెసరు శ్రీ పాద గోపాల కృష్ణమూర్తి గారికి పంపితిమి. వారిచ్చిన జవాబిది:—

విజ్ఞానశాస్త్రమును చాలమంది తెలుగులో వివరించుచున్నారు. వారి రచనలు నేడు చూడగా అసంఖ్యాకములుగా కనబడుచున్నవి. వాని యన్నిటి మంచిచెడ్డలను చదువరులకు తృప్తిగా వివరించుటకు ఈ ఉత్తరముయొక్క చిన్న ఆవరణగాని, నాకుగల కొద్ది విరామముగాని చాలదు. అయితే స్థాలీపులాకన్యాయముగా నా దృష్టి కందినంతమట్టు వివరించ ప్రయత్నింతును.

విజ్ఞానశాస్త్రమును గురించిన వ్యాసములుగాని పుస్తకములుగాని రచించుటకు ఒక వ్యక్తికి మూడు తాహతులు కావలెను. మొదటిది: ఆ వ్యక్తికి ఆ శాస్త్రము చక్కగా తెలిసియుండవలెను. తెలియకే ఇంగ్లీషు పుస్తకములు చూచి తెలుగులో వ్రాసి పారవేసినవారి వ్యాసములు న్యూస్ పేపర్ రిపోర్టులవలెనుండును. ఏమనగా, ఆ శాస్త్రశాఖలోని సత్యపరంపర ఈ విలేఖరులకు తెలియదు. కనుక సరిగా మనకు సందేహమువచ్చిన చోటనే వారు దాటివేయుదురు. రెండవ అధికారము: ఈ వ్యాసములు వ్రాయువారు బోధనాశక్తిగలవారుగా నుండదగును. ఆంగ్లేయులును, మిగిలిన పాశ్చాత్యులును పుట్టిన నాటినుండి వైజ్ఞానికసాధనసంపత్తి విశేషముగానున్న వాతావరణములో పెరిగినవారు, మనమూ మనబిడ్డలూ కాము. కనుక క్లిష్టమైన వైజ్ఞానికవస్తువును మనకు బోధపరచవలెనంటే శాస్త్రబోధనాపద్ధతులు తెలిసినవారు పట్టిననే వీలు. ఈ పద్ధతులు తెలియనివారు ఒక వైజ్ఞానికవిషయముచుట్టూ గంతులు వేసినట్లు వ్రాయుదురుగాని ముందుకు సాగుచున్నట్లు, దారము తీయుచున్నట్లు వ్రాయలేరు. మూడవ తాహతు: ఈ వ్రాయువారికి తెలుగులో వ్రాయుట అలవాటై యుండవలెను. వ్రాయుట అనగా స్వంతముగా ఊహలల్లి వ్రాయుట. ఏ పాశ్చాత్య వైజ్ఞానికుడు వ్రాసిన పుస్తకమునో పట్టుకొని తెలుగులో వ్రాయుట వ్రాయగలుగుట అనిపించుకొనదు.

ఈనాటి వైజ్ఞానిక రచయితలలో విస్సా అప్పారావుగారు, వసంతరావు వెంకటరావుగారు, డి. ఎ. ఎ. ఎస్. నారాయణరావుగారు, ఎ. వి. యస్. రామారావుగారు, హరి ఆదిశేషువుగారు, చేతన భట్ల విశ్వనాథంగారు నాకు తెలిసిన నిర్దుష్ట వైజ్ఞానిక రచయితలు. నాకు తెలియనివారు ఇంకా ఉండవచ్చును. వేమూరి విశ్వనాథశర్మగారు, మంత్రిప్రగడ సాంబశివరావుగారు, ఆచంట లక్ష్మీపతిగారు, కాళీపట్నపు కొండయ్యగారు నేడు వ్రాయడములేదు. అయితే ఈ శాఖలో మరియొక రకపు రచయితలున్నారు. ఆధునిక వైజ్ఞానికులు అదుగో పులి అంటే, 'ఇదుగో మన పురాణాలలో దానితోక' అని వాదించే రచయితలు వీరిలో మొదటిరకము. పేరులు చెప్పడము మర్యాదకాదు. అయితే ఏనాడో ఒకనాడు ఈ కలుపుతీత తప్పదు. ఈ రచయితల వ్రాతలవల్ల మన సంస్కృతిలో మఱుగుపడిపోయిన మాణిక్యాలు బయల్పడుతున్నాయనుకోడము అమాయికపు వెఱ్ఱి. బానిసలుగా వుండినన్నాళ్లు మన పూర్వులు చాలా గొప్పవారని బొజ్జ నిమురుకోవడము - న్యాయము కాకపోయినా - అర్థముచేసుకోదగిన మన సత్వమే. స్వతంత్రులమై వైజానిక ప్రపంచములో పురోగామి జాతులతో భుజము కలిపి సాగవలసిన నేటికాలములో, వీపునకు కళ్లు మొలిపించుకొని పౌరాణికుల విజ్ఞాన సంపత్తును త్రవ్వితీయడము దండుగపని. నలుగురిలో నగుబాటు. గొబ్బూరి వెంకటానంద రాఘవరావుగారి భారతి వ్యాసాలలో కాంతి తరంగ వాదము మన పూర్వు లెరుగుదురనీ, మరేమిటో ఎరుగుదురనీ చెప్పిన సంగతులూ, ఆచంట లక్ష్మీపతిగారు మనవారికి అణుశక్తి తెలుసునని వ్రాసిన సవాళ్ళూ, ఈ రకపు వ్రాతలే. ఇట్టివారికి ఒకటే సవాలు. దయచేసి ఆధునిక విజ్ఞాన పులుల తోకల్ని పురాణాల్లో కనిపెట్టడము తగ్గించి, ఒక్క పులిని, - అనగా నేటి వైజ్ఞానికులకు ఇప్పటికి తెలియని వైజ్ఞానిక విషయాన్ని మన పూర్వుల వ్రాతలలోనుంచి - కనిపెట్టండి. అప్పుడు ప్రపంచము మీవైపు తిరుగుతుంది.

ఇంగ్లీషు రచయితల పుస్తకాలు చదివి తనకు ఎంత అంకితే అంతమట్టుకు సంభాషణలుగా పెంచేసి వ్రాసే వైజ్ఞానిక రచయితలు వీరిలో రెండోరకము. వేమరాజు భానుమూర్తిగారు ఈ రకము వారు. వీరు ఏ విజ్ఞానశాస్త్రశాఖలోనూ ప్రత్యేక శ్రమ చేసినవారు కారు. వీరి ధీశక్తి తెలుగు వైజ్ఞానిక రచన పోరంబోకుభూమి అని కనిపెట్టుటలో కలదు. వీరి వ్రాత శక్తి తెలుగు దేశపు రచయితలందరిశక్తినీ మించినది. అంతలోనూ పత్రికల కార్యాలయాలలో పని చేసినవారు కనక వీరు వ్రాయగలిగినంత త్వరగా ఎవరూ వ్రాయలేరు. ఇక పుస్తకాలకు లోటేమిటి? వీటినిండా వైజ్ఞానిక చెత్త కావలిసినంత వుంటుంది. ఆంగ్లరచయితల పుస్తకములు చదివి తనకి అందినంత మట్టుకే పట్టివ్రాసి తయారుచేసిన గ్రంథాల్లో విజ్ఞానచెత్తకు లోటేమిటి? ఈ గ్రంథాలు విజ్ఞానశాస్త్రము తెలియనివారికీ, పుటలు త్రిప్పి చదవనివారికి గొప్ప ఆశ్చర్యము కలగజేస్తాయి. ఎంచబోతే మంచాని కన్నీ కంతలే. ఈ మేడిపండ్లు "వయోజన విద్యావ్యాప్తికి" "పిల్లలకోసం" అని ట్రేడ్ మార్కులు! తెలుగు వయోజనులూ, పిల్లలూ చేసిన కర్మము! అధికారులు వ్రాయడము లేదు. ఈ సాహసులు తప్పుల తడికలు వ్రాసి కుప్పలు పెట్టుతున్నారు. తప్పుల తడికలు వ్రాస్తున్నామే, ఏ అధికారి పట్టి జాడించునో అన్న భయములేదు వీరికి. ఎరగనివారి మనస్సులలో తప్పుటూహాలు ఎక్కించేస్తున్నామే అన్న బిడియములేదు. వ్రాసేవి మాత్రం ప్రపంచాలూ, వికాసాలూ, రహస్యాలూ, కథలూ, అన్నీనూ. నే నీమధ్య ఒక "ప్రపంచం" చూచాను. దానిలో ఒక వాక్యము "ఏదైనా ఒక వాయిద్యం పౌనఃపున్యం ఎంత ఎక్కువగా ఉంటే అది సృష్టించగల నాదం కూడా అంత ఎక్కువగా ఉంటుంది"ట! ఇంటటి రాతలనే పైన విజ్ఞాన చెత్త అన్నాను. పౌనఃపున్యం అన్నమాట విజ్ఞానానికి సంబంధించినది. రెండోమారు అన్న 'ఎక్కువ' అన్నమాట 'చెత్త.' ఏమిటి ఎక్కువగా వుంటుంది? రచయితకే తెలియదు. తెలిస్తే ఈ అవస్థ ఎందుకూ? ఈ 'ఎక్కువ' లాంటి చెత్తమాటలు ఆ పుస్తకం నిండా ఉన్నవి. ఉండ కెక్కడికి పోగలవూ? అవన్నీ స్వార్జితములాయె. ఏ పుస్తకంలోనుంచి పట్టుకున్న మాటో పౌనః పున్యం. దీని తత్వం చదవగానే తెలిసిపోతుందా? అందుకే సంభాషణాపూర్వకంగా—పిల్లలు తేలు పాకుతూంటే దానిని స్పృశించక లేక చుట్టూ, దూరంగా

గంతులు వేసినట్లు—పెంచి అరోపియం చేసివెయ్యడము. మరొక కథావాక్యం వినండి. "అంటే గాలి బరువుతగ్గి, బొగ్గుపుసి బరువు ఎక్కువ అయిందా? లేక ఎలాంటి మార్పూ రాలేదా?" అని ప్రశ్న. దీనికి జవాబు: 'నువ్వు ముందు చెప్పినట్లే అయింది. బొగ్గుపుసి బరువు తగ్గిపోయింది" అని. ఏమైనా అర్థం అవుతున్నదా? ఇంకొకచోట ఆక్సిజనును 'మండే గాలి' అన్నారు ఈయన. ఆక్సిజను తాను మండదు. మండిస్తుంది. 'మండించే గాలి' అని అనడానికి ఆ విషయము తెలియాలి, అది తెలియదు. అందుకే వైజ్ఞానిక శబ్దాలకు స్వంత చెత్త చేరుతుంది, మొత్తం గ్రంథ రూపంలో వైజ్ఞానిక చెత్త తయారౌతుంది. ఇది అచ్చువేసిన పుస్తకాలు 'కాగితాల ఖరాబు' కాదా?

వైద్యపు పుస్తకాలు చదివేసి వైద్యం చెయ్యడానికి జంకుతారంటారా ఈయన? శాంతం పాపం. ఆంధ్రుల మెదడులమీద ఈయనకున్న అవజ్ఞ వారి ప్రాణాలమీద లేదు రక్షించి.

ఏమండీ ఇంత కటువుగా వ్రాస్తున్నారూ? కొంచెమేనా మొగమాటము లేకుండా? అని చదువరులు నన్నడుగవచ్చును. ఈ విజ్ఞాన చెత్తపుస్తకాలు వయోజనులమీదా మీ పిల్లలమీదా మా పిల్లలమీదా కురిపించడానికి వారికి మొగమాటము లేనప్పుడు అది చెత్త అనడానికి మనకు మొగమాటమేల? వారు తెలుగువారిమీద దాక్షిణ్యము పెట్టుకుని సైన్సుగురించి వ్రాయడము ఇప్పటికేనా మానితే అది వయోజనులకూ పిల్లలకూ నేను చేయించిన ఉపకారమే అని సంతోషిస్తాను. ఆ సదాదర్శమే నాచేత ఇంత కటువుగా వ్రాయించింది. కథలూ, నాటకాలూ, ప్రయాణలేఖలూ, కావ్యాలూ ఎన్ని లేవు వ్రాయాలంటే? దిక్కుమాలిన సైన్సుని పట్టుకుని తప్పులువ్రాసి ప్రచారము చెయ్యడము ఎందుకూ? ★

జ్యోతిషము

శ్రీ వసంతరావు వెంకటరావుగారు ఇలా వ్రాస్తున్నారు:

(6-4-55 'ఆంధ్ర వారపత్రిక' లో 'డాక్టర్' వేసిన ప్రశ్నలకు సమాధానం)

"ఈ చర్చలో నా జ్యోతిష శాస్త్రాభిమానంగాని దురభిమానంగాని ప్రధానం గాదు. మీ సందేహాలకు సమాధానం:

(1) 'ఆ నిర్వచన ప్రకారం' అనుముందున్న పదాలకు కూడా రెండవగీత గీసి ఉన్నట్లైతే వైరుధ్యం కనిపించకపోను. మూడు నాలుగు వాక్యాలలో రెండు అభిప్రాయాలున్నాయి. ప్రాచీను లార్జించిన విజ్ఞానం గురించి ఒకటి; వినియోగంలో జ్యోతిషానికి అనుభవిక శాస్త్రంపాటి స్థానం లేకపోలేదని రెండవది. రెండూ యథార్థాలే. జ్యోతిషం ఆధునికుల సృష్టికాదు. అనుభవిక శాస్త్రంపాటి పాటవం దానికి లేకపోతే ఇంతకాలం జ్యోతిషం మనకలిగేదికాదు. 'శాస్త్రం' అంటే కేవలం భౌతిక విజ్ఞానమేకాదు; ప్రయోగ పూర్వకంగా నిరూపితమైన జ్ఞానభాగాలేకాదు; తర్కం, వేదాంతం, ధర్మశాస్త్రం మొదలైనవి కూడా శాస్త్రాలే. స్థూలంగా వాటిని రెండు వర్గాలుగా వ్యవహరించడానికి ప్రయోగ (*Experiment*) పద్ధతులపై పెంపొందిన ఆధునిక భౌతికశాస్త్రాలను 'విజ్ఞాన' (*Science*) పదంతోను, వాటికి భిన్నమైనవాటిని 'శాస్త్ర' పదంతోను నిరూపించుకుంటే మంచిది. విజ్ఞానానికైనా శాస్త్రానికైనా పరమావధి సత్యాన్వేషణమే. జ్యోతిషము అనుభవిక శాస్త్రమన్నప్పుడే అది భౌతిక విజ్ఞానస్థాయి నందుకోలేదని స్పష్టం. అందుచేతనే ప్రయోగం, పరిశీలన, ఊహనం ప్రాతిపదికలుగాగల ఆధునిక విజ్ఞానంలో జ్యోతిషం చేరదని స్పెన్సర్ జోన్స్ అన్నాడు. అంతేకాని, 'జ్యోతిషం గుడ్డెద్దు తాపు' అనడానికాయనకు సాహసం లేకపోయింది. భౌతికాని కతీతమైన శాస్త్రాలున్నాయని గుర్తించిన విజ్ఞానవేత్త జోన్స్.

(2) నభోమూర్తులకూ, ఆకాశంనుండి భూమిపై పడుతున్న ప్రసారానికీ జీవులకూ గల సంబంధాన్ని 'విజ్ఞానశాస్త్ర విద్యార్థుల సంఘం' వారు గుర్తించకపోవడమే కాక, "మీవంటి భౌతికవిజ్ఞాన పరిచయం గలవారు గురుత్వాకర్షణా, రకరకాల (!) విద్యుదయస్కాంత తరంగాలూ, సముద్రాలలో కల్లోలాలూ 'జ్ఞాపక ముంచుకొన్నప్పుడు' మానలేక కనిపెట్టిందంటారా?" అని ప్రశ్నించడం శోచనీయం. ఆ ప్రశ్న వైజ్ఞానిక మనస్తత్వాన్ని ప్రదర్శించదు. పైగా, 'రకరకాల' తరువాత 'ఆశ్చర్యార్థకం' చాలా ఆశ్చర్యకరం. అత్యంత స్వల్ప తరంగ దైర్ఘ్యంగల కాస్మిక్ కిరణాలనుండి గామా కిరణాలు, ఎక్స్ కిరణాలు, అతి నీలలోహితకిరణాలు, పరారుణ కిరణాలు, ఉష్ణతరంగాలు, హెర్ట్జ్ తరంగాల వరకు కోటానకోట్ల తరంగాలున్నాయని ప్రాచీనులు చెప్పినది కాదు (నే నెరిగినంతవరకు); సూక్ష్మయంత్ర సాహాయ్యంతో ఆధునిక విజ్ఞానులు కనిపెట్టి ప్రకటించిన నిర్వివాద విషయం. అనిరోధ్యమైన కాస్మిక్ కిరణాలు జీవులను అనుక్షణం మర్దిస్తూ, సెకనుకి 100 అణువులను మానవశరీరంలో భగ్నంచేస్తున్నాయని ప్రాయోగికంగా వారు నిరూపించేరు. వ్రణాలను మాన్పడంలో వినియోగింపబడుతూన్న గామాకిరణాలవిషయం తెలిసిందే; రేడియో ధార్మికపదార్థాలనుండి వెలువడే కిరణాలవి. వైద్యంలో సహాయపడుతూన్న అతినీలలోహితకిరణాలు, పరారుణకిరణాలు ఆసుపత్రులలో నిత్యం వాడుకలో నున్నాయి. వీటిని ప్రత్యక్షంగాచూస్తూ 'మానలేక కనిపెట్టిందటారా?' అంటే, ఆ ప్రశ్న ఏదృష్టితో వేసినట్లు భావించాలి? తెలిసినజ్ఞానాన్ని అంగీకరించడానికి ఇష్టంలేకపోవడంచేతనా?

(3) 'గుడ్డెద్దుతాపు' సామెత అర్థంకాకకాదు. 'తగిలినప్పుడు తగులుతుంది, లేకపోతే లేదు' అన్న భావం వాతావరణ విజ్ఞానవిషయంలోగాని, స్టాటిస్టిక్స్ విషయంలోగాని వెలిబుచ్చుతామా? అట్టి అనుభవికశాస్త్రాలపాటి తాహతు జ్యోతిషానికున్నప్పుడు దాని నావిధంగా తృణీకరించడం న్యాయమా?

ఇంతకూ, "ఈనమ్మకాని కాధారమైన పునాదులు నిలిస్తే కావలసినంత ఆధునిక శాస్త్రవినోదం చేసుకోవచ్చు" నన్నారే, ఈచర్చ వినోదానికా? విజ్ఞానానికా? విజ్ఞానానికి సంబంధించిన విషయాలు వివరిస్తే అది వినోదమా? వినోదానికైతే ఇదంతా వ్యర్థమని గమనించడం మంచిది. చర్చాంశం చాలా క్లిష్టమైనది. అభివ్యక్త వైరుధ్యం గోచరిస్తూన్న రెండుభావాలను సమన్వయంచేయడానికి ప్రయత్నం. దానికి సాధనసంపత్తిగా ఆధునికవిజ్ఞానాభిప్రాయాలను వినియోగించుకోవాలి. వినోదానికంత మాత్రమూ కాదు; మానసికంగా శ్రమించి జ్ఞానాభివృద్ధిచేసికొని ఉపయోగించడానికే!

క్రిందటివ్యాసంలో మొదటి మూడు పేజీలు అప్రస్తుతవిషయాలపై వ్రాసేనని కత్తిరించేరు. కాని, నా వ్యాసానికి మూలాధారమదే. ఇప్పుడైనా అవి ప్రచురిస్తే చదువరులు నా భావక్రమాన్ని పరిశీలించే అవకాశం కలుగుతుంది. నిజాన్ని తేల్చడం మనమనుకొన్నంత సులభంగాదని నిరూపించడానికే ఆ మూడు పేజీలు ఉద్దేశింపబడ్డాయి. భౌతికవిజ్ఞానంలో ఇదివరకు ప్రత్యక్షానికున్న ప్రాముఖ్యం ఇప్పుడు లేదు. విజ్ఞాన చరిత్ర దానిని స్పష్టంచేస్తుంది. యంత్రాల సహాయంలేని మానవుడు ఈ యుగంలో ఒక్క అడుగైనా ముందుకి సాగలేడు. అందుచేత, భౌతికవిజ్ఞానమే జ్ఞానసర్వస్వమని భావించడం పొరపాటు.

* ఇక అధ్యాత్మ విషయమంటారా? దానికి రుజువేమిటి? సాక్ష్యమేమిటి? భౌతికాన్నీ ఐహికాన్నీ ఏవగించి తృణీకరించిన ఆత్మశక్తి సంపన్నులు ఇప్పుడూ ఉన్నారు. ఈమధ్యనే పరమపదించిన శ్రీ రమణమహర్షి, శ్రీ అరవిందుల ప్రభావాన్ని పాశ్చాత్యులు అనుభవించి ప్రకటించేరు. అది చర్చించవలసినవిషయంగాదు, చర్చవల్ల తేలేదికాదు. అనుభవం దానికి ప్రధానం.

★ విజ్ఞాన వీధులు ★

ఇంతవరకు భౌతికవిజ్ఞానాని కది లొంగలేదు. అధ్యాత్మ బల సంపన్నుల శక్తిపాతాన్ని అనుభవించినవారు దానిని విధిగా గుర్తిస్తారు; లేనివారు నమ్మకపోవచ్చు. నమ్మిక లేనివారితో చర్చించిన ప్రయోజనం లేదు; ఏమంటే ప్రయోగాలవల్ల రుజువయే విషయంగాదది.

"మా మనస్సులలో ఆధునిక విజ్ఞాన పద్ధతులకీ జ్యోతిషశాస్త్రపద్ధతులకీ నడుమ కంచుగోడ లున్నాయి" అన్నారు. నిజమే. కాని ఆ 'కంచుగోడలు' దుర్భేద్యం కావనీ, వాటిలో జొరబడి దూసికొనిపోయి చూడగల శక్తిని మనం సంపాదించిననాడు అవి ప్రతిబంధకాలు కాజాలవని నా అభిప్రాయం.

ఇక నా ఉద్దేశంలో:

1. ఆధునికవిజ్ఞానపద్ధతులకూ జ్యోతిషశాస్త్రపద్ధతులకూ వ్యత్యాసముంది.

2. అయినప్పటికి జ్యోతిషం అనుభవిక శాస్త్రస్థాయీ నందుకొంది. జ్యోతిషంలో కూలంకషప్రజ్ఞ గలవారు దాని 'శాస్త్ర' స్థానాన్ని ఇప్పటికీ నిలబెట్టుతున్నారు.

3. రకరకాల తరంగాలకూ జీవులకూ గల సంబంధాన్ని ఆధునికవిజ్ఞానులే సహేతుకంగాను ప్రయోగపూర్వకంగాను రుజువు చేసేరు.

4. భౌతికాని కతీతమై, అతీంద్రియమై, కేవలం మనస్సుచేతనే సాధింపవలసిన అపార క్షేత్రముంది. దానికి సంబంధించిన జ్ఞానం ఇట్టి చర్చలవల్ల సమకూఱేది కాదు. మన నమ్మకాలతో దానికి ప్రమేయం లేదు. ఆజ్ఞానం సంపాదించడానికి మనస్సును అదుపులో నుంచాలి. ప్రయోగంవల్ల రుజువు కాలేదని ఆ జ్ఞానభాగమే లేదంటే ఎవరైనా ఏ సమాధాన మీయగలరు ?"

* * *

మేము వెంకటరావుగారిని 'దయచేసి మీకు శాస్త్రం అంటే ఉన్న అభిప్రాయం వివరించండి' అని కోరితిమి. మా వేడికోలు నేరుగా పాటిస్తూన్నట్టు అగుపడకపోయినా మొత్తమ్మీద ఏదో విధంగా వారికి శాస్త్రం అంటే ఉన్న అభిప్రాయాన్ని చెప్పినారు వెంకటరావుగారు. వారి (6-4-55) ఉత్తరంలో తమ అభిప్రాయంగా "(జ్యోతిషం) శాస్త్రం కాకపోతుందా?" అనీ స్పెన్సరు జోన్సు అభిప్రాయంగా "జ్యోతిషం శాస్త్రం కాజాలదన్నాడు" అనీ వ్రాశారు వెంకటరావుగారు. కాగల కార్యం జోన్సు అభిప్రాయమే తీర్చగలదని ఈ వ్యతిరేకతని వివరించమన్నాము మేము. దానికి సమాధానముగా వారు ఈ సంచికలోని ఉత్తరంలో "ఆ నిర్వచన ప్రకారం జ్యోతిషం శాస్త్రం కాజాలదన్నాడు" అని కలిపి చదువుకుంటే వైరుధ్యం కనిపించకపోను' అని రాస్తున్నారు. ఆ నిర్వచనమా? ఏ నిర్వచనమూ? ఇప్పుడు ఎన్ని పదాలదాకా రెండో గీతని పొడిగిస్తే చూడగలమూ ఆ నిర్వచనాన్ని? ...పోనీలెండి. ఆ వుత్తరంలో లేనిదాన్ని ఈ వుత్తరంలో 'ప్రయోగం, పరిశీలన, ఊహనం ప్రాతిపదికలుగా గల ఆధునిక విజ్ఞానంలో జ్యోతిషం చేరదని స్పెన్సర్ జోన్స్ అన్నాడు' అని వివరించారు. అదే చాలు. ఈ చర్చలో, మీరు మొదట అన్నట్టు అభిమానంగాని దురభిమానంగాని ప్రధానం కాదుగదా? ఈ వివరానికి ముందు "ప్రయోగ పద్ధతులపై పెంపొందిన ఆధునిక భౌతిక శాస్త్రాలను విజ్ఞాన పదంతోను, వాటికి భిన్నమైనవాటిని శాస్త్రపదంతోను నిరూపించుకొంటే మంచిది" అని చెప్పి, 'జ్యోతిషము...భౌతిక విజ్ఞాన స్థాయీ నందుకోలేదని స్పష్టం' చేశారు. ఈ అభిప్రాయాన్ని ఉపయోగించే మేము విజ్ఞాన వీధులు 13, 32, 125, 129, 199 శీర్షికలలో విజ్ఞాన పద్ధతులతో జ్యోతిషాన్ని విమర్శించాము. అయితే వెంకటరావుగారిని ఎక్కువగా బాధించిన మా మాటలు 'జ్యోతిషము దబ్బ గుడ్డెద్దు తాపు' అన్నవి. అందుకే 'వాతావరణ విజ్ఞాన విషయంలోగాని స్టాటిస్టిక్సు విషయంలోగాని ఈ భావం వెలిబుచ్చుతామా?' అన్నారు. వాటి దురదృష్టమా యని ఈ రెండుశాస్త్రాలూ అనుభవిక శాస్త్రాలైపోయినవి వెంకటరావుగారి దృష్టిలో. బోల్ట్జుమన్, ఫెర్మిడిరాక్, బోస్, అయిన్‌స్టీనులు గణిత శాస్త్రోపయోగంవల్ల నిర్మించిన స్టాటిస్టిక్సు అనుభవిక శాస్త్రాలా? వాతావరణ శాస్త్రంలో ప్రయోగం, పరిశీలన, ఊహనం లేవని వెంకటరావుగారు అనగలరా? కృత్రిమవర్షం ఈ మూడూ లేకుండానే కనుక్కున్నారని వారి అభిప్రాయమా?

అసలు సంగతి ఏమిటంటే "గుడ్డెద్దు తాపు" అన్న మాటలు తెలుగైపోయాయి. మాకు సంస్కృతమురాదు. అందుకని తెలుగులో చెప్పినాము. "దృశ్యా దృశ్యం" అని మేమనియుంటే ఒప్పుకునేవారేమో వెంకటరావుగారు. రెండింటికీ పెద్ద భేదమున్నదా ?

మేము వెంకటరావుగారి తొలి (6-4-55) ఉత్తరంలో సూచించిన రెండవ వైరుధ్యం ఇది: వారు "(అతీంద్రియజ్ఞానాన్ని సంపాదింపవచ్చు;) ప్రాచీను లావిధంగా సంపాదించేరు." అని ఒకచోటా "జ్యోతిషానికి అనుభవికశాస్త్రంపాటిసానం లేకపోలేదు" అని వేరొకచోటా వ్రాశారు. అతీంద్రియ శక్తివల్ల నిర్మితమైనదానికి అనుభవికశాస్త్రగతి పట్టినదేమి? అనుభవిక అంటే నరమానవుల అనుభవికమేకదా? దానిని నిర్మించడానికి కావలసిన స్థూలానుభవము! మానవులది. ఇక అతీంద్రియశక్తికి పని యెక్కడ?... ఇక్కడ కథ అడ్డంగా తిరుగుతోందని మేముసూచిస్తే వైరుధ్యం చూసుకోకపోవడమేకాక "రెండూయథార్థాలే" అంటారేమిటీ?

(2) లో వెంకటరావుగారు మా ప్రశ్న యొక్కలక్ష్యాన్ని తప్పించి విమర్శించారు. అయినప్పటికీ వారు వ్రాసిన సమాధానమునుంచి మేమసలు రాబట్టదలచిన వివరణను ఎత్తిచూపే యత్నము చేస్తాము. వారు తమ తొలి (6-4-55 నాటి) ఉత్తరంలో "మానవులకు ... నభోమూర్తులకు సంబంధం లేదని అనలేరు. (ఆ సంబంధాన్ని వివరించేది జ్యోతిషం)" అన్నారు. ఆ సంబంధమును గురుత్వాకర్షణా, రకరకాల విద్యుదయస్కాంతతరంగాలూ - అన్నీ సూచిస్తున్నాయన్నారు. ఈ ఆఖరిభౌతిక సంబంధము ఆధునికులు కనుక్కున్నది. మరి జ్యోతిషమో ? 'ఆధునికుల సృష్టి కాదా'యెను. "ఎప్పుడో పూర్వకాలంలో కనుక్కున్న జ్యోతిషం ఆ సంబంధాన్ని వివరిస్తోంది" అంటున్నారేమిటీ? ఈ గురుత్వాకర్షణాది విజ్ఞాన సూత్రాలకి పూర్వులు కనుక్కున్న జ్యోతిషంతో సంబంధం కలుపుతున్నారేమిటి? అని మాకు సమస్య వచ్చింది. వెంకటరావుగారుగాని "ఆధునిక విజ్ఞానమంతా పూర్వులు గ్రహించేశే వుండినారని" నమ్మేవారిలో చేరి, "గురుత్వాకర్షణాది భౌతికసూత్రాలకి పూర్వులు అతిభౌతిక వ్యాఖ్యానం జ్యోతిషంద్వారా చేశారు" అని వాదించబోతారేమోనని ఆ సంగతిని తేటతెల్లము చేసుకుందామని—వారి జాగా తెలుసుకుందామని—నభోమూర్తులకున్నూ మానవులకున్నూ (మీరు వివరించిన) సంబంధము ప్రాచీనులు కనుక్కున్నదా? లేక మీవంటివా (ఆధునిక) విజ్ఞాన పరిచయం గలవారు (జ్యోతిషము మీది అభిమానాన్ని) మానలేక (ఎలాగో ఒకలాగు ముడిపెట్టడానికి) కనుక్కున్నదా?" అని ప్రశ్న వేశాము.

ఈ వుత్తరంలో వెంకటరావుగారు "కోటానకోట్లు తరంగా లున్నాయని (నే నెరిగినంతవరకు) ప్రాచీనులు చెప్పినది కాదు. సూక్ష్మయంత్ర సాహాయ్యంతో ఆధునిక విజ్ఞానులు కనిపెట్టిన...విషయ"మన్నారు; ఈ కిరణాలకు మానవశరీరముపైగల భౌతిక ప్రభావాన్ని వివరించారు. ఈ భౌతిక

(55-వ పేజీ చూడండి)

గణితశాస్త్రవేత్త

శ్రీ|| శ్రీ||

ఈ నెల 18 వ తేదీన ప్రఖ్యాత గణితశాస్త్రవేత్త ప్రొఫెసర్ ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ కాలధర్మం చెందాడు ఈయన యూదుజాతి వాడు జర్మనీలోని ఉల్మ్అనే పట్టణంలో 1879 లో జన్మించాడు,

ఐన్‌స్టీన్ గొప్పశాస్త్రవేత్త అవుతాడని ఆరోజుల్లో ఎవరూ అనుకోలేదు చదువులో ఆయన మిగతా పిల్లలకంటె బాగా వెనకబడి వుండేవాడు ఆరోజుల్లో ఉపాధ్యాయులూ, సహాధ్యాయులూ అందరూ ఆయన్ని తెలివితక్కువ వాడుగా జమకట్టారు.

ఆ తెలివితక్కువ బాలుడే 1905 లో హఠాత్తుగా ప్రపంచ ప్రసిద్ధ గణితశాస్త్ర వేత్తలలో ఒకడయ్యాడు బ్రహ్మాండమైన యీ విశ్వం యావత్తూ ఏసూత్రాలమీద ఆధారపడి వ్యవహరిస్తోందో నిర్వచించటానికి ఆయన గణితశాస్త్రం, భౌతిక శాస్త్రంద్వారా పరిశోధనలుచేశాడు ఆయన కనిపెట్టిన సిద్ధాంతాన్ని "సాపేక్ష సిద్ధాంతం" అంటారు ఆ సిద్ధాంతాన్ని బాగా అవగాహన చేసుకున్నవాళ్లు ప్రపంచంలో పది పన్నెండుమందికంటె ఎక్కువమంది లేరట! అందుచేత దాన్ని విశదీకరించడం కష్టమే

అయితే ఒకసారి ఐన్‌స్టీన్‌ని ఎవరో అడిగారట "సాపేక్షసిద్ధాంతం అంటేఏమిటి?" అని దానికాయన ఇచ్చిన సమాధానం:

"మనకి యిష్టమైనవాళ్ళతో మాట్లాడుతూ కూర్చుంటే రెండు గంటలు రెండు నిమిషాల్లాగా గడిచి

(49-వ పేజీ చూడండి)



29

విజయవాడ స్టేషన్‌నుంచి జనం గుంపులు గుంపులుగా బయటికి వస్తున్నారు, అప్పుడు రాత్రి ఎనిమిదిగంట లవుతోంది, చీకటి దట్టంగా అలుముకునివుంది స్టేషన్ లైట్ల కాంతిలో ఏడుకొండలు మెరిసే సిల్కు చొక్కా, లాంగ్‌క్లాత్ పైజమా తొడుక్కుని స్లిప్పర్సు కీచుకీచు మంటూవుంటే దర్జాగా నడిచి వొస్తున్నాడు, బ్రాకెట్ కంపెనీ వేపుగా స్టేషన్ దగ్గిర కొండచీకట్లు దట్టంగా అలుముకున్న చోట, నలుగురైదుగురు నుంచుని అతనికోసం ఎదురుచూస్తున్నారు బీడీలు కాలుస్తూ

జట్కాస్టాండు ఉదయం కురిసిన వర్షానికి రొచ్చుగా తయారై వాసన కొడ్తూంది అక్కడా ఎవరో కూచునివున్నారు, ఏడుకొండలు, జట్కాస్టాండ్‌లో కెళ్లాడు కొండపక్కన నుల్చున్నవాళ్ళు ఏడుకొండల్ని గుర్తుపటారు వాళ్ళూ మెల్లిగా స్టాండ్‌లోకొచ్చారు

వెంకటప్ప అన్న అతను, మెల్లిగా అతన్ని పలకరించాడు ఏడుకొండలు తప్ప మిగతావాళ్ల మొహాలు దీనంగా వున్నాయి ఆకలీ నైరాశ్యం వాళ్ల మొహాలలో తాండవిస్తున్నాయి మాసిన దుస్తులతో నీరసంగా వున్నారు వాళ్లు

ఏడుకొండలు వాళ్ళవేపు జాలిగా చూశాడు అతను వరదరాజుతో కలిసి మదరాసు వెళ్లి రెండు నెలలయింది

వెంకటప్ప "నిన్నటి అమావాసకి మీ రిడనించి యెల్లి రెండు నెల్లవుతుందిరా" అన్నాడు

"అవును ఏం జరిగిందో తెల్సా?" అని ప్రారంభించాడు ఏడుకొండలు

అందరూ ఆశతో వింటున్నారు

"ఆయేల మేం స్టేషన్ కెళ్ళాంంతే ఓ మైనర్‌గాడి జేబు బాగా బరువుగా కనపడ్డది ఇంకేం, ఆడి యెంబడి పడ్డాం ఆడు ఇక్కడ దొరికేట్టులేదు జనంకూడా ఉషారుగా వుండారు ఆడితోపాటే బండెక్కేశాం ఇంకేడికి పోతాడులే అని మెయిలు ఒంగోలు పొయ్యేసరికల్లా దొరికిండు, బండిలో అందరూ తూగుతుండారు, బండేమో బలే వేగంతో పరిగెడతాంది వరదరాజు నూకిండు బండిలో ఉట్టుంటే పని సాగేట్టులేదు ఏందోచేసిండు, లైట్లు ఆరిపొయ్యాయ్ ఇంక సీకట్లో నేనే " ఏడుకొండలు రేకుల షెడ్డులో కలయజూశాడు ఎవరో ఇద్దరు ఇంకో మూల కూచుని చుట్ట కాలుస్తున్నారు అదేం పొగాకోగాని వాసన దుర్భరంగా వుంది బండి లాగటానికి పనికిరాని ఓ రోగిష్టి గుర్రం ఇంకో మూలపడి రొచ్చులో పొర్లుతోంది

"తర్వాత ఏమైంది?" అని ప్రశ్నించాడు వెంకటప్పడు ఆసక్తిగా

"యాముందిలే నేను ఆడి పర్సయితే లాగేసి వరదరాజు కిచ్చినా కాని, ఆ యెదవ మేలుకుని, నా చెయ్యి లంకించుకుని ఒకటేమైన గోల సాగించిండు ఇంతలో జనం లేచిండ్రు ఇంకేం! నెల్లూరుకాడ నన్ను పట్టుకుని తలా ఒక తన్నుతన్ని, పోలీసుల కప్పజెప్పారు "

"మరి వరదరాజు?"

"ఆ డెప్పుడో ఆ పెట్టెదిగి ఇంకో పెట్టె కెక్కిండు "

"ఆడు బలేవాడ్లేరా "

"తర్వాత, నన్ను నెల్లూరులో సోదా చూశారు నా దగ్గిరేం దొరకలేదుగా! అయినా వొదల్లా నెల్రోజులు కొట్లో పెట్టారు ఈలోగా వరదరాజు ఊళ్లోనే వుండిపోయాడు" ముగించాడు ఏడుకొండలు

వెంకటప్పకీ, ఇతర స్నేహితులకీ ఈ కథ నచ్చింది

"ఎంతదొరికిందిరా?" వెంకటప్పడి పక్కనే నుల్చున్న ఇంకొకడు ప్రశ్నించాడు

ఏడుకొండలు, "ఆ రొండల చిల్లరవుంది పర్సులో అందరికీ పంచేదామని మొదట అనుకున్నాం కాని పంచితే మూడురోజుల్లో జల్సాచేసేస్తారు అనుకున్నాం " అన్నాడు స్నేహితుల మొహాల్ని ఆసక్త వెలుగులో చూస్తూ

స్నేహితుల ఆసక్తి హెచ్చుతోంది ఆరొండలు! పంచితే . తలా అరవై చిల్లర వొస్తుంది మళ్లీ వీడు 'కానీ' అంటున్నాడేమిటి?

ఏడుకొండలు చెప్పసాగాడు, "అందుకని, బ్రాకెట్‌కంపెనీ పక్కన వీరయ్య టీ షాపు లేదూ? అది అడబ్బెట్టి కొనేశాం దానిమీద నొచ్చేలాభం పావలో బేడో తలా, కొస్త పంచుకుందాం కూటికీ, టీకీ కరువుండదు!" అన్నాడు

వెంటనే స్నేహితబృందం దీనికి హర్షించలేకపోయినా, పది నిమిషాలు ఆలోచించాక మెల్లిగా ఆమోదించారు ఆమోదించక చేసేదిలేదు టీషాపు కొనేశాడుగా

"వరదరాజు ఏడీ?" అని ప్రశ్నించారు, మిత్రులు

"ఏడికో పోయిండు కొంచేపటికి సెంటరుకాడి కొస్తానన్నాడు, నే యెల్లి మాట్లాడివస్తా రేపు టీ కొట్టు మనదీ వరదరాజువొచ్చి టీపార్టీ చేస్తాడు జనాన్ని కొట్టుకురండి " అంటూ ఏడుకొండలు లేచాడు

మిగతావాళ్ళ మొహాల్లో తృప్తి, ఆశా మెరిశాయి, స్టేషన్ లైట్ల వెలుగులో



విగ్రహం (మహాబలిపురం) —ఫోటో: ఓ. రామమూర్తి, మద్రాసు.

ఎందుకో ఏడుకొండలు ఒకటి రెండు నిమిషాలు ఆలోచించాడు. "పదండిరా. అందరం వీరయ్యదగ్గర టీ తాగివద్దాం" అంటూ టీ కొట్టువైపు దారితీశాడు.

టీ షాపు ఎలక్ట్రిక్ లైట్లతో వెలిగిపోతోంది. జనం ఏమంతగా లేరు. మురికిపట్టిన బల్లలనిండా ఈగలు వాలుతున్నాయి. ఏదో భరించరాని దుర్వాసన టీ వాసనతో కలసి వ్యాపించింది. ఏడుకొండలతో సహా గ్యాంగు మొత్తం, టిఫిన్ తిని, టీ తాగారు. ఏడుకొండలు పర్సుతీసి, తలా రెండురూపాయిలిచ్చి—గవర్నర్ పేట సెంటర్ కేసి చకచక నడవసాగాడు. పశ్చిమాన చవితి చంద్రుడు ఎర్రగా కొనలు తేలి వొంపుగా, భీతిగొల్పుతూ కన్పిస్తున్నాడు, మబ్బు తెరలచాటున. వీధులన్నీ బురదగావున్నాయి. సినిమాహాళ్ళ దగ్గర జనం కోలాహలంగా చేరుతున్నారు. లౌడ్ స్పీకర్లు పాడిన పాటలే పాడుతున్నాయి. మొత్తంగా విజయవాడ బహు సంచలనంతో వున్నదా తొమ్మిది గంటలవేళ.

గవర్నర్ పేట సెంటర్ లో మూల తిరుగుడుమీద వున్న హోటల్ కిళ్ళీకొట్టుముందు వరదరాజు, గ్లాస్కో లాల్చీ గ్లాస్కో పంచె కట్టుకుని, నిలబడివున్నాడు. ఖరీదైన సిగరెట్ కాలుస్తున్నాడు.

ఏడుకొండలు వెళ్లి అతన్ని కలుసుకున్నాడు.

వరదరాజు చిరునవ్వు నవ్వుతూ పలకరించాడు. "ఏంరా! ఏమున్నారాళ్లు! వొప్పుకున్నారా?" అని అడిగాడు;

ఏడుకొండలు చుట్టూచూశాడు, ఇక్కడెందుకు మాట్లాడ్డం అన్నట్టు. వరదరాజుకి చూపు అర్థమైంది. "పదవోయ్ మాట్లాడుతూ యెల్దాం" అంటూ మెల్లిగా నడవసాగాడు, బందర్ రోడ్డు వేపుగా.

ఏడుకొండలు, "మనం అనుకున్న కతే చెప్పా ఆళ్ళకి. వొప్పుకున్నారులే...అదిసరేగాని, సుట్కేసెట్టి ఏడపెట్టినావు? భద్రంగావుందా?" అని ప్రశ్నించాడు.

వరదరాజు పకపక నవ్వాడు, అతని మామూలుప్రకారం. "ఓరి పిరికియెదవా! ఇంకా నీకా చలి వొదల్లేదంట్రా? నేనేం యెదవననుకున్నా? మాంచి సదువుకున్న వాడిలా పోజువేసి, బందర్ రోడ్డులో పచ్చమేడవుంది సూశినా? అందులో ఓ గది తీసుకున్నా. మన సామానంతా అందులో పెట్టేసినా? ఇంక వర్రీలేదులే." అన్నాడు నిర్లక్ష్యంగా.

ఏడుకొండలికి సంతృప్తి కలిగింది. "పోదాం పదరా, ఇయ్యాళ అల్లా తిరిగి తిరిగి, కాళ్లు పడిపోతుండయి, గదికాడికెళ్ళి కాసేపు పడివుండాల" అన్నాడు.

ఇద్దరూ పావుగంటకల్లా బందర్ రోడ్ లోవున్న పచ్చమేడకి చేరుకున్నారు. పచ్చమేడ బ్రహ్మాండమైనదేం కాదు. చిన్నమేడ. కిందవరస రోడ్డువేపున్న పెద్దగదిని వరదరాజు అద్దెకి తీసుకున్నాడు. కరంటులేదు ఆయింటికి.

వరదరాజు మొలలో తాళంచెవితీసి గదితలుపుతీశాడు. లోన అంతా కటికచీకటి. ఏడుకొండలు జేబులో అగ్గిపెట్టితీసి వెలిగించాడు. గదిగోడకి పెద్దలాంప్ ఒకటివుంది. దాన్ని వెలిగించాడు ఏడుకొండలు.

గదంతా గప్ మని వెలుగుతో నిండిపోయింది. రెండు కిటికీలున్నాయి ఆ గదికి. కొత్తగా సున్నంకొట్టిన వాసనవస్తోంది. ఒక అల్మారా తీసివుంది. మొదటి అరలో ఒక చిన్న ట్రంకూ, పక్కచుట్టా వున్నాయి. రెండో అరలో, గాజు గ్లాసులురెండు, ఒక సీసావున్నాయి. మూడో అరలో టిఫిన్ కేరియర్ ఇత్తడి గ్లాసూ, ప్లాస్కూ వున్నాయి.

"ఏందో సామానంతివి! ఇదేనంట్రా?" అన్నాడు ఏడుకొండలు, మామూలు స్వరంలో.

వరదరాజు చూపుడువేలు ముక్కుమీద ఆనించి, "ష్! అట్లా పెద్దగా మాట్లాడకరా. వెనక ఇంట్లో ఎవరో సంసారులు కాపరం వున్నారు. పెద్దగా అరవకు! మెల్లిగా మాట్లాడు. ఆ పక్కచుట్ట ఇలా పరు. ఆ మూల చాపచుట్టకూడావుంది. తియ్యి..." అన్నాడు మెల్లిగా.

ఏడుకొండలు చాపచుట్టపరిచి పక్కవేశాడు.

ఇద్దరూ గోడ కానుకుని కూర్చుని, సిగరెట్లు వెలిగించి పొగ వూదుతూ మెల్లిగా సంభాషించుకోసాగారు.

"వరేయ్ వరదా! ఆ డబ్బంతా ఈ పెట్టెలోనే వుందంట్రా?" అని అడిగాడు ఏడుకొండలు అతనివేపు తిరిగి.

"అంతా ఇందులోనేవుంది. ఏం? బయమంట్రా?" అంటూ, నిశ్శబ్దంగానే నవ్వాడు వరదరాజు.

"బయం కాదంట్రా యెదవా! మొత్తం ఎంతరా?" అని ప్రశ్నించాడు, స్నేహితుడు.

వరదరాజు నవ్వుతూనే, ఎంతయితే ఏం? ఇప్పుడెందుకా వూసు? నీ కడుపులో దాగదు యెవారం; దాన్నట్లా వొదిలెయ్యి. అది ఎంతన్నా కానీ! దాంట్లో సగం ఆ ముగ్గురిదీ. ఆళ్లు ఎప్పుడు జెయిల్ నించి తిరిగొచ్చి అడిగినా, ముద్రముడుపుగా ఇయ్యాల్సిందేగా?...ఇటుమాడనీ! మనోళ్ళకి డబ్బంతా చూపి స్తిమంటే కడుపుపట్టక పైకి యెల్లబెడ్తరు. ఇది ఎవరికీ దక్కదు. వృథాగా పోలీసుల యెదాన పడుద్ది...అంతేనా?..."

"అంతేలే. అందుకనేగా టీషాపు కొన్నాం?"

"అంతేకాదురా! ఇంతడబ్బు మనకెట్టా వొచ్చిందని ఎవ డన్నా అడుగుతాడు. బేరం పెట్టావా? ఇంక ఎవడూ అడగడు. అదంతా లాబమే అనుకుంటారు..."

"ఆఁ!..." ఏడుకొండల కీఆలోచన ఆశ్చర్యం గొల్పింది.

"అవునలే! మరేందనుకున్నా? డబ్బంటే ఏంది, మజాకా? బుక్కాపకీరోళ్ళ కాడ వేలకివేలు డబ్బుండదనంగానే ప్రతీ యెదవకీ అనుమానంగావుంటది. వ్యాపారం అంటావు! దానిమీద యెంతడబ్బైనా తిప్పచ్చు! ఇహ నూస్కో మజా!" అన్నాడు వరదరాజు.

ఏడుకొండలికి వరదరాజు ప్లాను చక్కగా అర్థమైంది. "అంతేరా! అంతే" అన్నాడు.

వరదరాజు కాళ్ళు బారజాచి పడుకుని ఆవలిస్తూ, "రేపు [illegible] ఏర్పాట్లు చెయ్య పొద్దున్నేపోయి...ఊఁ" అంటూ నిద్ర కుపక్రమించాడు.

ఏడుకొండలు వీధితలుపు వేసివొచ్చి తానూ పడుకున్నాడు పక్కనే.

30

సత్యనారాయణపురంలో డా॥ వీరభద్రరావుగారి హాస్పిటల్ వున్న సందుకు తూర్పుగా రెండు సందుల తర్వాత ఒకవీధిలో చిన్న పెంకుటింటిలోకి మారింది రంగయ్యగారి కాపరం. అక్కడికి వొచ్చి నెలపైన అయింది. ఇంటద్దె స్వల్పం. పదిరూపాయలు. ఇల్లూ ఇరుకే. ఈ ఇరుకులోనే రంగయ్యగారు తన శేష జీవితాన్ని గడపసాగాడు, అయిష్టంగా, దుర్భంగా. మనస్సులో పొంగి పొర్లే భావాల్ని ఆయన తినతింట తాను కూర్చుని రాయలేక పోతున్నాడు. కళ్లు కనపడవు. కొడుకును కూచో బెడదామా అంటే, అతనికి ఉదయనించీ ఆస్పత్రి కార్యక్రమం,......రాత్రిదాకా.

సదానందం ఉదయం లేచి, ఆస్పత్రికి వెళ్లాడు. అప్పటికి డిస్పెన్సరీలో ఎవరూ ఉండరు. తెల్లని బల్లమీద రంగు రంగుల

మందులూ, సీసాలూ ఉంటాయి. ఆస్పత్రికే ప్రత్యేకమైన ఆవాసన వేస్తూవుంటుంది. డాక్టర్ డిస్పెన్సింగ్ రూం వెలుపల హాల్లో బల్ల ముందు కూర్చుని న్యూస్ పేపర్ చూస్తూ వున్నవాడల్లా, "రావోయ్, రా" అని ఆహ్వానిస్తాడు ఆప్యాయంగా. యథార్థానికి డాక్టర్ కూడా, దీనంగానే వున్నాడు. కంపౌండర్ లాగానే. ఆయన ప్రాక్టీసూ స్వల్పం; ఏదో గంజికి లోటులేదన్నట్టుంది.

కంపౌండరు తనపనికి కొత్త. డాక్టర్ అతనికి పని నేర్పుతున్నాడు.

సదానందం డాక్టర్ గారికి ఎదురుగా వున్న కుర్చీ కొనుకుని నిలబడి, "నిన్న పత్రికవాళ్లు వెయ్యమన్న కార్టూను వేసుకొచ్చాను, చూస్తారా!" అంటూ జేబులోనుంచి ఇండియన్ ఇంక్‌తో వేసిన చిత్రాన్ని బల్లమీద పడేశాడు.

డాక్టర్ అది చేతిలోకి తీసుకోకండానే చూస్తూ, "రాజకీయాల్లో ఎంత సంఘర్షణ వుందో అంత హాస్యం వుందోయ్. అసలా ఫీల్డే ఒక ఫార్సు" అన్నాడు.

సదానందం తేలిగ్గా నవ్వుతూ "ఏమిటోనండి, నాకూ అట్లాగే అనిపిస్తోంది, అక్కడ వున్నంతసేపూ వూపిరాడదు. ఎందుకో జెయిల్లో పెట్టినట్టుంటుంది," అన్నాడు.

డాక్టర్ పగలబడి నవ్వాడు. "అబ్బాయి, నువ్వు నిన్నటిదాకా జయాపజయాలెరగని స్వేచ్ఛాజీవితం గడిపావు. విద్యార్థి జీవితపు లోతులు తెలియవు. అతనికి జీవితంలో అడుగుపెట్టిన కొత్తలో, ప్రతిదీ ఇరుకుగా వుండటం సహజం. అదిసరే, మీ పత్రిక ఎడిటర్ ఎలాంటివాడు? చూశావూ?" అన్నాడు.

సదానందం డాక్టర్ ముఖంలోకి చూస్తూ, "ఎడిటరా? ఆయన కూడా ఈ స్థానిక రాజకీయపు చదరంగంలో ఒక పావు; తన పార్టీని గుడ్డిగా నమ్ముతాడు. ఇంక దేన్నీ నమ్మడు. నా కాశ్చర్యం వేస్తుందండి. తోటి మనిషిని నమ్మరేమండీ. పరస్పరం ఇంత అనుమానం, ఇంత అపార్థం అయితే ఎలాగండి? నన్నూ ఆ ఎడిటర్ గారు ఆ కళ్లజోడులోనించి అదేపనిగా కిందిచూపులు చూస్తూ లక్ష ప్రశ్నలు వేశాడు. 'నాకీ రాజకీయాలు తెలీవు. ఏదో బొమ్మలు గియటంలో అభిరుచికొద్దీ కాలేజీనుంచి తిన్నగా మీ దగ్గిర కొచ్చానని' చెప్పాను. ఆయన కింతవరకూ నామీద పరిపూర్ణమైన తృప్తి కలగలేదనిపిస్తోంది. అయితే ఏం, నా బొమ్మలు ఆయనకి నచ్చాయి" అన్నాడు.

"అయితే ఇంకా నువ్వు నవ్వటానికి అభ్యంతరమేమిటి?" అన్నాడు డాక్టర్.

★ అపస్వరాలు ★

సదానందం అన్నాడు: "అదే రహస్యం; నేనొక ప్రెస్ వర్కర్ని కదిలించాను. అతను నిర్మొగమాటంగా విప్పి చెప్పాడు. 'పార్టీ అభిమానిఅనో, మెంబర్ అనో అనిపించుకునేవరకూ మీ రాయనకి నచ్చరు' అని. ఎలావుందో చూశారా?"

"అయితే ఒక్క పని చెయ్యవోయ్. వృధాగా పనిపోగొట్టుకోకు. ఆ ఎడిటర్ గార్ని జిడిపట్టుకున్నట్టు పట్టుకుని, ఆయన పార్టీ రాజకీయాలేమిటో ఆదర్శాలేమిటో అడుగు; తెలుసుకో. కనీసం తెలుసుకున్నట్టు నటించు. అభిమానం వెళ్ళబోయ్యి. నీ వుద్యోగం ఖాయం."

సదానందం నవ్వాడు. "అలాగేలెండి. అందులో బాధేం వుంది! నాకా విషయాల్ని గురించి సంవత్సరాల తరబడి ఆయన బోధించినా అర్థంకావు. అర్థమైనట్టు...."

డాక్టర్ అడ్డుతగిలాడు: "నటించు నటించు. అదే బ్రతుకు తెరువు. నువ్వు త్వరలో పైకివస్తావు" అన్నాడు.

ఇంతలోనే ఎవరో రోగి వొచ్చింది. పాలిపోయి కళ్ళు లోతుకుపోయాయి. జ్వరతీవ్రతలో వొణుకుతోంది. డాక్టర్ చప్పున లేచి, ఆమెదగ్గర కెళ్ళాడు. సదానందం వెనకాలే నుల్చున్నాడు.

"ఏమిటమ్మా! మళ్ళీ వచ్చిందా జ్వరం,?" అంటూ వెనక్కి తిరిగి, కంపౌండర్ తో, "టెంపరేచర్ తీసుకోవోయ్." అన్నాడు.

రోగి నుంచోలేక బల్లమీద పడుకుంది. ఆమె శరీరం వాడిపోయింది. జవ్వం కాలిపోతోంది. మాట్లాడలేక మూలుగుతోంది. కళ్ళెర్రగా వున్నాయి. డాక్టర్ ఆమెకి ఉపశాంతికి మాటలు చెబుతూ, కంపౌండర్ టెంపరేచర్ ఎంతో చెప్పగానే, రోగి దగ్గర సీసా తీసుకుని ఏదో మందుపోయించి, "కాసేపు పడుకో అమ్మా! మందుకి ఇంకెవర్నన్నా పంపించు రేపట్నించి. గ్లూకోజు వేసుకుని బార్లీజావ తాగు" అన్నాడు.

రోగి లేచికూచుంది వొణుకుతూనే. "ఎవరూ లేరు బాబూ..." అంటూ ఇంక మాట్లాడలేక లేచి నిలబడింది.

డాక్టర్, "పడిపోగలవు! ఎట్లా వెళ్తావు ఇంటికి? రిక్షామీద వెళ్తావా?" అన్నాడు.

"రిక్షా కూడానా?" అందామె. "కాస్త ఆయన్ని తోడు రమ్మనండి," అంది బతిమాలుతున్నట్టు. కళ్లు జ్యోతులల్లే వెలుగుతున్నాయి.

డాక్టర్ వెంటనే "సదానందం, ఈమెని వాళ్ళింటిదగ్గర వొదిలిపెట్టి రావోయ్. ఇల్లు గుర్తుపెట్టుకురా. రేపు అవసరమైతే మందిచ్చి రావల్సి వస్తుంది" అన్నాడు.

"అలాగే" అంటూ సదానందం ఆమెతోపాటే వెళ్లాడు.

ఆమె వున్నవాడ సత్యనారాయణపురంలో ఉత్తరపువేపున వుంది. అన్నీ పూరిళ్లు. చుట్టూ దుర్గంధ భూయిష్టమైన మురికినీటి గుంటలమధ్య తేలుతున్నట్టున్నాయి ఆ యిళ్లు. సదానందం ఆమెని ఒక పూరింటిలోకి తీసుకెళ్ళాడు. ఒక మంచం కుక్కి, రెండు కుండలూ, ఒక లాంతరూ తప్ప ఇంకేమీ లేవా వొంటి నిట్రాడు కొంపలో.

సదానందం ఆమెని మంచంమీద పడుకోబెట్టి తిరిగి ఆస్పత్రి కొచ్చాడు. డాక్టర్ "ఏమిటోయ్ ఆమెస్థితి?" అని ప్రశ్నించాడు.

సదానందం, "నిర్భాగ్యరాలు ఏదో కూలిచేసుకుని బతుకుతుందనుకుంటాను. అవి యిళ్లా! ఆ వాడలోవి—ఇళ్ళటండీ?"అని ఆశ్చర్యం ప్రకటించాడు.

డాక్టర్ నవ్వి, "ఇదేననుకుంటూ నువ్వు అలాంటిచోటికి వెళ్ళటం?" అని ప్రశ్నించాడు.

సదానందం, తలవూపి, "అవునండి. వీళ్లు మీకు ఫీజు ఏమి ఇస్తారండి?" అని అడిగాడు.

"వాళ్ళ దగ్గర నేనేమీ ఫీజు ఆశించటంలేదయ్యా, పబ్లిసిటీ కోసం; విస్తృతమైన ప్రచారం అంతా ఇంతా కాదు."

సదానందం, మధ్యాహ్నందాకా ఆస్పత్రిలోనే వుండి, అక్కడికొచ్చిన నలుగురైదుగురు రోగులకి మందులు కలిపి ఇచ్చి, డాక్టర్ కి చెప్పి, పత్రిక కార్యాలయానికి వెళ్ళాడు. అప్పుడు ఒంటిగంట అవుతుంది. సదానందానికి భోజనం జ్ఞాపకంకూడా లేదు; పనంతా పూర్తయినాక కాని, ఆ జ్ఞాపకంరాదు అతనికి.

ప్రెస్సూ—పత్రిక కార్యాలయం వొకటే. ఆఫీసుగది లోపలివేపునవుంది. ఆ ప్రెస్ కి పవర్ లేదు. ఒక ట్రెడిలూ, నాలుగు టైపు కేసులూ వున్నాయి. ఇద్దరు కంపోజిటర్లు అచ్చుకూర్చుతున్నాయి. ఒక ట్రెడిల్ మేన్ అచ్చువేస్తున్నాడు. ఇద్దరు బైండర్లు కాయితాలు మడుస్తున్నారు. అంతా గజిబిజిగావుంది. ఎక్కడచూసినా, మసిపట్టిన కాయితం పేలికలూ, దిద్దిపారేసిన గ్యాలీప్రూఫ్ లూ.

ఆఫీసుగదిలో కళ్ళజోడు పెట్టుకుని లాల్చీ తొడుక్కున్న నలభైఏళ్ల ఎడిటర్ గారు టేబిల్ ముందుకూర్చుని ఆలోచిస్తున్నాడు, ఏదో రాస్తూన్న కాయితం ఆపేసి.

సదానందం ఆఫీసుగదిలోకి ప్రవేశించి, "నమస్కారమండి" అన్నాడు.

ఎడిటర్ తలపైకెత్తి, కళ్ళజోడుగుండా, చిత్రకారునివంక నిదానించిచూసి, "నే వెయ్యమన్న కార్టూను వేసుకొచ్చారా? ...అలా కూర్చోండి" అన్నాడు కుర్చీ చూపించి.

సదానందం కార్టూను-చిత్రం ఎడిటర్ గారికి అందించాడు.

ఎడిటర్ దాన్ని పరీక్షగా చూస్తూ, "బాగానే వేశారు; ఇంకా కొంచెం పనివుంది. మరిసాయంత్రం ఒకమారు వస్తారా?" అని అడిగాడు.

"చెప్పండి...అభ్యంతరం లేకపోతే...ఇప్పుడే...అన్నాడు చిత్రకారుడు ఉత్సాహంగా.

"మరేంలేదండి. పత్రిక టైటిల్ పీస్ చూశారూ? అదికి సరిగ్గా నడపంలేదు. అది కొత్తది రాయాలి. కొంచెం మార్పుకూడా చెయ్యాలి." ఎడిటర్ తనపత్రిక "ప్రసన్న" టేబిల్ మీద పడేస్తూ అన్నాడు.

సదానందం, దానివంక ఆసక్తిగాచూసి "ఏం మార్చాలి"అని అడిగాడు.

"ప్రసన్న" విజయవాడ స్థానిక రాజకీయాల్లో పాల్గొనే ఒక ముఠాకి చెందినది.

దానికి పలుకుబడి జాస్తి. పెట్టుబడితక్కువ. అలాగే నడవలేక నడుస్తోంది. ఎడిటర్ వినాయకరావుగారు ఉడుముపట్టివాడు. గట్టిగా పట్టుబట్టి పత్రికను నడుపుకొస్తున్నాడు. ఆ ముఠా గుర్తు, వెలిగే ప్రమిద. పార్టీపేరుగూడా దీపంపార్టీ.

సదానందం అడిగినప్రశ్నకి వినాయకరావుగారు పెన్సిల్ తో, టైటిల్ పీస్ మీద గీస్తూ "ప్రసన్న" పేరు ఇంకొంచెం పెద్దదిగా రాయండి. ప్రమిద వెలుగు అక్షరాలమీద పడుతున్నట్టుండాలి" అన్నాడు.

సదానందం, లేచాడు. "వెళ్లొస్తానండి. సాయంత్రం మళ్ళీ వచ్చి కలుసుకుంటాను" అన్నాడు.

ఎడిటర్, "మీరు ఇక్కడికి రావటం కన్న సరాసరి, గాంధీనగరంలో పార్కుకి ఎదురే మా యిల్లు, అక్కడికి రండి. ఇంకా మీతో కొన్ని విశేషాలు మాటాడాలి." అన్నాడు.

సదానందం డాక్టర్ గారు చెప్పిన అంశాలు జ్ఞప్తికి తెచ్చు

ఉన్నాడు. "అలాగే వస్తానండి" అని తిరిగి ఎడిటర్‌కి నమస్కరించి ఇంటికి దారితీశాడు. ఎండ తీవ్రంగా లేకపోయినా, వొళ్ళంతా చిటపటలాడుతోంది. ఉదయం అమ్మ ఇచ్చిన గ్లాసెడు కాఫీ, డాక్టర్ తొమ్మిదింటికి ఇచ్చిన మరోగుక్క టీ మాత్రమే; బాగా ఆకలి వేస్తోంది. సదానందం ఆలోచిస్తూ ఇంటికొచ్చాడు.

రంగయ్యగారు ఈజీచైర్‌లో కూర్చుని కునుకుతున్నాడు. తల్లి ఆయనకి కొంచెం అవతలగా చెంగుపర్చుకుని పడుకునివుంది. కొడుకు అడుగుల చప్పుడు వినగానే ఆమె మెల్లిగా లేచి, "ఏమిటీ నాయనా! ఇంతసేపు చేశావు! వేళకి ఆకాసిని మెతుకులు తినకపోతే వొళ్ళు పాడైపోతుందిరా రా, రా. తొరగా స్నానం చేసిరా." అంటూ లోపలి గదిలోకి వెళ్ళింది.

31

వారం గడిచినతర్వాత కాలేజీ శెలవున్న ఒకరోజున సదానందం సాయంత్రంపూట ఇంటికి వొచ్చేప్పటికి శ్యామల ఇంట్లో వున్నది. ఆవేళ ఏదో ఒక చిత్రం గియ్యాల్సిన అవసరం వుండి అతను పొద్దుండగానే ఇంటికి వొచ్చాడు.

శ్యామల వరలక్ష్మమ్మగారితో మాట్లాడుతూ కూర్చున్నది. రంగయ్యగారు వీధి అరుగుమీద కూర్చుని మౌనంగా తల పైకెత్తి నిర్మల నీలాకాశంలోకి చూస్తూన్నాడు. ఆయన ఇటీవల మాట్లాడ్డం చాలావరకు తగ్గించేసుకున్నాడు. ఆయన్ని అటు కరుణామూర్తీ నిర్లక్ష్యం చేశాడు. ఆయన ఎంతో శ్రమించి రాసిన పుస్తకాలు తన దగ్గిరే వుంచుకుని అచ్చు వెయ్యకుండా, ప్రతిఫలమూ సొంతం ఇవ్వకుండా తొక్కేశాడు, అతను. శాస్త్రిగారి శిష్యుడాయెను!

తండ్రిని ఈ స్థితిలో చూస్తూవుంటె సదానందానికెంతో విచారం కలిగింది. తన కేమో ఆయన దగ్గిరకూర్చుని భాగవతం రాసే తీరిక లేదు. ఆయనకేమో, అదేపిచ్చి...సదానందం ఆలోచిస్తూ లోపలికెళ్ళాడు.

శ్యామల అతన్ని చూసి చప్పున లేచి నుల్చుంది. సదానందం, "ఎప్పుడొచ్చారు?" అంటూ ఆ గదిలోనే ఒకమూల తన టేబిల్ దగ్గిరకెళ్ళి కూర్చున్నాడు. "మంచి సమయానికి వొచ్చారు. రండి" అన్నాడు.

శ్యామలకి సదానందం వేసే బొమ్మలంటే ఎంతో ఇష్టం. అతనంటే ఒక గౌరవం. "ఏం? ఏమిటది?" అంటూ ఆమె అతని దగ్గరకివొచ్చి నిలబడింది. వరలక్ష్మమ్మగారు పనిమీద పెరట్లోకి వెళ్ళింది.

సదానందం, "ఒక ఊరేగింపు నడుస్తున్న స్త్రీ వాలంటీర్లను చిత్రించమని, "ప్రసన్న" వాళ్ళు చెప్పారు. మీరొక్క పదినిమిషాలు అలా నిలబడితే...." అన్నాడు.

శ్యామల కొంచెం సిగ్గుపడింది. సాయంత్రపు వెలుగు ఇంకా బాగావుంది. పడమరవైపు కిటికీలోనుంచి, శ్యామలపైన సంధ్యాకాంతి వర్షిస్తోంది. ఆ స్వర్ణచ్ఛాయ ఆమెకెంతో శోభనిస్తోంది. ఆమె ఏమీ మాట్లాడకుండా నుంచుంది.

సదానందం, గబగబ పెన్సిల్‌తో ఆమె రూపం ఐదునిమిషాల్లో స్కెచ్ గీసుకున్నాడు, తర్వాత, పెన్సిల్ బల్లమీదపెట్టి "చాలునండి. నాకు ఆడవాళ్ళచిత్రాలు గియ్యటం కొంచెం కొత్త...అందుకని మిమ్మల్ని..."అంటూ "క్షమించండి" అన్నాడు.

శ్యామల, "ఎంతమాటండీ క్షమించడం! ఇందులో ఏముంది!" అంది నవ్వుతూ.

సదానందం తర్వాత బొమ్మగీసుకోవల్సిన ఏర్పాట్లు చేస్తూ, "మీ చదువు బాగా సాగుతోందా," అన్నాడు టేబిల్‌కి కొంచెం దూరంలోవున్న చిన్నబల్ల ఆమెకి చూపించి, "అలాకూర్చోండి." అన్నాడు.

"చదువుకేం బాగానే సాగుతోంది." అంది శ్యామల. "మీరు గీసిన బొమ్మలింకేమైనా వున్నాయా, ఒకసారి చూస్తాను ఇవ్వండి" అని అడిగింది.

సదానందం తన ఆల్బం ఆమె చేతికిస్తూ ఆమె ముఖంలోకి చూశాడు. ఆమె తలొంచుకుని బొమ్మలు తిరగేస్తూ వుంటే, అతనికి తెలియనిదేదో ఒక అనుభూతి కలుగుతోంది. మంచి ఎండాకాలంలో సాయంత్రంపూట అరుదుగా వీచే చల్లగాలిలాగా, ఎక్కడో దూరంగా పూసిన గులాబీ వాసన ఒక క్షణం నాశికను సోకినట్టూ, ఇంపైన సంగీతాలాపన వినిపించినట్టున్నది, ఆ అనుభూతి.

సౌందర్యారాధన సహజంగానే అబ్బిన ఆ యువక చిత్రకారునికి, ఇప్పటి నిరాశాపూరిత వాతావరణంలో ఆ యువతి చూపే గౌరవం, మార్దవమైన ఆమె మాటలు, జీవితంలో కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి.

క్షణక్షణానికీ తరిగిపోతూన్న సంధ్యారుణ కాంతిలో ఆ యువతి లావణ్యం, క్షణానికో కొత్త మెరుగు దిద్దుకుంటోంది. నల్లని జుట్టూ, తెల్లని శరీరచ్ఛాయా, ముదురు నీలం సిల్కుచీర, పొందికైన అంగవిన్యాసం, సదానందం మనస్సులో మరుపురాని ముద్ర వేసినై.

శ్యామల సదానందంవైపు చూడకుండా బొమ్మలే చూస్తూంది.

సదానందం ఆమె శరీరపు వొంపుల్ని బాగా పరిశీలనగా, చిత్రకారుని దృక్పథంతో చూస్తున్నాడు.

మరొక ఐదారునిమిషాలకి శ్యామల ఆల్బం మూసి సదానందం చేతికిస్తూ, "చీకటిపడుతోంది; మా యింటిదాకా వొస్తారా?" అంది.

"వొస్తాను పదండి" అన్నాడు సదానందం.

వీధిదీపాలు వెలిగాయి. సత్యనారాయణపురంలోని ఇళ్ళల్లో దీపాలు అలంకార ప్రాయంగా మినుకు మినుకు మంటున్నాయి. చిరు చీకట్లు దీపాలచాటున దాక్కుంటున్నాయి. వీధులన్నీ సందడిగా వున్నాయి. సదానందం శ్యామల పక్కనే నడుస్తున్నాడు.

శ్యామల ఇల్లు రెండు ఫర్లాంగుల దూరంలోనే వుంది.

సదానందం ఆమెని వాళ్ళ మేడముందు వొదిలిపెట్టి వెనక్కి తిరిగాడు. శ్యామల "లోపలికి వచ్చివెళ్ళండి. నాన్నగారికి కనపడిపోవచ్చు" అన్నది.

శ్యామలతో పాటే సదానందం లోపలికెళ్ళాడు. ఇల్లంతా సందడిగా వుంది. శ్యామలకి ఇద్దరు చెల్లెళ్ళు, ఒక తమ్ముడూ వున్నారు.

సదానందం అక్కడ అరగంట వుండిపోయినాడు.

(ఇంకావుంది)

చిన్నమనుష్యులు - పెద్దసమస్యలు

పురాణం

సూర్యప్రకాశరావు

తన ఈ నలభైఏళ్ళ వయసులోనూ అనేకమైన సంఘటనలు ఇటువంటివి చూశాడు. ఎంతమందో చెప్పగా విన్నాడు. పేపర్లలో చదివాడు. జాలిపడ్డాడు. అప్పుడప్పుడు రెండు కన్నీటిచుక్కలు విడిచిన సందర్భాలుకూడా లేకపోలేదు. అయితే అవన్నీ క్షణికమే అయిపోయాయి. ఎక్కువసేపు హృదయాన్ని అంటిపెట్టుకుని హింసించలేదు. అయితే ఈ ఉదయం జరిగిన ఘోరం మటుకు తన్ని వదిలిపెట్టకుండా ఇంతవరకూ మథిస్తూనే ఉంది. కారణం ఈ చావుతో పరోక్షంగా తనకీ ఏమైనా సంబంధం ఉందేమో అనే శంకతో అంత రాత్రి చేసే అల్లరి. తన్ని తాను సమర్థించుకుందుకు చేసే ప్రతి పెద్దప్రయత్నం ఏదో అవ్యక్తమయిన లోటుతో పరాజయం పొందుతూనే ఉంది. ఉదయం తెల్లవారే వరకూ లేని క్షోభ ఆ తర్వాత అనుభవిస్తున్నాడు. నిన్న సాయంత్రం జరిగిందిది:

అప్పటి కింకా చీకటి పడలేదు. వీధి వరండాలో కూచుని బడలికవల్ల బరువెక్కిన శరీరానికి విశ్రాంతి నిస్తున్నాడు తను. లోపల భార్య వంటప్రయత్నంలో ఉన్నది. వీధి గదిలో కొడుకు ప్రకాశం చదువుకుంటున్నాడు. తనూ వార్తాపత్రిక చదువుతున్నాడు. కొద్దిసేపు పోయింతర్వాత "బాబూ!" అన్న కంఠం వినిపించి పేపరు ఒత్తిగించి కళ్ళజోడు చివర్నించి అతనివైపు చూశాడు తను. వెంటనే ప్రశ్నించాడు కూడా "ఎవరూ?" అని. ఆ అపరిచిత వ్యక్తి నవ్వుతూ చొరవగా వచ్చి పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుని "పేపరో మారు ఇస్తారూ?" అని అడిగాడు. మధ్య పేజీలుకొన్ని అతనికిచ్చి తిరిగి తన చదువులో తను మున్గిపోయాడు. మరి కొన్ని నిముషాలు అలా గడిచింతర్వాత పేపరుమడత పెట్టి "దేశంలో పెచ్చు పెరిగిపోతున్న అవినీతి, లంచగొండితనం గురించీ మీ అభిప్రాయం ఏవిటి?" అని ప్రశ్నించాడతను. మనిషి చూట్టానికి అంత విద్యాధికుడుగా కనిపించకపోయినా ఈ ప్రశ్నించే ధోరణి మటుకు బాహ్యాన్ని బట్టి అంతరంగాన్ని పరీక్షించటం అవివేకం అన్న సత్యాన్ని ఋజువు చేస్తున్నట్టే అనిపించింది. ప్రశాంతమైన ఆ స్వరం వెనక ఎంతో హుందాతనం ప్రస్ఫుటమైంది. నుదుటి మీద ప్రశ్నార్థకంగా ముడతలుపడిన చర్మం, పలకరిస్తున్నట్టుగా కనిపించే అతని చూపులూ ఆ వ్యక్తిపట్ల గౌరవాన్ని ఇవతలి మనిషిలో కలగచేశాయి. "సరిగ్గా మీరు వేసిన ప్రశ్నే నేనూ అనేకమార్లు వేసుకున్నాను. కాని సరయిన సమాధానం నాకు దొరకలేదు." అని సమాధానం చెప్పాడు తను. అసలీ ప్రశ్న తన్ని కొంత కలవరపరిచింది. ఎందుకో తెలియదు.

"నాకు తోచిన సమాధానం చెబుతాను వినండి. నా దృష్టిలో దీనికంతా కారణం ప్రజల్లో నాస్తికత్వం ప్రబలిపోవటం. దేముడుమీద నమ్మకం, పాపభీతీ నసించిపోవటం. అని నేనంటాను. కాదనేవాళ్లు చాలామంది ఉన్నారనుకోండి. అయినా నా అభిప్రాయం మటుకు అదే. శాసనాలూ, చట్టాలూ, పోలీసులూ ఈ ప్రజల్ని పూర్తిగా అదుపాజ్ఞల్లో పెట్టగలవని నేను నమ్మను." అని క్షణం ఆగిపోయాడతను.

"అంటే మీ ఉద్దేశం ఈ ప్రభుత్వాలూ, ఈ అధికారులూ, నిష్ప్రయోజనం అనా?" అని ప్రశ్నించాడు తను.

"అహాఁ! అలా అని నే చెప్పటంలేదు. అవి సాధించగలిగేది అసలు సాధించవల్సిన దానిలో కొద్దిమాత్రమే అని నా అభిప్రాయం. దేశంలో లంచగొండితనం విపరీతంగా పెరిగిపోయింది. కూడదని నాయకులూ, అధికారులూ చెవులు చిల్లులుపడేలా ఘోషిస్తున్నారు. ప్రతి ఒక్కడికీ ఆ విషయం తెలుసు. నూటికి కోటికి ఆ ఉద్బోధల్ని మెదడుకి పట్టించుకుని ఆచరణలో పెట్టేవాళ్లు అయిదారుగురు ఉండకపోరు. వాళ్లు మార్గదర్శకులేగాని ఆ మార్గాన్ని అనుసరించే వాళ్లే మృగ్యం అంటారు. అట్టడుగు నౌఖర్ దగ్గర్నించి పై అధికారివరకూ అంతా చేతులుచాపేవాళ్లే అయినప్పుడు శాసనాలుమటుకు చేసేదేముంది. వీటివల్ల జరిగే ప్రయోజనం కంటె ప్రతివ్యక్తీ తన్ను తాను అదుపులో పెట్టుకోగలిగిన నాడే దేశంలో అవినీతికి స్థానం లేకుండా పోవటం సంభవిస్తుంది. అంటే ఆత్మబలం అవసరమన్నమాట. తనమీద మరోవ్యక్తి చలాయించే అధికారంకంటె తనమీద తనకే అధికారం ఉండేట్టుచేసుకోవాలి. ఇంకా వివరంగా చెప్పాలంటే మనం ఏ దైవభక్తినైతే నిరశిస్తున్నామో, మూర్ఖం అనుకుంటున్నామో, ఆ భక్తీ, ఆ నమ్మకం ప్రతివ్యక్తికీ ఉండితీరాలని నా అభిప్రాయం. తప్పుచేస్తే తన్ని మరో అజ్ఞాతశక్తి శిక్షిస్తుందేమో అనే పాపభీతి ఉన్నప్పుడే ఆ తప్పు చెయ్యకుండా ఉండటం సాధ్యంఅవుతుంది. మీరేమంటారు?"

"అనటానికేముంది లెండి. మీరుచెప్పింది కొంతవరకూ నిజం అని ఒప్పుకుంటాను" అన్నాడతను.

"అంటే పూర్తిగా ఏకీభవించరన్నమాట. మీ అభిప్రాయం ఏవిటో చెప్పండి వింటాను" అన్నాడతను.

"ఈ నవనాగరిక ప్రపంచంలో బ్రతుకుతూ కూడా ఇంకా పాతకాలపు మూఢనమ్మకాలు పట్టుకుని కూచోమంటే ఎవళ్లు ఇష్టపడతారు. ఈ రోజుల్లో ఎవడికి వాడే దేముడు."

"మీరు నా అభిప్రాయం సరిగ్గా అర్థం చేసుకోలేదని ఇప్పుడు మీ రన్నమాటలే ఋజువు చేస్తున్నాయి. ఇంకా వివరంగా చెప్పటానికి ప్రయత్నిస్తాను. ఈ భూమ్మీద ఎంతమంది బిచ్చగాళ్లున్నారు? వాళ్ళకి నిత్యం దానధర్మాలు చేసేవాళ్లు కొంతమంది ఉంటారని మీరు ఒప్పుకుంటారా?" అని ప్రశ్నించాడతను.

"ఇందులో ఒప్పుకోకపోవటానికేముంది. దానం చేసేవాళ్ళు ఉండబట్టే వాళ్ళూ అడుక్కుంటున్నారు." అని సమాధానం చెప్పాడు తను.

"అయితే వాళ్లెందుకు దానం చేస్తున్నారు?" - ఇది రెండో ప్రశ్న.

"మీరు మరీ సిల్లీగా అడుగుతున్నారు. ఎందుకేవిటండీ 'వాళ్ల దీనావస్థకి జాలిపడి సహాయం చేస్తున్నారన్నమాట."

"ఎందుకు జాలిపట్టం? దానివల్ల తను కేవిటి ప్రయోజనం?"

ఈ ధోరణి తనకి విసుగ్గా ఉన్నమాట నిజం. "ఎందు కేవిటండీ?" అయ్యో పాపం వాడు కష్టదశలో ఉన్నాడు. ఓ కానీ వేద్దాం' అని సహజంగా అనిపిస్తుంది *

"అఁ! ఇప్పుడు నే చెప్పబోయేది వినండి. మీ అంతస్సులో అజ్ఞాతంగా అటువంటి శక్తి పని చేస్తూంటుందని ఒప్పుకుంటారా?"

తను తల ఒప్పుకున్నట్టుగా ఊపాడు.

"కొంతమందిలో ఆశక్తి తక్కువ ప్రభావం కలిగిఉంటుంది. మరికొందరిలో ఎక్కువప్రభావం కలిగిఉంటుంది. అసలు లేకపోవటమంటూ ఉండదు. ఈ నలభైఏళ్ల జీవితంలో ఎన్నడూ ఎవరిగురించీ జాలిపడ్డ సందర్భం లేదని మీరు చెప్పగలరా?"

"ఎలా చెప్పగలను? అనేకమార్లు కన్నీరు కూడా కార్చాను"

"అయితే నే చెప్పిన అజ్ఞాతమైనశక్తి మీచేత అప్పుడప్పుడు స్వార్థత్యాగం కూడా చేయించ గలిగే శక్తి కలదని నమ్మగలరా?"

"ఒప్పుకుంటాను"

"ఆశక్తినే దేముడందాం. పోయేదేముంది? ఆశక్తినే ఆరాధిద్దాం. పూజిద్దాం గౌరవిద్దాం. ఆశక్తిని ఇంకా పెంపొందించుకుని రాక్షసప్రవృత్తుల్ని సాధ్యమైనంతవరకూ జయిద్దాం మనకు చేతనైనంతవరకూ ఈ ప్రపంచంలో మంచినేచేద్దాం. అలా చెయ్యగలిగే శక్తి అప్పుడే కలుగుతుంది. ఏమంటారు?"

తను నివ్వెరబోయి వింటున్నాడు. "మీ అభిప్రాయాలు బాగానే ఉన్నాయి. ఇంతకీ మీ పేరు చెప్పారు కారు" అని అడిగాడు తను.

"నా పేరు గోపాలరావు. ఏంపని చేస్తున్నావని అడక్కండి. అదంతా పెద్ద గొడవ." అన్నాడతను ఆ గొడవ ఏమిటో తరిచితరిచి అడగ దల్చుకోలేదు తను.

ఇవాళ మిమ్మల్ని కలుసుకోవటం నాకు చాలా సంతోషాన్ని కలుగజేసింది." అని అభినందించాడు తను. తర్వాత అతనడిగిన ప్రశ్నకు తనకు ఒక్కడే కొడుకనీ అంతకు తప్పించి ఎక్కువమంది లేకపోవటంకూడా ఒక అదృష్టమేననీ సమాధానం చెప్పాడు.

"ఈ ఇల్లు మీ సొంతమేనాండి?" అని అని అడిగాడతను.

"అవునండి ఈ మధ్యనే కట్టించాను. రెండుసంవత్సరాలయింది."

"ఈ ఇల్లు చాలా అందంగాఉంది. పెట్టుబడి చాలా అయుంటుంది"

"అబ్బో! ముప్ఫైవేలు దాటిపోయింది ఖర్చు. అయినా ఇటువంటి పట్నవాసాల్లో ఓ యిల్లు ఉండటం చాలా అవసరం అని కట్టించాను."

"మంచిపని చేశారు"

ఇంతలో వసారాలో లైటు వెలిగింది. లైటుచీకటి అప్పుడప్పుడు పడుతోంది. దీపం వెలగ్గానే కళ్లుమూసుకుని నమస్కారం చేసి ఏదో అస్పష్టంగా ఉచ్చరించాడు గోపాలరావు. ఈ చర్య వింతంగానే తోచింది తనకి.

మరి కొద్దిసేపు పోయింతర్వాత గోపాలరావు తలెత్తి "మీరు సహాయంచేసి పెడతారా అన్నాడు.

"ఏమిటది?"

"నిన్న ఉదయం అనగా భోజనం చేశాను. ఇంతవరకూ మంచినీళ్లు తాగి ఉండగలిగాను ఆకలి దహించుకపోతోంది. ఓరూపాయి ఇప్పిస్తారూ, ఈ రాత్రికీ రేపురాత్రికీ భోజనానికి తడుముకోవాల్సిన అవసరం ఉండదు.

నోటమాట పెగల్లేదు తనకి. అయితే ఈ ఉపోద్ఘాతమంతా ఇందుకన్నమాట! అడుక్కోవటంలో ఘరానా పద్ధతి! అంతవరకూ అతనిమీద ఉన్న గౌరవం ఆ క్షణంలో జుగుప్సా అసహ్యంగానూ మారిపోయింది. అతనంటే ఓవిధమైన తేలిక దృష్టి ఏర్పడిపోయింది. "నువ్వు ముందుగానే ఈ ప్రస్తావన తెచ్చిఉంటే తప్పకుండా సహాయం చేసేవాడ్ని. అయితే నాటకమాడి ఘరానాగా బుట్టలో వేసుకుందామనుకుంటే లొంగేవాడ్ని కాను. ఒక్క దమ్మిడీ నీకు నేను సహాయం చెయ్యను. ఇంకా ఏదో చదువుకున్నవాడివనీ, పెద్దమనిషివనీ అనుకున్నాను. అసలు రంగు బయటపడింది." అంటూ ఎగిరిపడ్డాడు తను.

గదిలో చదువుకుంటున్న ప్రకాశం గుమ్మంలోకి వచ్చి నిలబడ్డాడు. వాడివైపూ, తనవైపూ దీనంగా ఓమారు చూసి గోపాలరావు లేచి వెళ్లిపోయాడు. అయినా చాలాసేపటివరకూ తన ఆవేశం చల్లారలేదు. నేరుగా వచ్చి కుర్చీలోకూడా చతికిలబడ్డాడు! చేతిలో పేపరు తీసుకున్నాడు! పెద్దపెద్ద విషయాలు చర్చించాడు! అంతా బూటకం! నటన! ఇదేదో వింతగా నలుగురి చెవినీ వెయ్యాలనీ, వాళ్ళూ అతన్ని అసహ్యించుకోవాలనీ అనిపించి దగ్గరో గుమ్మంలో నిలబడ్డ కొడుకు నుద్దేశించి నవ్వుతూ "చూశావుట్రా! ప్రపంచం అంటే ఎలాగుందో గ్రహించు. అంతా మోసం! కబుర్లు చెప్పి నన్ను మోసంచేద్దామనుకున్నాడు. నేనా లొంగేది" అన్నాడు. అయితే తనూహించినట్టుగా ఎదుటిమనిషి తనకి తాళం వెయ్యకపోవటంతో అవమానం జరిగినట్టుగా బాధపడ్డాడు తను.

"అందులో మోసం ఏముంది? అతను సూటిగానే అడిగాడు. అతను చెప్పిన విషయాలు ఒకళ్లని మోసగించేవి ఎంతమాత్రం కావు. వాటినుంచి నేర్చుకోవాల్సింది ఎంతైనా ఉంది. ఆయన అభిప్రాయాల్తో ఏకీభవించినట్టు నువ్వన్న మాటలూ విన్నాను. నిన్ను నువ్వే మోస

గించుకుంటున్నావు. అతను అర్థించిన సహాయం నువ్వు తిరస్కరించావు. నీ అసలు రంగు బయటపడింది." అన్నాడు కొడుకు.

తన వొళ్లంతా తేళ్లూ జెర్రులూ ప్రాకి నట్టయింది. కొడుకు తన అభిప్రాయాలతో ఏకీభవించకపోవటం ఇవాళేమీ కొత్త కాదు. కారణం తనకి తెలుసు. తనకున్న ముందు ఆలోచనా, దూరదృష్టీ కొడుక్కి లేకపోవటంతో తను చేసే పన్లన్నీ వాడికి తప్పుగానే కనబడుతున్నాయి. ఇంతలా తను శ్రమిస్తున్నాడంటే అదంతా ఎవరి కోసం? వాడికోసం కాదూ? ఆ జ్ఞానం వాడికుందా? తను కొంతమందికి ఉపకారం చేసి తద్వారా కొంతడబ్బు సంపాదిస్తున్న మాట నిజమే. అయితే అది ఇచ్చేవాళ్లూ పుచ్చుకునే తనూ కూడా బహుమానంగా భావిస్తుంటే వీడు దానికి 'లంచం' అని పెద్ద పేరు పెట్టి తన్ని అసహ్యించుకుంటు న్నాడు. ఆ విషయంలోనే వాడికీ తనకీ పేచీ వచ్చేది. భార్య ఎటువైపూ వాదించటం చేతకాక ఊరుకుంటుంది. "ఏడిశావు. ఆ పెద్ద వాగుడు అంతా ఏదో మహా గొప్పగా నీకు కనిపించింది కాబోలు. నేను మటుకు వాటితో ఏకీభవించలేను. ఏదో సభ్యత కోసమున్నట్టుగా తల ఊపాను. అది నిజమని నమ్మావంటే మోసపోగలవు. జాగ్రత్త!" అన్నాడు తను; అంతకు మించి కఠినమైన పదాలు వాడటం ఇష్టం లేక. వాటి పర్యవసానం తనకీ కొడుక్కీ మధ్య చిన్న గాలి దుమారం లేవటమే.

కొడుకు హేళనగా చులకనగా నవ్వేశాడు. ఆ నవ్వు తన గుండెల్లో నాటుకుని చాలా బాధ పెట్టింది. "నువ్వు నాకే మోసాన్ని సమర్థిస్తున్నావు" అన్నాడు తీవ్రంగా తను.

"లేదు. అతని అభిప్రాయాన్ని సమర్థిస్తున్నాను. అతని దైన్యానికి జాలిపడుతున్నాను. కాని నేనే విధంగా అతన్ని సంతృప్తిపర్చగలను. నాదగ్గ రేముంది ఇవ్వటానికి?" అన్నాడు కొడుకు ఏదో బాధ పడుతున్నట్టుగా.

చేతిలో పేపరు కెలికేసి విసిరికొట్టి లోపలికి వెళ్ళిపోయాడు. వంటింట్లో భార్య పొయ్యిముందు కూచునివుంది. [illegible]



లేపాక్షి దేవాలయ కుడ్యచిత్రం —ఫొటో: పి. గురుమూర్తి.

లోకి చూసి "ఇవాళ వంట ఆలస్యం అయిందండీ" అంది.

తను గుమ్మంలో కూచుని "చిన్నవాడు కదా అని ఊరుకుంటే రోజు రోజుకీ వీడి ధోరణి విపరీతంగా మారుతోంది. వీడి పాటి తెలివితేటలు నాకు లేవని కాబోలు వీడి ఉద్దేశం" అంటూ గొణగటం ప్రారంభించాడు.

"ఏమిటండీ! ఏమయింది?" అంది భార్య నుదుట చెమట ఒత్తుకుంటూను.

"ఏమిటయేది? నీ కొడుకు ప్రతాపం గురించి చెబుతున్నాను."

"ఏమంటాడు?" భార్య ఇవతలికి వచ్చి భర్త ముందుగా వచ్చి నిలబడింది.

"నే నేదో శుద్ధ మూర్ఖుడిన్నీ, అవినీతిపరుడిన్నీ అయినట్టుగా చులకనగా మాట్లాడుతాడు. వాడితో మాటలు కదపటం అంటే అసహ్యం పుడుతూంటే. వీడి తాహతేమిటి? నా తాహతేమిటి? నన్ను వీడు విమర్శిస్తాడా?" ఈ స్వరం చాలా ఉద్రేకపూరితంగా ఉన్నా వీధి గదిలో చదువుకుంటున్న కొడుకు చెవిని పడదని తనకి తెలుసు. అందుకే మరింత గట్టిగా భార్యముందు ఎగిరిపడ్డాడు.

"నే చెబుతానులెండి. కుర్రకుంక వాడికేం తెలుసు. పెద్దవాడైతే కష్టసుఖాలు అనుభవంలోకివస్తే అప్పుడు తెలుస్తుంది. అంతవరకూ ఇలాగే ఉంటారు." అని సర్ది చెప్పింది భార్య.

కొడుకు తన్ను ఎంతగా ప్రతిఘటించినా తనేమీ చెయ్యలేడన్న సంగతి తనకి తెలిసినా భార్యముందు మటుకు వాడి సంగతి అటో ఇటో తేలిపోవాలి అన్నట్టుగా విరుచుకుపడుతూంటాడు. "ఆ శ్టే పిచ్చి వేషాలు వేస్తే రేపట్నుంచీ వాడికీ నాకూ సంబంధం లేదు. ఈ చదువు ఇంతటితో ఆపేస్తాను." అని భార్యతో అంటూంటే కొడుకు విని టేబిలుమీద పుస్తకాలూ, బీరువాలో పుస్తకాలూ అన్నీ విసిరి వరండాలో పారేసి ఇక ఇంటిముఖం చూడనంటూ చరచరా వీధిలోకి నడవబోయాడు కొడుకు. తల్లి అడ్డుపడింది. ఆగిపోయాడు. నవ్వుతూ వెనక్కి తిరిగివచ్చాడు. నిజంగా పోతాడేమో మళ్లీ తిరిగిరాడేమో అని తనూ కంగారుపడ్డమాట నిజం. అయితే పైకిమటుకు నిర్లక్ష్యంగా, నిర్లిప్తతగా, ఉన్నట్టు నటించాడు. లేకుంటే తను మరి లోకువైపోడూ!

"మనం సంపాదించింది చాలు. కొన్ని తరాలు సుఖంగా జీవించవచ్చు. ఇంకా ప్రజల్ని పీడించి లంచాలు పుచ్చుకోవటం మానెయ్య. ఇప్పటికే పదిమందిలోనూ చెడ్డ పేరు వచ్చింది. తలెత్తుకు తిరగలేకుండా ఉన్నాను." అంటాడు కొడుకు.

దానికి సమాధానం పళ్లు పటపటా కొరుక్కుని అక్కడ్నుంచి నిష్క్రమించటం.

ఇలా ప్రతినిత్యం ఎప్పుడో ఒకప్పుడూ వాడికీ తనకీ ఈ ఘర్షణ తప్పటంలేదు. ఒకళ్ల అభిప్రాయాలు ఒకళ్ళకి గిట్టవు.

* * *

ఆ మొర్నాడు ఉదయం ఇంకా తెల్లవారకుండానే దూరంగా ఏవేవో అరుపులూ, గోలా, వినిపించి పక్కమీద లేచి కూర్చున్నాడు. అప్పటికే కొడుకు లేచి బైటికి వెళ్ళాడు. బహుశ ఆ గోల జరిగే వైపుకే వెళ్ళిఉంటాడు. భార్య గుమ్మం ముందు నిలబడి ఉంది. భర్తని చూసి "ఎవరో రైలు కిందపడ్డారుట. పాపం! లెవిల్ క్రాసింగ్ గేటుదగ్గర పడ్డాట్ట." అని చెప్పింది. మీద తువ్వాలు వేసుకుని భార్య అడ్డుపడినా వినిపించుకోకుండా అటువైపుకి పరుగుతీశాడు తను.

గేటువద్ద వందలాదిగా జనం గుంపులు గూడారు. తోసుకుంటూ ముందుకు వెళ్ళాడు. ఆ దృశ్యం చూసి కళ్లుతిరిగి నేలమీద చతికిలబడిపోయాడు. ఒళ్లుతిరిగింది. తిరిగి తనకి స్పృహవచ్చేసరికి ఇంట్లో మంచంమీద పడుకుని ఉన్నాడు.

భార్య ఎదురుగా కూర్చుని కన్నీరు కారుస్తోంది. కొద్దిదూరంలో కొడుకు కూర్చుని ఉన్నాడు. కిటికీలోంచి ఉదయపు ఎండ తన పాదాలమీద పడుతోంది. ఉండి ఉండి చల్లటిగాలి ఓ విసురు విసురుతోంది.

"ఎలాగుంది ఇప్పుడు?" భార్య ప్రశ్నించింది. కొడుకు ఆతృతగా ముందుకు వంగాడు.

"బాగానే ఉంది" అంటూ లేచి కూర్చున్నాడు మంచంమీద.

"అందుకే మిమ్మల్ని వెళ్ళవద్దని అడ్డుపడ్డాను. నామాట వింటేనా" అని గొణుక్కుంది భార్య. కొడుకుమటుకు ఏమీ మాట్లాడలేదు. వాడి దృష్టి చేతిలో పుస్తకంమీదే లగ్నం అయిఉంది. గేటుదగ్గర చూసిన ఘోరం తన కళ్ళముందు ఇంకా మెదుల్తూనే ఉంది. 'గోపాలరావు!' ఆ పేరు ఇంకా తన చెవులో మార్మోగుతూనే ఉంది. అతను చెప్పిన విషయాలు అప్పుడు వింటున్నట్టే అనిపిస్తోంది. అతని చామనచాయముఖం ఇంకా కనిపిస్తోంది. ఇంతలో ఇలా జరిగిపోతుందని ఊహించాడా? ఆత్మహత్య! కొడుకు కుర్చీలో కూర్చునే ఓరగా తనవైపు చూశాడు. సిగ్గుతో తన తల వంగిపోయింది. మళ్ళీ అనుకున్నాడు. అతను ఆత్మహత్య చేసుకుంటే మధ్య తన కెందుకీ బాధ? తప్పుచేసినట్టుగా వాడిముందు ప్రవర్తిస్తే వాడు తన్ని మరింత ఆడిస్తాడు. వంచిన తల ప్రయత్నించి నిలబెట్టాడు తను.

భార్య లేచి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

కొడుకు చిన్నగా నవ్వి "ఈ ప్రపంచంలో ఒకరికోసం మరొకరు ఎంతో కొంత త్యాగం చెయ్యగలిగితేగాని జీవితాలు ఒక మోస్తరుగా అన్నా గడవ్వు. ఈ భూమ్మీద ప్రతిఒక్కడూ బ్రతికే హక్కు కలిగిఉన్నాడు. ఈ హక్కుకి భంగం కలిగించే సంఘటనలు ఏది జరిగినా దాన్ని తీవ్రంగా ప్రతిఘటించే హక్కుకూడా ప్రతివాడికీఉంది. అయితే ఆ హక్కుని గుర్తించగలిగే సంస్కారంకూడా లేని చాలామంది అభాగ్యులు ఇలాగే అంతమయిపోతున్నారు. మనం అంతా అందుకు సిగ్గుపడాలి. మనలో ప్రతిఒక్కడూ గోపాలరావు చావుకి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో బాధ్యులమే. బెదిరి మూర్ఛపోవటం కాదు. కనీసం రెండు కన్నీటి చుక్కలైనా అతన్నిగురించి విడువండి"అంటూ కొడుకు పుస్తకంమూసి వీధిలోకి నడిచాడు.

కాఫీగ్లాసుతో భార్య గదిలో ప్రవేశించింది. కొడుకుమాటలే చెవులో ప్రతిధ్వనిస్తున్నాయి. "దేశంలో బిచ్చగాళ్ల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. ఎంతమందికని దానం చెయ్యగలం?" అంది భార్య.

"అవును ఎంతమందికని దానంచెయ్యగలం?" అదే ప్రశ్నని మళ్లీ మళ్లీ రెట్టించుకున్నాడు మనసులో. ప్రతి ఉదయం పిడికెడు బియ్యం తను స్వయంగా బిచ్చగాడికి వేస్తున్నాడు. అది ధర్మం కాదూ? ఈ

(34-వ పేజీ చూడండి)

వనితాలోకం

వంటయింటి విశేషాలు

మాట్లాడే భాషనుబట్టీ, వేషధారణనుబట్టీ, ఒక వ్యక్తి ఏ జాతి వాడైనదీ ఏ ప్రాంతీయుడైనదీ ఏ విధముగా నిర్ణయము చేయవచ్చునో, ఆహారమునుబట్టి కూడా ఆ విధముగానే నిర్ణయించవచ్చును [illegible] వచ్చుచున్న కొద్దీ మానవుడి [illegible]రములో అనేక మార్పులు వస్తున్నాయి ఆదికాలములో మానవుడు అపక్వాహారము మీదనే ఆధారపడ్డాడు. క్రమముగా పక్వముచేసి తినటము నేర్చుకున్నాడు అతరువాత ఉప్పు కారము క్రమముగా పులుపు చేర్చుకొని షడ్రుచులకు అలవాటు పడ్డాడు. ఆ ఆరురుచులకు అలవాటు పడటములో ఒక్కొక్క ప్రాంతమున నివసించేవారికి ఒక్కొక్క విధానము అభ్యాసమైనది.

సాధారణముగా ప్రజల ఆచారాలు ఆహారము చాలావరకు ఆ ప్రదేశముయొక్క శీతోష్ణస్థితిమీదనూ, ఆ ప్రాంతములో ఉత్పత్తి అయిన ధాన్యములమీదనూ ఆధారపడి ఉంటాయి అక్కడి శీతోష్ణస్థితి ఆ ఆహారానికి అనుకూలంగా ఉంటుంది.

ఆంధ్రుల ఆహారపదార్థాలలో ప్రధానమైనది వరిధాన్యము వీరికి ఉప్పు పులుపు కారము అందరికంటె అధికముగా తినే అలవాటు. ఆంధ్రులలో ఉప్పు కారము ఎక్కువ తినేవాళ్ళలో గుంటూరు ఒంగోలు జిల్లాలు ముందుకు వస్తాయి వీళ్ళనుగురించి గొడ్డుకారము తినేవాళ్ళు అని పరిహాస పూరితమైన మాటకూడా ఉన్నది చింతపండు కూడా కొన్ని జిల్లాలవారు అధికముగా ఉపయోగిస్తారు చింతపండు ఆంధ్రులు విరివిగా వాడే వస్తువులలో ఒకటి బొంబాయిలో చింతపండు పేరు

ఇల్లిందల సరస్వతీదేవి

మీద ఒక వీధి ఉన్నదట, కాని అక్కడి వారికి దాని రుచి ఎక్కువగా తెలియదని ఒక వాడుక. శ్రీ శే వేటూరి ప్రభాకర శాస్త్రిగారికి గుంటూరు జిల్లాలో చైత్ర మాసములో ఎవరి వంటయింట్లో చూసినా చింతపువ్వు పచ్చడికూరో - వేపుడు పచ్చడో కనబడేదట. చింతపండులో అన్ని విటమినులూ ఉన్నాయనీ, చింతపండు చాలా శ్రేష్ఠమైనదనీ అది విరివిగా ఉపయోగించతగినదనీ డాక్టరు గురుస్వామి ముదలియారు ఆరోగ్యసూచికలో చెప్పారు

గంటలేని ఇల్లు - దొరలేని తగవును
చింతపండులేని - వింత దవియు
జనవులేని కొలువు, శశిలేని రాత్రియు
ముక్కులేని మొగము నొక్క రీతి

చింతపండు లేనిరుచి వింత దవి ఏమిటి -
అసలు రుచిలో లెక్క కాదన్న మాట

చింతపండు తక్కువ తినేవారు ఒంటెత్తు గుణము కలవారని, విస్తారము తినేవారికి విశాలమైన భావాలు పట్టుబడి అందరితో కలిసి మెలసి ఉంటారని శాస్త్రజ్ఞుల పరిశోధనవల్ల తేలిందని ఒకసారి పత్రికలు ప్రకటించాయి అందరి తలలో నాలుకవలె తిరుగవలెననుకున్నవారు చింతపండు ఎక్కువగా తినాలని తెలుగువారి వాడుక మాటలు చింతపులుసు రక్తాన్ని శుద్ధిచేస్తుందని కొందరంటారు. రక్తాన్ని విరిచేస్తుందని కొందరంటారు 'జొన్న అంబలికి చింతకాయ తొక్కుకూ మైత్రి' అని సామెత వాడుకలో ఉంది, జొన్న సంకటి, చింతకాయ తొక్కు, మజ్జిగ ఉంటే స్వర్గము నొల్లేవారు కొందరున్నారు.

మును జిగురునఁ బువ్వనో
మనగాయల దోరపండ్ల మరియూరగ బం
డిన పండ్ల నెల్లకాలము
దనియగ జవులొసగనొంతు తరువులు
గలవే

అన్నాడొక కవిరాజు అంబటి మాన్యము ఇచ్చిన రాజులుకూడా మన చరిత్రలో ఉన్నారు ఈ విధముగా తెలుగువారి చింతపండు జేజే లందుకున్నది

తెలుగువారు ఆకుకూరలలో ఎక్కువగా గోంగూర, బచ్చలికూర, తోటకూర, పొన్నగంటికూర, చిట్టింటికూర, ఉపయోగిస్తారు.

అవిసెకూరను కర్నాటకులు ఎక్కువగా వాడుతారు. వారు ద్వాదశి పారాయణపు తిథిగా ఉపయోగించే కూర అవిసెకూర, అరవవారు కొనుంచి ఆకుకూడా తింటారు. అరవవారుకూడా ఆకుకూరలను ఎక్కువగా తినేవారే. గుంటూరు జిల్లా గోంగూరకు పేరుమోసింది. దీనిలో ఇనుము ఎక్కువగా ఉంటుందని శాస్త్రజ్ఞుల అభిప్రాయము. ఆంధ్రులు దీనిని పచ్చడిగాను పులుసుకూరగాను తయారుచేస్తారు. గుంటూరు జిల్లా నుంచి గోంగూరను తీసుకొని వెళ్లి గొల్లపూడి సీతారామశాస్త్రిగారు మహాత్మగాంధికి ఇచ్చారని పత్రికలు వింత వార్తక్రింద ప్రకటించాయి ఆ రోజులలో. అరవవారింటి ఆడబడుచు గాంధిగారి కోడలైన తరువాత ఆయనకు ఆకుకూరలమీద అభిమానము ఎక్కువయినదట. అందుకొరకే కొబోలు శాస్త్రిగారు గాంధీగారికి గోంగూర బహుమానము సమర్పించినది. గోంగూర రుచిని మరువలేక మన కవులు కొందరు ఛందోబద్ధము చేశారు.

గోంగూర వంటిశాకము
సంగీతము చేత నబ్బ సరసజ్ఞతయున్
....
ఉల్లిపాయదార్చి పుల్లగోంగూరను
పచ్చిమిర్చినందు గుచ్చి ఎత్తి
తైలపిష్టశకల తతితోను వొంచిన
పులుసుగూర రుచిని పొగడదరమె!

ఆకుకూరలలో బచ్చలికూర, గోంగూర ఒక రకమైన ఉపయోగానికి పనికివస్తాయి. పచ్చడి, పులుసుకూరలకు విరివిగా వాడే కూరలివి. మిగిలిన ఆకుకూరలు పొడికూరలు, ముద్దకూరలు, పులుసుకూరలు, పప్పుకూరలుగా ఉపయోగిస్తారు. చేమకూర పొంకూర పైవిధముగా ఉపయోగించటమే కాకుండా సెనగపిండితో బజ్జీలు కూడా చేస్తారు.

తెలుగువారి పచ్చళ్లు ఊరగాయలూ కూడా ప్రత్యేకమే. చింతకాయ, ఉసిరికాయ, గోంగూర సంవత్సరము పొడుగునా ఉపయోగించేటట్లుగా పచ్చళ్లు పెట్టి ఉంచుతారు. గుంటూరు జిల్లావారి మిరపపళ్లు కొత్త చింతపండుతో తయారుచేసిన పళ్ళపచ్చడి ప్రసిద్ధికెక్కినది. ఆంధ్రుల పచ్చళ్లకు అంత రుచినిచ్చేది చింతపండే.

ఒకసారి వాసిరెడ్డి వెంకటాద్రినాయుడుగారు గ్రామపర్యటనము చేస్తూఉండగా అపరాహ్ణమయినదట. ఒక పేదయిల్లాలికి ఆయన అతిథిఅయే భాగ్యము లభించిందట. ఆ కుగ్రామములో దొరకే వస్తువులైనా ఆ యిల్లాలికి అలభ్యము. ఆ స్థితిలో ఆమె పచ్చగడ్డిని ఎర్రగా వేయించి చింతపండు వేసి పచ్చడి నూరి నాయుడుగారికి వడ్డించిందట. ఆకలి మండిపోతుండడము వల్లను ఆ యిల్లాలి హస్తపాకరుచివల్లను ఆయన దానినే పంచభక్ష్య భోజ్యములుగా ఆరగించాడట. ఆమె అతిథి సత్కారానికి, పాకరుచులకు మెచ్చి ఒక అగ్రహారము బహూకరించాడట. అదే గరికవలస అంటారు.

ఊరగాయలను సిద్ధము చేయటములో ఆంధ్రులలో గోదావరి జిల్లా వారిది అగ్రతాంబూలము. మామిడికాయ ఊరగాయను అనేక రకాలుగా తయారుచేస్తారు. వీటిలో కొబ్బరి, నువ్వులు, బెల్లము, వెల్లుల్లి కూడా కలిపి ఊరగాయ వేస్తారు. గోదావరి నీటికి ఆ గాలికి మూడు పూటలూ ఆవకాయ ఉపయోగించినా ఆరోగ్యము చెడదు. అక్కడి వారికి ఆవకాయ పది సాధకాల పెట్టుగా ఉంటుంది. ఆంధ్రులొకరు మామిడికాయ ఊరగాయను జాడీలలో నింపి విదేశాలకు పంపి వ్యాపారము చేశారని చెప్పుకుంటారు; దానివల్ల చాలా ధనలాభము కలిగిందట. మన దేశములోకూడ మన ఊరగాయలను మెచ్చి అభిమానముతో ఉపయోగించే ఇతర జాతీయులున్నారు.

ఆంధ్రుల వంకాయకూర చాలా ప్రసిద్ధికెక్కింది. 'వంకాయవంటి కూరయు...... శంకరుని వంటిదైవము' అని ఒక కవి తనకు వంకాయకూరమీదగల అభిమానాన్ని శంకరునితో పోల్చి ప్రచారము చేశాడు. గోదావరి జిల్లావారు పనసకాయకూరను చాలా ఘనముగా ఎంచుకుంటారు. పనసకాయ పొట్టు తీయుటము సన్నగా కొట్టటము యజ్ఞము చేసినంతపని. దాని పాకముకూడా అందరికీ తెలియనిదే.

గుమ్మడికాయ, బొప్పాసకాయలను కూరలకుకూడా ఉపయోగిస్తారు. బొప్పాసలో విటమినులన్నీ ఉన్నాయనీ-స్త్రీలకు వంధ్యాత్వము దాని ఉపయోగమువల్ల పోతుందనీ అంటారు. దోసకాయ కూరకు, పులుసుకూ, పచ్చడికేకాకుండా, ఆవకాయ క్రిందకూడా ఉపయోగిస్తారు.

తెలుగువారి దప్పళానికొక ప్రత్యేకరుచి. గుమ్మడికాయ ముక్కలేని దప్పళము వివాహాలపట్ల మర్యాద కాపాడదు. ఏ ముక్కా లేకపోతే వంగపేడు పులుసులో ఉండనే ఉంటుంది.

పిండివంటలలో గారెలది బూరెలదీ అగ్రస్థానము. గారెలు లేనిదీ పితృకార్యాలు వెళ్లవు; బూరెలు లేనిదే పండుగపబ్బాలు గడువవు. బొబ్బట్లు అప్పాలు పెరుగుగారెలు ఒక్కొక్కటి ఒక్కొక్క ప్రత్యేక రుచి కలవి. మినపసున్ని, చక్కిలాలు, అరిసెలు, ఖర్జికాయలు. లడ్డూలు లేనిది పెళ్లిళ్లు పూర్తికావు, వినాయకుడికి ఉండ్రాళ్లుపోసి పాలకాయలు పిల్లలచేతికిచ్చి - తెలుగువారు ప్రతిసంవత్సరము తొలిపండుగ చేసుకుంటారు.

ఆంధ్రుల ఆహారముమీద - పాకరుచులమీద ఇరుగుపొరుగు ప్రాంతాల ప్రభావము చాలా పడుతునే ఉన్నది. మహారాష్ట్ర ప్రాంతములో ఉన్న ఆంధ్రులు, తమిళ ప్రాంతములో వున్న ఆంధ్రులు, ఆంధ్రదేశములో ఉన్న ఆంధ్రులమధ్య మాటలోను ఆహారములోనూ భేదాలు కనపడుతూనే ఉంటాయి. హైదరాబాదు ఆంధ్రులు ఆలూభాత్‌కు అలవాటుపడితే, సర్కారు ఆంధ్రులు పులిహోరకు అలవాటుపడ్డారు. తెలంగాణావారు పులిహోర కమ్మదనాన్ని నిర్వచించగలరు, కాని సర్కారు ఆంధ్రులలో చాలామంది ఆలూభాత్‌ను రుచిమాడలేరు. ఈ విభిన్నరుచులకు చరిత్రలో అప్పుడప్పుడు వివాహాలు తటస్థపడుతూఉంటాయి. దంపతులు ఆహారములో విభిన్నరుచులు కలవాళ్లయితే విచిత్రముగానే ఉంటుంది. ఆయన రుచులకు అనుగుణ్యంగా వంటచేద్దామని ఆ యిల్లాలెంత కష్టపడినా, ఆ గృహస్థుకు అసంతృప్తే. ఆయన రుచి ఆమెకు అర్థముకాదు. 'భోజ్యేషుమాతా' అనే సూక్తిని జ్ఞాపకముచేసుకొని బాధపడుతుంది ఆమె. అసహాయత అతడికి గోచరించదు. ఈ సందర్భములో పొరుగింటి పుల్లకూర నచ్చుటము గృహస్థుకు తటస్థపడుతూ ఉంటుంది.

"ఆవిడచేతి వంట తిన్న దగ్గర నుండీ ఆయన ఎట్లా మారిపోయాడో" అంటారు సామాన్యముగా. చాలామంది మగవాళ్లు ఆత్మకింపయిన భోజనముతో వశులయిపోతారని చెప్పుకుంటూ ఉంటారు. ఏ హోటలులో అయినా మంచిపదార్థాలు లభిస్తే అక్కడికే తరుచుగా అందరూ వెళ్లుతూ ఉంటారు. ఆ విధముగానే 'ఆమెచేతి పెట్టు చూశావా! ఆయన ఎలా చిక్కిపోయాడో!' అని అంటారు.

దూరపు ప్రయాణాలలో ఆత్మకింపయిన భోజనము లభిస్తే జన్మంతా జ్ఞాపకము ఉంటుంది. శ్రీనాథుడొకసారి.

నడిమూకలేని యన్నము
వడబోసిన నెయ్యి బుడమవరుగన్ బెరుగున్
గడిమాడసేయఁ బెట్టిన
నడగూడెపు వంటి పడుచునడిగితినమ్మీ!

అని ఆ ప్రాంతీయులొకరు ప్రయాణమవుతున్న సమయములో అన్నాడట.

తెలుగువారి భోజనము సాధారణముగా పప్పుతో ప్రారంభమవుతుంది, దానిని పురస్కరించుకొనే ఒకాయన 'పప్పే పసబాపల కల్లను' అన్నాడు. పెరుగుతో భోజనము సమాప్తమయే తెలుగువారికి అందరికీ అన్నివేళలలో గడ్డవంటి పెరుగు లభ్యముకాదుగా! అందుకని

గొప్పైన నిమ్మపండ్లును
గప్పురమునుసొంటిపొడియుగరివేపాకున్
ఉప్పును సేలకు లింగువు
నొప్పుగ నీ చల్ల రుచికి నొనగూర్పదగున్.

అన్నారు. ★

వనితాలోకం:

నోచుకున్న భార్య

రచన:
వి. వి. శ్రీనివాస అయ్యంగార్

అనువాదం:
శొంఠి కృష్ణమూర్తి

అంకం 1. రంగం 1.

మద్రాస్‌లోని ఒక ప్రాంతంలో ఒక ఇల్లు—అందులో డ్రాయింగ్ రూమ్.

కాలం—ఉదయం.

[తెర ఎత్తేటప్పటికి డాక్టర్ నాయుడు స్టెతోస్కోపూ, సంచీ పట్టుకుని సీరియస్‌గా నుంచుంటాడు. లలితా ఆయనా ఏదో సంభాషిస్తో ఉంటారు.]

డాక్టర్ నాయుడు: నయమయిందా, అంటారా. అబ్బే - ఇంకా కాలేదు.

లలిత: ఈ వేళ్టికి కొంత నయమవుతుందనుకున్నారుగా.

డా: అవును - మేం అలాగే అంటూ ఉంటాం, అస్తమానూ.

ల: కాని దీనిలో ఏదో ప్రత్యేకత వుందనుకున్నాను లెండి.

డా: ఆఁ! అలాగా! అవును. క్షమించమ్మా! నిజంగానే ఉంది. కొంచెం వాపు తీస్తుందనుకున్నాను. ఐతే, అది అంతగా తలకెక్కలేదు. కాని...నాకు అతని హృదయమే నచ్చలేదు.

ల: నాకూ అంతే లెండి, నిజానికి. అయితే పరిస్థితి అంత చెడ్డగా ఉందంటారా? చాలా ప్రమాదకరంగా ఉందనుకుంటున్నారా? మీరు నా అభిప్రాయం గ్రహించారనుకుంటా.

డా: ఇటు చూడమ్మా, లలితా! నిన్ను నా కన్నకూతురిలాగే భావించుకుంటున్నా—మంచిదలే - నువ్వు నూత్నజ్ఞానం కలదానివి - నీదగ్గర అసలు విషయం దాచి లాభంలేదు. అతనింకా...విషమపరిస్థితిలోనే వున్నాడు.

ల: నేనూ ఈ మూడుగోజుల్నుంచి అలాగే అనుకుంటున్నాలెండి. నే అన్నిటికీ సిద్ధమే ఆ దురవస్థేదో చెప్పండి.

డా: అదేం కాదు. అతను బతుకుతాడనే నమ్ముతున్నా—కొత్తమందు ఇచ్చాగా. మళ్ళీ సాయంత్రం వొస్తా. ఈ లోపల అధైర్యపడకు.

ల: అధైర్యపడను. పడినా చేసేదేంలేదు; ఇక్కడకూచుని రోజంతా ఆ గదికేసి చూడ్డం తప్ప. డాక్టర్! నన్ను లోపలికెందుకు వెళ్లనియ్యరు?

డా: ఆయన క్షేమంకోసరే.

అప్పుడప్పుడు స్పృహ వొస్తోవుంటుంది. అప్పుడు... ఆవిడ్ని గురించి అడుగుతోవుంటాడు. నామాట విను—అది నీకు నచ్చదు.

ల: నా కిష్టమేనండీ! నన్ను—నే ఏ స్థితిలో వున్నదీ—మీ రెరగరు? నా హృదయం రాయయిపోయింది. ఎంతో అనుభవించాను. ఎన్నో కష్టాలు గడిచాయి. మీ అమ్మాయితో అడుకున్న, ఆ లలిత కాదిది. దేవుడు మీ అమ్మాయినే ఎందుకు తీసుకుపోవాలి? నన్నిలా ఎందుకు బతకనియ్యాలి?

డా: అదే అదృష్టవంతురాలేమో! లేకపోతే నీలాగే కష్టపడుతో బతుకుతూ ఉండేదేమో?—ఎవరికి తెల్సు. నీ తల్లితండ్రులు నీ కష్టాల్ని చూస్తో బతికుండడం ఊహించుకో.

ల: మీరుమాత్రం నా తండ్రివంటివారు కాదూ? మీరు బాధపడడంలేదా? వైద్యుడు మాదిరిగానే ఉన్నారా? మొన్న...దానింటికి ... ఆయన్ని తీసుకురావడానికి వెళ్లినప్పుడు - స్పృహతప్పి శవంలా పడిఉన్న ఆయన్ని చూసి—మీరు దుఃఖించలేదూ? ఆమాట అంతా అనుకున్నారుకూడా!

డా: అది, సరే నాకాలస్యమవుతోంది. నే వెళ్లాలి. సరిగా నాలుగింటికి తిరిగివొస్తా.

ల: డాక్టర్! మిమ్మల్నొక విషయమడగవచ్చా?

డా: అడుగమ్మా! నువ్వేదడిగినా—కాదనను.

ల: ఆయన బతుకుతారో లేదో—వారు మావారు—బతికి నట్టయితే, మళ్లీ దానివద్దకు పోకుండా ఉంటారో, లేదో?—ఆ దేవుడికే తెలియాలి. అదే...నన్ను అమితంగా బాధిస్తోంది... నే నెందుకూ జీవించడం?—ఆయన ఇష్టానికి వ్యతిరేకంగా చిన్నతనంలో నే - ఆయనకు పెళ్లిచేశారు. అప్పట్నుంచీ మేం దేవుడిదృష్టిలోనూ మానవుల దృష్టిలోనూ భార్యాభర్తలమే.

ఆయన జీవితపు తుది ఘడియలో, ఆయన సామీప్యంలో ఉండి, ఎందుకు సేవ చెయ్యకూడదు?

మీరు వొద్దని తలూపకండి.

నేను ఏడవను; మాట్లాడను; కలత పెట్టను. ఆయన నన్ను గుర్తించలేరుకూడా.

డా: అదెలా అసాధ్యమవుతుంది?

ల: సాధ్యమే; కష్టమేమీలేదు. ఆయన ఎప్పుడూ నన్ను ద్వేషిస్తూనే ఉన్నారు. నాకేసి చూడలేదుకూడా! నన్ను ఎరగరు. నేను మీ నర్సుల్లో ఒకతెగా ఉంటాను. నన్ను మిస్. ఫారుఖ్వాన్ అని పిలవండి. నిశ్శ

ఖ్యంగా, తక్కిన నర్సులతో పాటు పని చేస్తాను - యాంత్రికంగా.

డా: మంచి ఐడియాయే - కాని ఇప్పుడు కాదు, అమ్మాయ్ - సాయంత్రం కలుస్తా.

ల: డాక్టర్! దయుంచి అలా నిర్దయులై వెళ్ళిపోకండి! మంచిదనుకుంటే సరే నసండి! - అనరూ?

డా: దాన్ని గురించి ఆలోచించాలా?

ల: ఆలోచన? బతుకంతా నిమిషాలమీద ఆధారపడి వున్నప్పుడా?

డా: తొందరపడకు, లలితా! నువ్వు చెప్పిన దాన్ని గురించి ఆలోచించి, పని కలుగదనుకుంటే అనుమతిస్తా. సాయంత్రం వరకూ ఓపికపట్టు. కాని - నువ్వొక నల్ల ద్దాల కళ్ళజోడు పెట్టుకోవల్సి వస్తుంది - నేను అనుమతించినా. అప్పటికి ఆతడు అనుమానించలేదు - లేకపోతే నీ కళ్ళే కథలు చెప్పేవిలా వున్నాయి.

ల: ఏం చెయ్యమన్నా సిద్ధమే.

డా: సరే, ఆలోచిస్తా. అదుగో, మీ అత్తగారు తడుముకుంటూ వస్తోంది. ఆవిడ నిన్ను చూసిందంటే కదలడానికే వుండదు; పోస్తా.

ల: డాక్టర్! సాయంత్రంవరకూ ఓపిక పడతాను. కాని నా కోరిక అంగీకరించక తీరదని గుర్తుంచుకోండి. నేను అలాగే నిర్ణయించుకున్నా.

డా: బెదిరించాలని చూస్తున్నావా, లలితా.

ల: బెదిరింపు? ఒక పేద అబల - నిస్సహాయురాలు - భర్తనిగాని, సుఖాన్నిగాని ఎరుగని, తల్లిదండ్రులూ, దిక్కూ లేని అమాయక స్త్రీ దగ్గర ఏముంది, మిమ్మల్ని బెదిరించడానికి?

డా: నువ్వు చేసేది, బెదిరింపేనమ్మా!

ల: అదికాదండీ. మీ కెందుకు చెప్పకుండా ఉండాలి? పొద్దున్నే ఓ కల వొచ్చింది. ఎంత నిజమనిపించిందనుకున్నారు! నేను వారిని చావునుండి - అంతకంటె ప్రమాదకరమైన పరిస్థితినుండి - రక్షించగలననిపిస్తోంది. మీరు నా కెందుకు ఆ అవకాశం కల్పించరూ?

డా: కల్పిస్తా - ఆలోచించినమీదట. సరే, వెడతా.

(పార్వతి చేతికర్రతో దారి తడుముకుంటూ వొస్తుంది.)

పార్వతి: ఎవరది? మీరేనా డాక్టరుగారూ? ఎందుకలా పారిపోతున్నారు? మీతో మాట్లాడ్డానికి నే వొస్తున్నాననా?

(లలిత నిష్క్రమిస్తుంది)

డా: అబ్బే, అదేం లేదండీ! సేలంనుంచి వొచ్చిన జమీందార్ని పదకొండు లోపల చూస్తానన్నాను. అందుకని...

పా: నా ముద్దులకోడలు మీతో మూడు గంటలుగా సంభాషిస్తోన్నట్టుందే? ఆ స్వంతా తన చేతుల్లో ఎప్పుడు పడుతుందో తెల్సుకోవాలని ఆత్రుత పడుతోందనేది నిస్సందేహమే ననుకోండి.

డా: మీ ఉద్దేశ మర్థమవడం లేదండీ.

పా: అవును లెండి; ఎలా అవుతుంది? నేను వొట్టి మూర్ఖురాల్ని: నాకు రాయనూ, చదవనూ రాదు. నన్ను మీ రెలా అర్థం చేసుకోగలరు? మా కోడలు చెప్పిందంతా మీ కర్థమవుతుంది - అవునాండి?

డా: అప్పుడప్పుడు,

పా: నా మాటలుమాత్రం మీ కెప్పటికీ అర్థం కావు; మీరు అర్థం చేసుకోవాలను కోరు.

డా: మీ రలా ఎందుకంటారు?

పా: ఎవళ్ళన్నా నిజమాడితే మీ కలాగే ఉంటుందన్నమాట.

డా: నాకు మీమాటలు అర్థంకాంది నిన్నే.

పా: ఫరవాలేదులెండి. నేను, ఇప్పుడు ముసలిదాన్ని, గుడ్డిదాన్ని, బీదదాన్ని, నన్నెవరు లెక్క చేస్తారు?

డా: ఎవరూ లెక్క చెయ్యకపోతే, దేవుడే దిక్కు.

పా: అవును, నిజమే అందరూ నన్ను గురించి ఏవిధంగా భావిస్తున్నారో నాకు తెల్సు. మీరంతా నే చావాలని కోరుకుంటున్నారు. కాని నేను అందరికీ భారమే— నా కొడుకు మరణించాక ఇంకా భారం అవుతాను.

డా: మీ రెప్పుడూ మీ కొడుకు చావుని గురించి మాట్లాడుతారేం? సొంతకొడుకైతే అలా అనగలరా?

పా: పెంపుడు కొడుకైతేనేం? నేను వాణ్ని ఎంతఎక్కువగా ప్రేమిస్తున్నానో, పైనున్న ఆ భగవంతుడికే తెల్సు.

డా: అతనంటే చాలా విచారంగావుంది నాకు.

పా: నా మాటేమిటి? నే నంటే మీ రెందుకు విచారపడరు? నా కొడుకే చస్తే, నాకు దిక్కెవరు?

డా: మీ రేం అట్టే అధైర్యపడకండి. వాకేం భయం లేదు. బతుకుతాడు.

పా: నాకేం నమ్మకం లేదు; ఏమీ తెలీదు కూడా! రోజురోజుకీ శల్యమైపోతున్నాడు. అదే నేమాసేది... ఇలాంటి కోడలు దాపరిస్తే ఇంతకంటె ఏమౌతుంది?

డా: మీ మేనకోడల్నిచ్చి పెళ్లిచేసింది మీ రేకదండీ?

పా: ఇలాంటి మొద్దులా దాన్ని వాళ్లవాళ్లు పెంచుతారని నాకేం తెల్సు?

డా: మీవద్దకొచ్చాక, మంచి పద్ధతులు నేర్పవల్సింది!

పా: అమ్మో! దానికీ? అంటే -

★ నోచుకోన్న భార్య ★

ఇంట్లోంచి బయటకు నడవనమే నన్న మాట.

డా: నాకు, ముందు బయటకు నడిచే మార్గం చూపండీ - ఆలస్యమౌతోంది. నాకు చాలా అర్జంటుపనుంది - మళ్ళీ ఎప్పుడన్నా తీరుబడిగా మాట్లాడుకుందాం.

పా: వెళ్ళకండి డాక్టరుగారూ. ఒక్క మాట; దయచేసి వినరూ - కాటికి కాళ్లు చాచుకున్న ముసలిపీనుగని. నా కొడుకు కంఠంలో ప్రాణముండగానే - అంటే వాడికి ఏమీ జరక్కుండానే - ఏదన్నా ఏర్పాటు చేసుకోడం అవసరం కాదూ?

డా: ఇప్పుడెల్లా? అతనికి స్పృహ లేదు నిమ్మళించేవరకూ అదేం కుదరదు.

పా: చాలామంది వీలునామాలు స్పృహ లేనప్పుడే రాస్తారుటగా!

డా: ఆ సంగతి మీ మేనల్లుడు చెప్పాడా? అవును; అతను ప్లీడరుకదూ? - ఇట్లాంటివి బాగా తెలుస్తాయి.

పా: అబ్బే! అదేంలేదండీ! వాడి కిలా వుంటే, నేనెలా వెళ్ళగలిగాను.

డా: ఎలాగంటూరా? చెప్పనా? కాని నాకు చాలా ఆలస్యమౌతోందే?

పా: అయితే దారిలేదా? మీరు డాక్టరుగా సంతకంచేసినా, విల్లు రాయలేడా?

డా: అసంభవం!

పా: అయితే ఆస్తంతా ఎవరికిపోతుంది?

డా: వారసులకు.

పా: అతనికి వారసులెవరూ లేరే? - కొడుకుగాని, కూతురుగాని? ఆ అదృష్టమే వుంటే నాకీ ఏడుపెందుకు? ఇదంతా అతని బావమరదులు దోచుకుంటూరు.

డా: మీ కోడలంత మూర్ఖురాలుకాదే

పా: అవును; నాకూ తెల్సు. ఐతే అత్తగారివద్ద ప్రదర్శించిన తెలివితేటలు అన్నదమ్ములదగ్గర పనికిరావుగా.

డా: మీకేం లోటులేదుగా. వాళ్లలా ఏడుస్తే మీకెందుకు?

పా: నా భర్త ఆస్తిని ఎవళ్లో, రోడ్డుమీదివాళ్ళు దోచుకుపోతుంటే చూస్తూ కూచోడానికా నేను బతికివున్నది?

డా: మీరేం బాధపడకండి! మీ కోడలేగా?

పా: కోడలూ, గోడలూను, కాని - నా కొడుకుతర్వాత నా భర్త ఆస్తికి నేనుగా వారసురాల్ని?

డా: మీ గతే మీకే వొస్తుంది; నన్ను వెళ్ళనీయండి.

పా: ఐతే, కష్టమేమీ వుండదంటూరా?

డా: బహుశా, అంతే!

పా: అవునా? నేనూ అలాగే అనుకున్నాలెండి. మీ అంత తెలివైనవారెవరూ లేరు. మీరలాగా వాణ్ని బతికిస్తారని నాకు తెల్సుగా.

డా: అంతా మీ ఆశీర్వచన బలమే - వస్తానమ్మా!

(నిష్క్రమణ.)

అంకం 2. రంగం 1.

సమయం — సాయంత్రం.

[మంచంమీద రామనాథం. డాక్టరూ, లలితా మాట్లాడుతూ వుంటారు.]

లలిత: హాల్లోకి వెళ్ళి మాట్లాడదాం, డాక్టర్.

డాక్టర్ నాయుడు: అవన్నీ డాక్టర్‌కు తెల్సులే! చెప్పాల్సింది నువ్వు కాదమ్మా!

ల: మన మాటలవల్ల ఆయన లేస్తారేమోనని.

డా: నీ అతిజాగ్రత్త ప్రస్తుతానికి అనవసరమే లే! ఇంకా ఎనిమిదిగంటలసేపు అతన్ని లేపాలనుకున్నా లేపలేవు. పొద్దున్నకి స్పృహవొస్తుంది. దానితో అతనికి ప్రమాదం తప్పినట్టే.

ల: అలాగా డాక్టర్! ఆయన బతికినట్టేనా?

డా: అవునమ్మ! ఈ జబ్బుకు సంబంధించినంతవరకూ భయంలేదు.

ల: డాక్టర్! మీ కెలా కృతజ్ఞత తెలపాలో తెలీడంలేదు. నా జీవితంలో - ఈ వారంరోజులూ అత్యంత సుఖదాయకమైనవి.

డా: చావుబ్రతుకుల మధ్య ఊగులాడే భర్తకి సేవచేసిన వారం రోజులూనా! సుఖాన్ని గురించిన నీ అభిప్రాయాలు వింతగా వున్నాయే?

ల: నాకదే సంతోషం; కష్టంలోకూడా సంతోషం వుంది, డాక్టరుగారూ.

డా ఐతే ఇదొక రోగమే - కాని ఆరక రోగ మనడానికి వీలులేదు సరేలే నీతో వాదించడం నాకిష్టంలేదు కాని అతను లేచినప్పుడు చాలా జాగ్రత్తగా వుండాలి సుమా!

(మిస్ కంటకం ప్రవేశిస్తుంది)

కంటకం ఆ ముసలావిడ - ఆయన తల్లి పక్కగదిలో వుంది, సార్ ఆయన్ని చూస్తానని గోలచేస్తోంది

డా అది డెప్పుడొచ్చింది? నీతో పోల్లాదాక మేనల్లుడు - ప్లీడరింటికి - వెళ్లింది ఎప్పుడొచ్చిందో?

ల కొన్ని క్షణాలక్రితమే వచ్చివుంటారు అయితే ఇప్పుడేం చెయ్యమంటారు- మరి - ఇక్కడికి రాకుండా చెయ్యడమెలా?

డా ఆ భారం నాకు వదిలెయ్యి— నేను చూసుకుంటా (కొంచెందూరం నడిచి ఆగి) మిస్ ఫార్చ్యూన్! నేను చెప్పింది గుర్తుంచుకో చాలా జాగ్రత్తగావుండాలి అతనికి చాలా శాంతి, విశ్రాంతీ అవసరం

ల అలాగేనండీ! (డాక్టర్ వెడతాడు)

కం ఆ ముసలావిడకిక్కడేంపని? ఎంతో కంగారుపడుతోంది వింతైనమనిషి!

ల ఎప్పుడూ అంతే ఆవిడ

కం ఆవిడ నీకుతెల్సా? ఎన్నాళ్లనుండి?

ల తెల్సుగాని, అది నాకు జ్ఞాపకముంచుకోవాల్సిన అవసరం కలగలేదు

కం ఆవిడంటే నీకు భయమని తోస్తోంది! ఆవిడ వొస్తే ఏం? డాక్టర్ ఈ రోగి ఉదయంవరకూ లేవడని చెప్పాడుగా

ల ఏమో! నాకు తెలీదుకాని నియమాలు నియమాలే! ఒకసారి రానిస్తే గంటగంటకీ వొస్తానంటుంది ఆవిడంటే ఎందుకో నాకిష్టంలేదు

కం పాపం— ముసిల్ది—ఆవిడన్నట్లు— కాటికి కాళ్లుచాచుకుని కూడా—నాకు రూపాయిచ్చింది

ల ఏమిటీ? నువ్వు లంచాలుతీసుకుంటున్నావా? ఎంత ధైర్యం? నే నీ సంగతి డాక్టర్‌తో చెప్పాల్సివుంటుంది

కం నాకేం గురుద్దేశంలేదు, అది లంచమైతే అంతే! నువ్విలా గోలచేస్తే, అది ఆవిడ మొహాన్నే కొడతాను

ల బయట గొళ్లెం వేసి ఆ ముసలావిడ లోపలికి రాకుండా చూడు

(పార్వతి ప్రవేశిస్తుంది, కంటకం ఆగి పోతుంది)

కం మీ రూపాయిదిగోనండీ! మీరు లోపలికి రాకూడదుట!

పా రూపాయేమిటది అది నాదికాదు నేను నీకివ్వలేదే? నేను లోపలికి రాకూడదనేదెవ్వరు? ఇది నా యిల్లు! ఎవడా అనేది!

కం ఆవిడా!— డాక్టర్ ఖచ్చితంగా చెప్పాడుట

పా ఇది ఇంకా డాక్టరుగారిల్లవలేదే! దేవుడి పుణ్యమా అని నా కొడుకింకా బతికే వున్నాడుగా నా ముద్దుల కొడుకేడీ? డాక్టరుగారిక్కడే వుందన్నారే?

ల డాక్టరుగారు చెప్పారా? అదేలా? ఆఁ- చెప్పి వుండవచ్చు అలా అంటే మీరు లోపలికిరారని దయుంచి బయటకు నడవండి

పా నువ్వెవరమ్మా? ఇక్కడేం చేస్తున్నావ్?

ల మేమిద్దరమూ నర్సులమే

పా నీగొంతుక ఎక్కడో విన్నట్టుందే ఐతే నువ్వేనన్నమాట నేనలాగే అనుకున్నా హరి భగవంతుడా! ఆ అమ్మగారి కొంపలో మందు పెట్టించి వాడికి జబ్బు తెప్పించావ్? ఇప్పుడు వాడ్ని చంపించడానికి చూస్తున్నావా? నే వెళ్లి ఊరంతా చెప్పగొడతాను ఒక ముసలిపీనుగనైతే యేం నా తాహతు కూడా చూపెడతాను

ల ఈగొరొక్కడ ఆడదిరా, దేవుడా! ఏమండోయ్! మేం మీ మాటలకి జడవం మీ కొడుకుమీది ప్రేమతో మీ హృదయ ద్వారాలు తెరుచుకున్నట్టున్నాయి ఐనా ఇక్కడేమీ గల్లంతు చెయ్యవద్దు ఒక్క మాట మాట్లాడినా, దానికి, తర్వాత, మీరే విచారిస్తారు

పా నే వెడుతున్నా కాని—ఎక్కడికో తెల్సా నీకు?

ల నాకక్కర్లేదు ఆ పాతమంగలి ఎక్కడున్నాడో తెల్సిపోయింది బతికే ఉన్నాడు, అబద్ధమాడకు—వెళ్లండి

పా పాతమంగలా? హరి భగవంతుడా! నాకు వాళ్లగురించేం తెల్సు? వింతగా అంటున్నావే? నా కొడుకెల్లా వుందో చూద్దామని వొచ్చానంతే! నా పని పూర్తయింది నాకు వేరే పనుంది ఈ క్షణంలో

(30-వ పేజీ చూడండి)



లేపాక్షి దేవాలయంలో కుడ్యచిత్రం



ఫోటో : కె. గురుమూర్తి—మద్రాసు.

నోచుకున్న భార్య ★

మా మేనల్లుడి ఇంటికి పోవాలి—కొప్పకుడు—వెళ్ళివస్తా.

ల: వెళ్ళండి.

పా: హరి భగవంతుడా! ఇదక్కడి లోకంరా? (వెడుతుంది)

కం: మీ సంభాషణ నాకేం బోధపడలేదు. మీ యిద్దరికీ ఏవో రహస్యాలు ఉన్నట్టున్నాయనీ, ఒకళ్ళంటే ఒకళ్లు భయపడతారనీ తోస్తోంది. పాపం, ఆముసిల్ది ఎంత తెల్లబోయిందీ?

ల: నేరస్థు లెప్పుడూ అంతేలే!

కం: పాత ముంగల్ని గురించేమిటీ, అన్నావ్?

ల: అదంతా ఓ పెద్దకథలే! సావకాశంగా చెబుతా. కానేపు విశ్రాంతి తీసుకుందాం. నువ్వు చాలా అలసిపోయావు. ముందు గదిలో పడుకో! నేను అవసరమైతే లేపుతా.

ఈ రాత్రికి నేనుంటా! పాపం, నీవు ఈ యేడురాత్రులూ కంటిమీదికి కునుకే లేదు.

ల: నా కది అలవాటేలే. భరవాలేదు. నువు వెళ్ళి నిద్రపో.

కం: నీ యిష్టం, మరి. డాక్టర్ నన్నేం అనరుకదా!

ల: మరేం భయంలేదు; నే చూస్తాగా! నమస్తే.

కం: గుడ్ నైట్.

[వెడుతుంది. లలిత రోగిని చూసి నిట్టూర్చి, దీపం తగ్గించి, సోఫామీద నడుం వాలుస్తుంది.]

అంకం 2. రంగం 2.

అదేగది.

కాలం - ఉదయం.

[రామనాథం పక్కలో మెదుల్తాడు. లలిత అతన్ని చూస్తో నుంచుని ఉంటుంది.]

రామనాథం: ఆ! ఏమిటి! - నే నెక్కడున్నాను? - చంద్రా, చంద్రా!

లలిత: ఇంకా - ఆవిడ్ని గురించే!

రా: (కళ్ళు తెరిచి, లలితను చూసి) ఎవరు నీవు? నే నెక్కడున్నాను?

ల: మీరు...మీ యింట్లో నే...మీ పక్కమీదే ఉన్నారండీ.

రా: కాదు - నిజంకాదు - నీ వెవరు?

ల: నేను - నేను నర్సును.

రా: ఏమిటీ? నేను జ్వరపడ్డానా? ఎన్నాళ్లి నుండి?

ల: మీ కంతా చెబుతా. డాక్టర్‌గారు మీరు మాట్లాడ్డం మంచిది కాదన్నారు. నిశ్శబ్దంగా వుండి, విశ్రాంతి తీసుకోండి.

రా: నాకు దాహ మేస్తోంది. కాసిని మంచినీళ్లు.

ల: నీళ్ళుకాదు - మంచి వేడి కాఫీ, రెండునిమిషాల్లో తెస్తా. కొంచెం కళ్ళు మూసుకుని విశ్రమించడానికి యత్నించండి.

రా: సరే; తీసుకురా.

(కళ్లు మూసుకుంటాడు; లలిత కాఫీతో వస్తుంది)

రా: కాఫీ తెచ్చావా? (లేవబోతాడు)

ల: వద్దు—మీరు కూచోకూడదు. మీరు చాలా నీరసించివున్నారు! కాఫీ స్పూనుతో నేనే తాగిస్తాను.

(చెంచాతో కాఫీతాగిస్తుంది)

రా: నాకు నిమ్మళంగానే వుంది. కాఫీ కూడా చాలా బాగుంది. నువ్వే చేశావా?

ల: అవునండీ!

రా: నేను కొన్ని యుగాలు కూచో వచ్చా?

ల: ప్రయత్నించకండి. దానివల్ల మీకు హాని కలుగుతుంది. ప్రయత్నించి నిద్రపొండి.

రా: ప్చ్! వీల్లేదు. ప్రయత్నించలేను.

ఒక పెద్దమనిషి ఒకనాడు సాయంత్రం షికారు వెళ్ళి వస్తూ ఒకచోట ఒక ముసలివానిని చూశాడు. అతడు తన కున్న కొద్దిపాటి తట్టా బుట్టా పెట్టుకొని రోడ్డు ప్రక్కన కూర్చున్నాడు. ఇల్లూ వాకిలీ లేని బీదవాడేమోనని ఆ పెద్ద మనిషికి జాలివేసింది. జేబులో నుండి ఒక రూపాయి తీసి యిచ్చాడు.

"మొన్నటి గాలివానకు ఇల్లుపోయింది కాబోలుపాపం!" అన్నాడు.

ఆ ముసలివాడు రూపాయి తీసుకొని సంతోషంగా సమాధానం చెప్పాడు.

"లేదు బాబూ! అదుగో ఆపక్కన కనిపించేది మా గుడిసేనండి. మా ముసలిదానికి మధ్య మధ్య తిక్క వచ్చినప్పుడెల్లా పేడ తెచ్చి లోన అలుకుతుంటుంది. అది ఆరిందాకా నేను ఈ తట్టా బుట్టా పెట్టుకొని ఈడ కూకుంటాను బాబూ!"

—ఎంతో కాలం నిద్రించానని పిస్తోంది.

ల: కొంచెం కళ్లు మూసుకోండి. నిద్ర అదే వొస్తుంది. మీ రింకా బలహీనంగానే వున్నారు.

రా: అలాగా.

ల: ప్రశాంతంగా విశ్రమించడానికి ప్రయత్నించండి. కొన్ని రోజుల్లో పూర్తా రోగ్యవంతు లవుతారు.

రా: కొన్ని రోజుల్లో!

ల: అదుగో. మాట్లాడడానికి మొదలెడుతున్నారూ.

(అతను నిద్రించ జూస్తాడు. ఆమె సోఫామీద కూచుంటుంది. కొన్ని నిమిషాల్లో అతను ప్రక్కకు తిరిగి కళ్లు తెరుస్తాడు.)

రా: చంద్రా! చంద్రా!

ల: భగవంతుడా!

రా: నర్స్! నీ పేరేమిటి? నా చంద్రావతి నెరుగుదువా? ఎక్కడుంది?

ల: ఆవిడ - ఆవిడ బయటి కెక్కడికో వెళ్ళిపోయింది. - వెళ్ళిపోయిందనుకుంటా

రా: ఎక్కడికో వెళ్ళిపోయిందా? ఎక్కడికి? ఎప్పుడు తిరిగొస్తుంది?

ల: ఏమో! నే చెప్పలేను - చెప్పడం కష్టం - కనుక్కుంటాను.

రా: మన మెక్కడున్నాం? చంద్రా ఇంట్లో వున్నట్టు జ్ఞాపకం.

ల: అవునండి - నాకూ అలాగే తెల్సింది. మీరు రోగగ్రస్తులయ్యారు. ఆవిడ పనిమనిషి తెచ్చిన మందేదో తాగారు-దానితో జబ్బు పడ్డారు - అక్కడ మిమ్మల్ని చూసే వాళ్ళెవరూ లేరు - ఆదుకునే వాళ్ళు లేరు. డాక్టర్ నాయుడు గారికి తెల్సి మిమ్మల్నిక్కడికి తెచ్చారు. ఇంతవరకూ ఈమాత్రం నయమైంది.

రా: ఓ, అదా! ఆ మందా?—కాని—చంద్రా ఎప్పుడొస్తుంది?

ల: ఆవి డెక్కడుందో తెల్సుకుంటాను. మీరు విశ్రాంతి తీసుకోండి. లేకపోతే డాక్టర్ గారు మిమ్మల్ని మాట్లాడనిచ్చినందుకు నన్ను నిందిస్తారు. నా వుద్యోగం వూడిపోతుంది.

రా: పోనులే—నువ్వు చాలా మంచి దానిలా వున్నావు—నాకు నిద్రొస్తుందేమో చూస్తా. జబ్బు తగ్గితే నే నయమేమా ననిపిస్తోంది.

(నిద్రపోడానికి యత్నిస్తుంటాడు.)

అంకం 3. రంగం 1.

అదే గది

వేళ—సాయంత్రం

(రామునాథం పడక కుర్చీలో; లలిత మందు కలుపుతూంటుంది)

ల: ఈ మందు తీసుకోండి.

రా: అబ్బ! మందులు తాగి, తాగి మనస్సు కూడా విసిగిపోతోంది. దీని కంతం ఎప్పుడు? అప్పుడే రెండు వారాలైంది.

ల: ఆ విషయం, బహుశా, మీకు డాక్టర్ గారు చెప్పగలరు.

రా: ఈ గదికి అంటి పెట్టుకొని వుండడమే పెద్ద జబ్బుగా వుంది, నాకు.

ల: ఇదే మిమ్మల్ని బాధపరుస్తోందండీ.

రా: నాకు తెలీదు—నిజమే ననుకుంటాను. కాని చంద్ర ఎక్కడ? ఆవిడ్ని గురించి కనుక్కొని చెబుతానన్నావు గా?

ల: ఆవిడ మీ భార్య కాదని విన్నాను.

రా: నా భార్య! నా భార్యను నే నెరగను. నాకు లెక్కే లేదు. నా ఆత్మకు, చంద్రాకూ వివాహమైంది. అదే నా ఏకైక పత్నీరత్నం. నేను చంద్రాని ప్రేమించాను. నువ్వు చెప్పకపోతే రేపు నేనే వెళ్లి కనుక్కుంటా. డాక్టరుగారూ, నువ్వూ, నాటకమాడుతున్నట్టున్నారు.

ల: నాటకాలాడ్డానికి నాకూ చాలా దూరమని గమనించాలి మీరు. మీకోసం నేను ఎంతగా బాధపడుతున్నానో దేవుడికే తెల్సు.

రా: నాకూ తెల్సు! నేనూ చూస్తున్నాను గా. చంద్రానిగురించి అడిగినప్పుడు, పొడుస్తున్న నీ కళ్ళు నీళ్లతో నిండాయి. నేనూ చూశాను. అప్పుడే అడుగుదా మను

★ నోచుకున్న భార్య ★

గాన్నాను. కాని ప్రశ్నించలేకపోయాను. ఇక్కడికి రానిక్రితం వన్నెరుగుదువా?

ల: కొంత తెల్సునండి.

రా: ఐతే, మరి, నాకోసం అంతగా బాధపడుతున్నావెందుకు?

ల: నాకు తప్పదు - అంటే... నా స్వభావం అంతే!

రా: నాకు ఇప్పుడు గుర్తుకొస్తోంది - నా చంద్రా నాకోసం ఎప్పుడూ కన్నీరు కార్చలేదు.

ల: ఎప్పుడూ కంట తడిపెట్టి వుండదు - నా నమ్మకమూ అంతే! కాని తరుచు జబ్బుకోసం ఏడ్చి వుండవచ్చు.

రా: ఆవిడ్ని గురించి అలా మాట్లాడవద్దు - నాకు కోపం వస్తుంది - చంద్రా నా ప్రేయసి. నన్ను ప్రేమించిందని నమ్మకా.

ల: బహుశా, ఆవిడ ప్రత్యేకమైన పద్ధతిలో ప్రేమించి వుంటుంది - కాని, నేనెందుకనాలి లెండి.

రా: కాని, నేనడిగేదేమిటంటే, నామీద ఇంత ఆసక్తి ఎందుకని? నువ్వు ఎన్నెంతో దయతో, మంచిగా చూస్తావెందుకు?

ల: అది నా విధి!

రా: నువ్వెంతకాలంనుండి నర్సుగా పని చేస్తున్నావు.

ల: కొన్నాళ్ళనుండే!

(డాక్టర్ నాయుడు వస్తారు)

డా: హలో, రామనాథం! నువ్వు ఆరోగ్యవంతుడవైనందుకు సంతోషంగా వుంది. కాని సిగ్గుపడుతున్నావేం? ఏమిటి?- నర్సుని ప్రేమిస్తున్నావేమిటి, కొంపతీసి?

ల: నర్సులకికూడా ఆత్మాభిమానం వుంది, డాక్టరుగారూ! - ఇలా వేళాకోళం చెయ్యడం భావ్యంకాదు.

రా: కాదమ్మా! డాక్టరుగారేమీ చెడు తలుపుతో అనలేదనుకుంటాను. ఏమండీ డాక్టర్ సాబ్.

డా: అబ్బే! అలాంటిదేమీ లేదు. నాకు చెడ్డ ఆలోచనలుండడం అసంభవమే.

రా: డాక్టర్ సాబ్! నేనింకా ఈ గదిలో ఎన్నాళ్లు నిర్బంధంలో వుండాలి?

డా: మీరు- బాహ్యప్రపంచాన్ని మర్చే వరకు - ఇలాగే వుంచాలనుకుంటున్నాను - ఇలా వుండకపోడం మీ కెంత విపత్తును తెచ్చిందో, చూడండి! మీరు మృత్యుద్వారాన్ని తట్టారు. నేను మిమ్మల్ని మీ యింటికి తెచ్చి పునర్జీవితుని గా చెయ్యగలిగాను—అంతే!

రా: చాలా కృతజ్ఞుణ్ని డాక్టర్ గారూ. పోనీ... సాయంత్రం కారులో కొంచెం షికారుగా పోకూడదా?

డా: ఈవిడ్ని కూడా తీసుకువెళ్ళగలిగితే—సరే! ఇంకా కొన్నాళ్లబాటు, ఈ నర్సు మీతో తప్పకండా వుండాలి.

రా: ఆవిడ నాతో రాడాని కిష్టపడితే, నాకూ సంతోషమే. నేనంటే ఎంతో దయ జూపింది. నాకు జీవితంలో మొట్ట మొదటిసారిగా భగవంతుడ్ని గుర్తుకు తెచ్చింది. ఆవిడ కంఠస్వరం విన్నప్పుడల్లా భావి జీవితాన్ని అతిపవిత్రంగా గడపాలని పిస్తుంది.

డా: ఆవిడమీద మీకింత ఆసక్తి కలిగిందని తెల్సుకోడానికి సంతోషంగా వుంది.

రా: ఆసక్తా? ఎంత ఎక్కువగా నంటే, ఆవిడే సపర్య చేసేటట్టయితే, ఆజన్మాంతం రోగిగానే వుండామా అనిపిస్తోంది.

డా: అందులో ఆశ్చర్యమేమీ లేదు— మీకింకా ఆవిడ్ని గురించి బాగా తెలీలేదు.

ల: డాక్టర్! ఆయన మందులూ, మాత్రలూ మింగడానికి అభ్యంతర పెడుతున్నారు.

రా: లేదండీ... కాని రోజుకి ఆరుసార్లు తాగాలంటే విసుగ్గా వుంది.

డా: తాగాలయ్యా, తాగాలి!—నీకు పూర్తి ఆరోగ్యం అబ్బేవరకూ తప్పదు.

రా: తప్పదంటే మరి తప్పుతుందా?

డా: ఎంత అణకువ వొచ్చింది. అనుభవానికి గొప్ప జబ్బును మించినదేదీ లేదు. సెలవు; వెళ్లొస్తా.

రా: సెలవ్, డాక్టర్.

డా: సెలవమ్మా మిస్. పార్సన్స్. రోగిమీద ఓ కన్నుంచు. కాని నీ కళ్లేలా వున్నాయి? కళ్లజోడు తీసినట్టు నేను గుర్తించనేలేదే?

ల: వాటి అవసరం లేదని మానేశానండీ!

డా: ఇంకొంతకాలం వాడితేనే బాగుం డేదనుకుంటా.

ల: ఇప్పుడు బాగానే వుంది, సార్. వాటివల్ల బాధే కాని వేరే ప్రయోజనం లేదు. అదీగాక ఈయన అస్తమానూ అవి ఇవి చదివమంటుంటారు కూడా!

రా: ఆవిడ కళ్లకేదో జబ్బుందని నే ననుకోలేదు. ఇంత అందమైన నేత్రాల్ని నల్లకళ్లజోళ్లతో బాధపెట్టడం అన్యాయమే. - చాలా అందమైన కళ్ళు! నిజంగా తన చూపులతోనే నా జ్వరాన్ని నయంచేసిందేమో ననిపిస్తోంది.

నాకేసి తీక్ష్ణంగా చూస్తుంది. నాలో ఏదో నూతన చైతన్యం వొస్తుంది. 'మీ జబ్బు నయమైంది' అంటుంది. నాకూ నిజమే ననిపిస్తుంది.

> "గత రాత్రే మొదటి సారిగా వంటచేశాను. నేను చదివిన పాకశాస్త్రం నాకు భలేగా ఉపయోగించిందిలే."
>
> "ఎలా?"
>
> "మా ఆయన పొద్దున్నే లేచి వంటవాడిని ఎవడినైనా పట్టుకు వచ్చేటందుకు బయలుదేరి వెళ్లారు."

డా: చాలా బాగుంది! ఇంక డాక్టర్ అనవసరమే నన్నమాట! నీ యత్నంలో సఫలవు కావాలని కోరుతున్నా, మిస్, మేరీ పార్సన్స్, నమస్తే.

రా: }
ల: } నమస్తే.

అంకం 3. రంగం 2.

ఆ ఇంట్లోనే డ్రాయింగ్ గది.
వేళ - రాత్రి.

(రామనాథం కుర్చీలో కూచుని పేపరు చదువుతో వుంటాడు; లలిత ప్రవేశిస్తుంది.)

ల: మీ రంతసేపు అలా చదవడం మంచిది కాదనిపిస్తోందండి. నీరసం ఎక్కువవుతుంది. చాలా కష్టమైనపని, చదవడం.

రా: నేను ఆరోగ్యంగానే వున్నాను, ఫరవా లేదు.

ల: డాక్టరుగారు కూడా ఆమాటే అనుకుంటున్నారు. అందుకని రేపటినుంచి ఇక్కడ ఉండనక్కర్లేదన్నారు. అది అనవసరమని ఆయన అభిప్రాయం.

రా: అబ్బే! అదెలా కుదురుతుంది. ఆయన కేం తెల్సు - నాకు స్వస్థత చేకూరనే లేదు. అదిగాక ఈ ఇంట్లో నాకు సపర్య చేసేందుకు సమర్థులెవరూ లేరు కూడాను.

ల: ఎల్లకాలం అది నాకుమాత్రం వీలుపడుతుందా?

రా: ఏం? - ఎందుకు వీలుపడదు? జీవితాంతం రోగగ్రస్తులైనవారు లేరూ?

ల: దేవుడి పుణ్యమా అని మీరు అలాంటి రోగులు కాకుందురు గాక!

రా: పోనీ, ఓ పక్షం రోజులన్నా ఉండలేవూ?

ల: ఉండగలను - కాని....

రా: కాని—...ఏమిటే, కానియ్యి.

ల: కాని... నాకు స్వంతపనులు కొన్ని ఉన్నాయండీ!

రా: నీకు పెళ్ళికావట్టుందేం? అవునా?

ల: అవలేదనే అనాలి.

రా: ఎంత వింత సమాధానం! నీకే సంతోషంగా వుందా?

ల: సందేహం లేదనుకోండి - నేను వేరే ఆలోచిస్తున్నాను.

రా: నువ్వు దేన్నిగురించో తీవ్రంగా ఆలోచిస్తున్నట్టే వున్నావు - దేన్ని గురించో అడగవొచ్చా.

ల: ప్రతీ స్త్రీకీ కొన్ని రహస్యాలు ఉంటాయండీ.

రా: ఐతే క్షమించా - నేను నిన్ను గురించి, బహుశా, ఆ రూల్‌కి మినహాయింపువైవుంటావని అనుకొని వుంటాను.

ల: ఏ విషంగానూ కాను.

రా: నీ పేరేమిటి? డాక్టర్ ఎదో వింత పేరుతో పిల్చారే?

ల: నా తండ్రి పేరు ఫొర్స్యాత్. నేను మిస్. ఫొర్స్యాత్. మేరీ అని పిలుస్తారు.

రా: మిస్ఫొర్స్యాతా? ప్చ్. ఎంత చెడ్డ పేరు. - నాకు నచ్చలేదు. క్షమిస్తే... నువ్వు పేరు మార్చుకోవాల్సిందని సలహా ఇస్తాను.

ల: నా భర్త వొచ్చాక ఎలాగా మార్చుకోవాలి.

రా: అదెప్పుడు? త్వరలో నేనా?

ల: అలాగే ఆశిస్తున్నానండీ!

రా: నీ పెళ్ళికి నన్ను పిలుస్తావా?

ల: వచ్చేంత దయుంటే పిలవకేం?

రా: తప్పకుండా వొస్తాను. కాని - నీ భర్త ఎవరు? నే నెరుగుదునేమో?

ల: నాకు తెలీదు; మీకూ పరిచయం ఉండవచ్చు. ఆయన్ని గురించి మీకు త్వరలోనే పూర్తిగా తెలియగలదని ఆశిస్తున్నా!

రా: అతని పేరు?

ల: అంతా శుభసమయంలోనే చెప్పేది.- మీకు పరిచయం చేసేవరకూ ఆగండి.

రా: ఎప్పుడు చేస్తావ్?

ల: మీ రాశిం చేరానికన్న ముందుగా నే.

రా: అతనంటే ఈర్ష్య కలుగుతోంది, నాకు.

ల: ఎందుకని?

రా: నువ్వంత తెలివైనదానివి; సుకుమారివి; నాగరీకురాలివి; ప్రేమైక జీవివి— మంచిదానివిని.

ల: స్తోత్రాలతో తలమునకలు చేస్తున్నారు

రా: నన్ను నమ్ము. నేనేం పొగడటం లే. నే అనే ప్రతీ మాటా నా హృదయాంతరాళాలనుండి ఉబికివస్తున్నదే.

ల: భార్యల చాటున పరస్త్రీలని పురుషులిలాగే పొగుడుతారు.

రా: అదివున్నా అంతే! నేను భార్యంటే భయపడను.

ల: ఆవిడా తెలివైనదీ, నాగరీకురాలూ అయితే?

రా: నాకు తెలీదు. అలాంటి దశ లేదు.

ల: మీరంతా మోసంగా మాట్లాడుతున్నారు. మీ భార్యనిగురించి ఆమాత్రం తెలీదంటే నమ్మదేలా?

రా: నిజంగా! నాకు తెలీదు.

ల: మీ మగవాళ్లంత క్రూరులండీ— ఎంత కఠినహృదయులు! ఎంత మోసగాళ్లు!

రా: నేను ఆమె నెప్పుడూ ప్రేమించలేదు—వాళ్లే బలవంతపు పెళ్ళి జరిపించారు. నేను దాన్ని లెక్క చెయ్యలేదు— చూడలేదు కూడా!

ల: ఆవిడా తెలివైనదీ, సుకుమారీ, నాగరీకురాలూ, ప్రేమైకజీవి, మంచిది అయితే?

రా: నాకు తెలీదు.

ల: మీరు తెల్సుకోవాలి! అవసరమనుకోరూ?

రా: నే నెప్పుడూ ఆసంగతి ఆలోచించలేదు.

ల: దేవుడు మిమ్మల్ని మన్నించాలని కోరుతున్నా.

రా: ఈ పదిహేను రోజులూ, నువ్వు దేవుడ్ని ప్రార్థిస్తున్నది చూడనిక్రితం— నాకు దేవుడిలో నమ్మకమే లేదు. నిన్ను చూసిన ప్రతీసారీ, దేవుడ్ని నాకోసమే ప్రార్థిస్తున్నావనిపించేది నా ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ. ఇకనుంచి పవిత్రమైన, గొప్ప జీవితాన్ని గడపాలని నిర్ణయించుకొన్నా.

ల: అలాగా! సంతోషమైన విషయమే. మీరు మృత్యుముఖంనుండి యముని పాశాలనుంచి రక్షింపబడ్డారు.

రా: అంతా నీవల్లనే!

ల: దేవుడి దయవల్ల!

రా: నువ్వు నాతో ఉన్నట్టయితే— పవిత్రమైన జీవితాన్ని గడపగలనేమో ననిపిస్తోంది నాకు. గతాన్ని విస్మరించి, జీవితాన్ని తిరిగి ప్రారంభించాలని వుంది.

ల: ఏమిటీ? ను నేఅంగీకరిస్తేనా?...... మీరు... నాకేం బహుమతీ ఇస్తారు?

రా: ఏదైనా సరే!

ల: తప్పకుండా?

రా: ముమ్మాటికీ!

ల: మీ భార్యని స్వీకరించి ఆవిడతో జీవిస్తారా?

రా: ఆఁ!...ప్రయత్నిస్తాను.

ల: ప్రతిజ్ఞ చెయ్యండి.

రా: వొట్టుగా.

ల: పోయి, ఆవిడ్ని తీసుకురానా?

రా: ఈ ఇంట్లోనే వుందా?

ల: ఇక్కడే!

రా: సరే!

ల: ఐదునిమిషాల్లో తిరిగొస్తా.

(లలిత వెడుతుంది. రామనాథం పచారీ చేస్తుంటాడు.)

రా: అంతా వింతగా వుంది - ఏమని అంగీకరించాను? ఆవిడ కళ్లే అలా చేయించాయి. నేను వనుకాడలేకపోయాను. ఇదంతా ఎలా ముగుస్తుందో?

(లలిత చీరకట్టుకుని వొస్తుంది)

ఎవరిది? నేను చూస్తున్నది, ఎవరూ?

ల: మీ పూర్వపు నర్సు! మీ యథార్థ ప్రియపత్ని - మీ లలితని!

రా: ఇది నిజమా? కలా?

ల: కలకాదు - వాస్తవం.

రా: ఓరి దేవుడా! నన్ను క్షమించగలవా?

ల: దేవుడు మిమ్మల్ని క్షమించే తిరిగి ఆరోగ్యవంతులుగా చేశాడు; మిమ్మల్ని ఆశీర్వదించాడు కూడా!

రా: అదంతా నీకోసమే లలితా! పూర్వజన్మలో ఎన్నో నోములు నోచుకున్న భార్యవైన నీకోసమే లలితా!

(దగ్గరకు తీసుకుంటుంటే - తెర)

★

★ చిన్నమనుష్యులు - పెద్దసమస్యలు ★

(21-వ పేజీ తరువాయి)

చావుకి తను బాధ్యుడని కొడుకు ఉద్దేశం అయియుంటుంది.

మెల్లగా మంచం దిగి వీధి గేటు దగ్గరకు వెళ్ళి రోడ్డువైపు చూశాడు తను. రోడ్డుమీద నడిచే ప్రతీ ఒక్కరూ ఈ ఉదంతంగురించే మాట్లాడుకుంటున్నారు, రకరకాలుగా వ్యాఖ్యానిస్తున్నారు. భార్యనడిగి చేతికర్ర తీసుకుని అలా సందుమొగదాకా నడిచాడు. అక్కడో పదిమంది గుంపుగా చేరి ఈ విషయమే మాట్లాడుకుంటున్నారు. ఒకళ్ళు వేసిన ప్రశ్నకి సమాధానంగా మరొకడు "ఆకలి చావండీ! తిండిలేక ఆకలిబాధ భరించలేక ఈపని చేస్తున్నానని రాసిపెట్టి మరీ చనిపోయాడు. పేరు గోపాలరావుట!" అని చెప్పాడు.

"ఆకలి చావు!" చెవులు గింగురుమన్నాయి తనకి. చరచరా వెనక్కి తిరిగి ఇంటికి వచ్చేశాడు. అయితే రెండురోజుల్నించీ తిండిలేదని అతను చెప్పింది నిజమే అన్నమాట. కొడుకు చెప్పిన నీతులు చెవుల్లో మారుమ్రోగుతున్నాయి! అవును నిజం! తనూ ఈ చావుకి కొంతబాధ్యుడే! కళ్ళు చెమ్మగిల్లాయి. ఎదురుకుండా భార్యా వస్తుంటే కన్నీరు ఆమె గమనిస్తుందేమోఅని ముఖం తిప్పుకుని పడగ్గదిలోకి వెళ్ళిపోయాడు. ఎంత అరికట్టుదామని ప్రయత్నించినా ఆలోచనా ప్రవాహం ఆగటంలేదు. గదిలో అటూ ఇటూ అలంగం తిరిగాడు. గాలికి కిటికీ రెక్కలు టపటపా కొట్టుకొంటుంటే తన హృదయంమీద ఎవరో బలంగా మొత్తుతున్నట్టుగా ఫీలవుతున్నాడు. గబగబావెళ్ళి కిటికీ రెక్కలు మూసేశాడు. కిటికీ పైభాగంనించిచూస్తే దూరంగా 'లెవెల్ క్రాసింగ్ గేట్' కనిపిస్తోంది. జనంమటుగలేరు. తునాతునలై మొండానికి మొండెం, తలకి తలా చెల్లాచెదరై విసిరిపారేసినట్టుగా దూరదూరంగా పడి నెత్తురులో తడిసిన ఆ ఖండాలు కంటిముందు తిరుగుతున్నాయి. "ఓరూపాయి ఉంటే ఇస్తారూ నిన్న ఉదయం అనగా భోంచేశాను." అని గోపాలరావు దీనంగా వేడుకుంటున్నాడు! ఈ చావుకి నువ్వే బాధ్యుడివి అంటున్నాడు కొడుకు! మనసులో ఈ మాటలు గిరగిరా తిరిగిపోతున్నాయి. కడుపంతా రెండుచేతుల్తోనూ దేవినట్టుగా బాధపడుతున్నాడు తను.

భార్య వచ్చి అన్నానికి లేవమంది. "ఆకలి లేదు." అందామనుకున్నాడు గాని ఎందుకని భార్య ప్రశ్నిస్తే ఏమని జవాబు చెప్పగలడు? ఆమె నేవిధంగా సంతృప్తి పరచగలడు? కంచం ముందుకు వెళ్ళి కూర్చున్నాడు. కొడుకు అప్పటికే భోజనం చాలావరకూ పూర్తిచేశాడు. తనూ నాలుగు మెతుకులు కతికి అయిందీ అనిపించాడు. కడుపు నిండుగాఉంది. నేరుగా మళ్ళీ గదిలోకి వెళ్ళిపోయాడు.

సాయంత్రం వరకూ ఇవే ఆలోచనలు! టేబిల్ మీద పత్రిక తిరగవేసి కథ చదవటం మొదలు పెట్టారు. మనశ్శాంతికోసం పుస్తకం తెరుస్తే ఆ కథలో ప్రయోజనం తనమీదే దాడిచేసింది. పుస్తకం మూసేశాడు చిరాగ్గా. ఈ చావుకీ తనకీ ఏమాత్రం సంబంధంలేదని ఎంత సమర్థించుకుందామనుకున్నా ఉండీ ఉండీ ఆ భీభత్స దృశ్యాలు కంటిముందు మెదిలి మనసంతా పాడుచేస్తున్నాయి. వాటిన్నించి తప్పించుకోవటం సాధ్యం కాకుండాఉంది. చల్లగాలికోసం వీధి వరండాలో పడకకుర్చీ వేయించుకుని కూర్చున్నాడు. ఇంకా చీకటి పడలేదు. పక్కనేఉన్న కుర్చీవైపు చూశాడు. ఆ కుర్చీలో గోపాలరావు కూర్చున్నట్టే మాట్లాడుతున్నట్టే అనిపించి కళ్ళు గట్టిగా మూసేసాడు. ఈ వేళకే నిన్న అతనూ తనూ ఇక్కడే సమావేశమయారు. ఈ ఉదయం అతను చనిపోయాడు. ఎటువంటి చావు? ఆ...త్మ...హ...త్య!" వెనక్కి చారబడి కళ్ళుమూసుకుని ఏ ఆలోచనా లేకుండా గడపాలని ప్రయత్నించాడు. కాని లాభం లేకపోయింది. పెరట్లో ఉన్న భార్యని రమ్మని ఏదైనా మంచి పుస్తకం చదివి వినిపించమన్నాడు. అతని కిష్టమైన పిల్లలకథలు చదివి వినిపించింది భార్య. కొద్దిసేపు పోయింతర్వాత "మీరు వినటం లేదు" అంది ఆమె.

"ఆఁ! ఆఁ!" అంటూ నాన్చేశాడు తను.

"బాబూ! ఓ కాని ధర్మం చెయ్యండి బాబూ!" ఈ కంఠం విని తలెత్తిచూశాడు. బిచ్చగాడు! వాడ్ని చూడగానే మెరుపు మెరిసినట్టుగా ఓ ఆలోచన పుట్టుకొచ్చింది. వాడ్ని లోపలికి రమ్మని పిలిచాడు. వచ్చింతర్వాత "నువ్వెన్నాళ్ళయింది భోంచేసి?" అని ప్రశ్నించాడు.

"నిన్న ఉదయం అనగా తిన్నాను బాబూ! ఇంతవరకూ జోలిలో ఒక్క గింజ కూడా రాలలేదు. కడుపు మండిపోతోంది." అన్నాడు ముసలి గొంతుతో. ఆ కంఠం వింటుంటే ఏదో ఉప్పెనలా ఆవేశం ముంచుకొచ్చింది. భార్యవైపు తిరిగి "వాడికి కడుపునిండా అన్నం పెట్టు" అన్నాడు వీధిగదిలో కొడుక్కి వినిపించేలా. భార్య లేచివెళ్ళి విస్తరాకునిండా అన్నం పెట్టి తీసుకొచ్చి బిచ్చగాడికి పెట్టింది. వాడు కడుపునిండా భోజనంచేసి తృప్తిగా త్రేణ్చి, నవ్వుతూ "మీ మేలు ఈజన్మలో మర్చిపోలేను దొరా" అంటూ వెళ్ళబోతుంటే 'ఈ రూపాయి తీసుకో' అని జేబులోంచి రూపాయితీసి వాడి చేతిలో పడేశాడు. బిచ్చగాడు నివ్వెరపోయి తనవైపు చూశాడు. ముఖంలో ఏ భావమూ లేదు. బహుశ వాడి జీవితంలో ఇటువంటి రోజు చూసిఉండడు. బిచ్చగాడి ముఖంలో గోపాలరావు ముఖం లీలగా గోచరించింది. వాడు చాపిన చేతులు గోపాలరావు చేతుల్లాగా కనిపిస్తున్నాయి. అంతా భ్రాంతి! కాని... కాని...వీడూ అలాగే ఎప్పుడో ఒకప్పుడు రైలుక్రింద..." ఆపైన ఊహించలేకపోయాడు.

బిచ్చగాడు దీవనలు దీవిస్తూ వెళ్ళిపోయాడు. తను కొడుకు గది గుమ్మంవైపు చూశాడు. తను ఆశించినట్టుగా కొడుకు అక్కడ కనిపించలేదు. కొంత నిరాశపడ్డా తను చేసిన ధర్మం కొడుక్కి తెలియకుండా ఉంటుందా అని ఆశగా అనుకున్నాడు తను. ఆ రాత్రి కడుపునిండా అన్నం తినాలనిపించింది. విస్తరిముందు కూర్చుని భోజనం చేస్తున్నంత సేపూ ఏదో చెప్పాలని ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కాని నోరు మెదపలేకపోతున్నాడు. చివరికి లేచిపోబోతుంటే కొడుకే అన్నాడు. "ఈ సాయంత్రం మీరు చేసిన మంచిపని నన్ను చాలా సంతోషపరిచింది. చాలా గర్వంగాను కూడా" అని.

ఈ ప్రశంసతో గాలికొట్టిన బంతిలా అయిపోయాడు తను. ముఖం ఆనందంతో వికసించింది నవ్వుతూ జవాబు చెప్పాడు. "నాకూ చాలా తృప్తిగా ఉంది." అని.

తండ్రీ కొడుకూ ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకుని హృదయం విప్పి నవ్వుకున్నారు.


కొడుకు భుజంమీద చెయ్యివేసి "రేపట్నించి సెలవు పెట్టేస్తున్నాను. ఆతర్వాత 'రిటైర్' అయిపోతాను. నీ కిష్టమేనా?"

"చాలా సంతోషం! అలాగే సెలవు పెట్టండి"అన్నాడు కొడుకు. భార్యవింతగా ఇద్దరు ముఖాలూ చూస్తూ నిలబడింది.

"మరోపనికూడా చెయ్యాలనుకుంటున్నాను. ప్రతిరోజూ ఓ బిచ్చగాడికి కడుపునిండా అన్నం పెట్టిద్దామనుకుంటున్నాను." - నోరు ఆవులించి తండ్రివైపు వింతగా చూస్తుండిపోయాడు కొడుకు. అతని కళ్లనించి రెండు కన్నీటి ముక్కలు చెంపలమీదుగా జారి విస్తరాకు మీద పడ్డాయి.

"తను తిని ఇంకొకరికి పెట్టగలిగిన శక్తిగల ప్రతివాడూ ఓ పూట ఒక పేదవాడికి అన్నం పెట్టకూడదూ?" - కొడుకు తడిసిన కంటిరెప్పల్ని తుడుచుకుంటూ లేచి నిలబడ్డాడు.

ఇద్దరూ పెరటివైపుకి నడిచారు. ★



కాళిదాసు: ఋతుసంహారము

నండూరి రామమోహనరావు

[illegible]కుల గురుడగు
కాళిదాస కవి
ప్రథమగు కావ్యము
"ఋతు సంహారము"

ఎట్లు జనించెనో
[illegible]గించెద నిదె
వీనుల విందుగ
వినుడీ గేయము

* * *

[illegible]ల్లరి చేసెడి
[illegible]ల్లల మల్లె
[illegible] ఋతువు లొక
[illegible]రి కూడినవి

నేను గొప్పయని
నేనే గొప్పని
తమలో తామే
తగవులాడినవి.
[illegible]వు తీర్పుటకు
[illegible]గిన వాసికై
[illegible]న్వేషించిన
[illegible] దేశముల.
[illegible]వులకు కవియగు
కాళిదాసుడే
[illegible]ంచు కర్తుడని
[illegible] తుండనవి.

ఉజ్జయినీ నగ
రోద్యానములో,
ఊహా వీధుల
నుయ్యాల లూగుచు,
కావ్య రచనకై
కనులర మూసిన
కాళిదాస కవి
కనబడె వానికి.
ముద్దులు గులికెడి
ముగ్ధ రాండ్ర వలె,
ముచ్చట గొలిపెడి
ముస్తాబులతో
ఎదురుగ నిలిచిన
ఋతువుల నన్నిటి
నొకే సమయమున
నొకే స్థలమ్మున
గాంచిన తోడనె
కాళిదాసులో
ఉద్భవించినది
అద్భుత కవనము
అందా లొలికెడి
ఛందస్సులతో,
మృదు మధురమ్మగు
పదజాలముతో,

రమణీయార్థము
ప్రతి పాదించెడి
కవనము చెప్పెను
కాళిదాస కవి:

"పగటి సమయముల
ప్రచండ సూర్యుడు,
నిశా సమయముల
ప్రశాంత చంద్రుడు
కలిగిన చక్కని
కాలము గ్రీష్మము.
మద్దెల లట్టులు
మబ్బు లురుముగా
నృత్యము చేసెడి
నెమలి గుంపుతో
వర్షకాలమతి
హర్ష కారణము!
కొల్లగ పూచిన
తెల్లు పూలవలె
తెల్లని వెన్నెల
జల్లులు కురిసెడి
శరత్కాలమిది
సౌందర్యపుగని.
తెల్లవారు నరి
[illegible] నిల్చిన
మంచు ముత్తెముల
మాలలు దాల్చిన
సీమంతిని యీ
హేమంతర్తువు.

ఆకులు రాలిన
ప్రాకులతో, మణి
హారము లూడ్చిన
నారీమణివలె
అతి సుందరమగు
ఋతువీ శిశిరము.
కో యని కూసెడి
కోయిల కొదమల
బరాబరుల ద
ర్బారులు తీర్చిన
వనాధి దేవత
వసంత సుందరి."
ఈ తీరున వ
ర్ణించగ ఋతువులు
తగవు మానుకొని
తరలి పోయినవి.

* * *

అంతము లేని మ
హా కాలమునకు
వేరు రూపములు
ఆరు ఋతువులని
తత్త్వము నెరిగి [illegible]
విత్త్వము చెప్పిన
కాళిదాసు ఋతు[illegible]
కల్పన [illegible]



అల్లరి పిల్లలు

1. జగడాలమారి జగ్గు

కొంతమంది పిల్లలు ఎప్పుడూ ఏదోఒక విషయంమీద తక్కినవాళ్ళతో జగడాలాడుతూనే ఉంటారు జగ్గూని చూడరాదూ తెలుస్తుంది వాడికి ఒకటే పంతం ఎంతసేపూ తనమాటే నెగ్గాలి అందరూ కలిసి దాగుడుమూతలు సరదాగా ఆడుకుంటూఉంటే రను కొండి గుబులు తిరిగినట్లు, "ఈ ఆట ఆడవద్దు మనం రైలుబండి ఆట ఆడుకుందాం" అంటాడు అంతే వెంటనే తక్కినవాళ్ళందరూ ఇష్టం ఉండనీ లేకపోనీ, ఆ ఆట మానేసి రైలుబండి ఆటకి రావలసిందే లేకి పోతేనా, అబ్బ! వాడి అల్లరి ఇక ఇంత, అంత అని చెప్పటానికి వీలు లేదు. కాళ్ళు దబదబ బాదటం, ఏడవటం - ఒకటికాదు

ఒకనాడింతే అయింది ఉమ దగ్గిరికివచ్చి "అదికాదు జగ్గూ! అంటే నీకు కోపంకాని, నీ యిష్టమేతప్ప ఒక్కసారయినా మామాట వినకూడదా ఏమిటి?" అని అడిగింది. ఇంతలో ఏమైందో ఏమిటో కాని జగ్గూ కూర్చున్నవాడు లేచి కేకలు మొదలుపెట్టాడు ఏ తేలో, పామో కరిచిందనుకొని అంతా గాభరా పడిపోయినారు. జగ్గూ వాళ్ళఅమ్మ ఈగోల భరించలేక గబగబ వచ్చి "ఏమైందిరా?" అని అడిగింది "చూడమ్మా! ఉమ వేలుతో నా కన్ను పొడిచింది" అని జగ్గూ చెప్పాడు.

"చూశావా? చూశావా? నేను కన్ను పొడిచానుట! ఎప్పుడురా జగ్గూ! నేనింతదూరంలోనుంచుంటే, నిన్ను తాకనైనాలేదుకదరా!" అని బిక్కమొహంపెట్టింది ఉమ తక్కిన పిల్లలంతా పాపం చూస్తూ నిలబడి పోయినారు జగ్గూవాళ్ళఅమ్మ కోపంగా విసుగుకోవటం మొదలు పెట్టింది "ఆడుకొనేవాళ్ళు సరిగ్గా ఆడుకోకూడదూ? ఆడుకున్నంత సేపూ ఆడుకోవటం - అక్కడినించి తన్నుకోవటం కాకిగోల అయి పోయింది" అంటూ ఆమె జగ్గూ చెవిపట్టుకొని మెలేసింది. "వెధవా! వాళ్ళతో ఆడుకోవటానికి పోవద్దని ఎన్నిసార్లు చెప్పాను నీకు? బుద్ధి లేదూ! ఇంకనెప్పుడూ వాళ్ళదగ్గరికి పోవుకదా!" జగ్గూ రాగాలు తీస్తూ "పోను, పోను" అని కేకలు పెట్టాడు.

ఇదంతాచూసేసరికి తక్కిన పిల్లలకి కళ్ళవెంబడి నీళ్ళు వచ్చి నాయి గుప్‌చిప్‌గా వెళ్ళిపోయి నారు ఉమ పాపం! తనవలనకదా ఇదంతా అయిందని మరింత బాధ పడింది "ఊరుకోవే! వాడి స్వభావమే అంత! నువ్వేం చేశావేమిటి? ఎప్పుడేమిటి వాడు జగడాలు తెచ్చి తన్నులు తినకుండా ఉన్నది!" అని ఓదార్చారు తక్కినవాళ్లు.

ఇలాంటివాడు జగ్గూ అంటే అయినదానికి కానిదానికి ఇలాగా యాగీచెయ్యటం, తాను దెబ్బలు తినటం, తక్కినవాళ్ళందరికీ మాట తేవటం ఇటువంటివాడికి బుద్ధి ఎలా వస్తుంది?

ఒకసారి భలే తమాషా జరిగింది ఉగాదిపండగ ముందు జగ్గూ పిన్నిగారి ఊరు వెళ్లాడు వెళ్లే ముందు జగ్గూవాళ్ళఅమ్మ మరీ మరీ చెప్పింది - వెళ్లినచోట బుద్ధిగా ఉండమని పిన్నికి ఒక కొడుకు ఉన్నాడు వాడిపేరు మనోహరు అంతా 'మనూ' అంటారు మనూ జగ్గూకంటే ఒక ఏడాది చిన్నఅల్లరిలో మాత్రం జగ్గూని మించిన వాడు. మనూకి వేరే అన్నలు తమ్ముళ్లుగాని అక్కలు చెల్లెళ్ళు గాని లేరు అందుచేత వాడిని వాళ్ల అమ్మా, నాన్నా చాలా గారాబంగా చూస్తారు వాడు ఏమి చెప్పినా నమ్ముతారు.

జగ్గూ అక్కడికి వెళ్లినరోజున

మనూ వాడి బొమ్మసామాగ్రి అంతా చూపించాడు. వాడికి ఒక బొమ్మకారు ఉన్నది. ఆ కారు ఎక్కి కూర్చొని "నా కారు చెడిపోయిందంటూ - నువ్వేమో వెనకాలనించి కారు నెట్టు. నేను స్టార్టుచేస్తాను" అన్నాడు. జగ్గూకి పాపం! ఒకసారి ఆ కారుఎక్కి సరదాగా ఇల్లంతా తిరగాలని ఉన్నది. కాని ఏంచేస్తాడు? "సరే. నేను కొంచెంసేపు తోస్తాను. మరి ఆతరువాత నన్ను కారెక్కనిస్తావా?" అని అడిగాడు. "ముందు తొయ్యి" అన్నాడు మనూ హాయిగా కూర్చొని. జగ్గూ ఎంతసేపు నెట్టినా వాడు "కారు ఇంకా స్టార్టు కావటం లేదు. ఇంకా కొంచెంసేపు నెట్టు" అని అంటూ ఏడిపించాడు. జగ్గూకి ఉక్రోషం వచ్చింది. "నేను నెట్టను. ఏంచేస్తావో చెయ్యి" అన్నాడు. "సరేలే. అయితే ఈసారి నాకారు ముట్టుకో చెప్తాగిఁపని" అన్నాడు మనూ.

"ఏంచేస్తావేమిటి?" అని రెట్టించాడు జగ్గూ. మాటమీద మాట వచ్చి ఇద్దరూ కలియబడ్డారు.

"నేను కారు ముట్టుకుంటాను ఏంచేస్తావో చెయ్యి!" అని జగ్గూ విసురుగా కారుమీద చెయ్యివేసి నెట్టాడు. మనూకు కోపం వచ్చింది. మరి ఏడవాలంటే ఏదో వంక పెట్టుకోవాలిగా. కాలుతో కారు ఆపబోయినాడు. కాలిమీదుగా పోయింది. ఇకనేం? జగ్గూకూడా ఆశ్చర్యపోయేటట్లు ఏడుపు సాగించాడు. మనూ వాళ్లఅమ్మ పరుగెత్తుకొనివచ్చి "ఏంచేశావురా జగ్గూ. తమ్ముణ్ణి ఏంచేశావు చెప్పు." అని అడిగింది. "నేనేమీ చెయ్యలేదు పిన్నీ!" అని జగ్గూ చెప్తూ ఉండగానే మనూ అడ్డువచ్చి "ఏమీ చెయ్యలేదుట పాపం. చూడమ్మా కారు విసురుగా నా కాలిమీదుగా పోనిచ్చాడు. కాలంతా ఒకటే నొప్పి. చూడు" అంటూ మళ్లీ ఏడుపు కొనసాగించాడు: పిన్ని జగ్గూని ఏమీ అనలేక "తప్పుకాదూ? తమ్ముణ్ణి ఏడిపించవచ్చునా? కలిసి ఆడుకోవాలిగాని." అన్నది. జగ్గూకి పట్టరాని కోపం వచ్చింది. కాని ఏం చేస్తాడు. తాను చేసిందేమీ చెప్పకుండా అంతా తనమీదికి తోసేశాడు మనూ.

ఇది మొదటిరోజున జరిగింది. ఆ తరువాత నాలుగురోజులలో ఇంతకంటె పెద్దపెద్ద కొలుపులు జరిగినాయి. ప్రతీ చిన్న విషయంలోను జగ్గూకి తలవంపు తప్పలేదు. పిన్ని చివరికి అన్నది "అమ్మయ్యో! ఏమో అనుకున్నాను. నువ్వు అల్లరి పిల్లడివని విన్నానుకాని ఇంత ఆకతాయి వనుకోలేదు. తమ్ముడితో కలిసి చక్కగా ఆడుకోలేవూ? ఈ జగడాలమారితనం ఎక్కడ నేర్చుకున్నావు?"

జగ్గూకి ఏడుపు వచ్చింది. కాని తనమాట వినేదెవరు? పండగ వెళ్లిన మరునాడే గోలచేసి ఇంటికి వచ్చేశాడు. రాగానే ఉమ, తక్కిన వాళ్లు ఎదురొచ్చారు.

"మనూ ఎంత అల్లరివాడను కున్నా? ప్రతిదానికి ఏడుస్తాడు. నేనేమీ చెయ్యనిదే నామీద ఎన్నో పితూరీలు చెప్పాడు." అని చెప్పాడు జగ్గూ సావాసగాళ్లతో. ఉమ బదులుచెప్పింది. "నువ్వు మాత్రం బుద్ధిమంతుడివా ఏమిటి? మమ్మల్ని అందరిని ఎలా ఏడిపించావో ఇప్పటికైనా తెలిసి వచ్చిందా?"

ఈమాటలు విని జగ్గూ మొదట గింజుకున్నాడు. కాని ఇంటికి వెళ్ళి కమ్మగా కడుపునిండా భోజనంచేసి పడుకున్నతరువాత ఆలోచిస్తే, అప్పుడు అర్థమైంది ఉమ చెప్పిన దాంట్లో నిజం. "ఇక నెప్పుడూ అలా ఉండను నేను" అనుకున్నాడు.

అనుకోవటాని కయితే అనుకున్నాడుకాని మరి అలా ఉంటాడా లేదా అన్నదే ప్రశ్న. జగడాలమారి జగ్గూ మంచివాడవుతాడో లేదో చూద్దాం!

—ముపి..

★

అతిథిసత్కారం

రచన: సత్యమూర్తి

గోదావరీనదీతీరాన కొత్త లంక అనే ఒక చిన్నగ్రామం ఉండేది. ఆ గ్రామంలో రామన్న, శివన్న అనే యిరువురు సోదరు లుండేవారు. వారు పాపభీతికలవారు, దైవ భక్తి పరాయణులు రోజెల్లా పని చేసి వచ్చిన కూలిమీద బ్రతికేవారు. అయినప్పటికీ ఉన్నదానిలోనే ప్రతిరోజూ ఎవరికో ఒకరికి భోజనంపెట్టనిదే వారు భుజించేవారు కారు బీదవారయినా, గుణంలో గొప్పవారు కాబట్టి ఆ గ్రామస్థులు వారిని గౌరవంతో చూస్తుండేవారు

ఒకనాడు ముసురుపట్టి వర్షం కుండపోతగా కురుస్తున్నది ఆనాడు తమతో భోజనం చెయ్యటానికి ఎవరు కనిపిస్తారా అని వెతుక్కుంటూ ఆ వానలోనే ఇద్దరూ బయలుదేరారు. ఊరి పొలిమేర దగ్గర వారికి ఒక మఱ్ఱిచెట్టుక్రింద ఒక ముదుసలి గజగజ వణికిపోతూ కనిపించాడు వా రతనిని యింటికి తీసుకొనివెళ్లి పొడిబట్టలిచ్చి, సంతుష్టిగా భోజనం పెట్టారు "ఎన్ని ధనరాసులిచ్చినా, దీనికి సాటి గాదు బాబూ!" అంటూ ఆ ముదుసలి వారిని కొనియాడుతూ ఆ రాత్రికి అక్కడే పరున్నాడు.

ఆరాత్రి రామన్నకు ఒక కల వచ్చింది "రామన్నా! నీవు మీ ఊరికి తూర్పునఉన్న మఱ్ఱిచెట్టు తొఱ్ఱగుండా తూర్పుదిక్కుకే వెళ్లు. అక్కడ నీకు ఒక పాడుబడినగుడిలో ఒక బంగారుగిన్నె దొరుకుతుంది తెచ్చుకో!" అని ఎవరో చెప్పారు. శివన్నకుకూడా అలాంటి కలే వచ్చింది అయితే అతనిని ఆ చెట్టు తొఱ్ఱలో పశ్చిమంగా వెళ్లమని చెప్పారు

తెల్లవారింది ఆ ముదుసలి అతిథి "వెళ్లొస్తాను బాబూ!" అని చెప్పి వెళ్లిపోయాడు. వారిద్దరూ గొడ్డళ్లు బుజానవేసుకొని వెళ్లి మఱ్ఱి చెట్టు తొఱ్ఱవద్దకు చేరుకున్నారు. రామన్న ముందు తొఱ్ఱలో దిగి తూర్పుకు వెళ్లాడు. అలా వెళ్ళగా రామన్నకు ఒక పాడుపడిన దేవళం కనిపించింది వెతకగా వెతకగా అతనికి అక్కడ ఒక బంగారుగిన్నె దొరికింది. దాన్ని తీసుకొని రామన్న తిరుగుముఖం పట్టాడు.

రామన్న తరువాత చెట్టు తొఱ్ఱలోదూరిన శివన్న పశ్చిమాభిముఖంగా ప్రయాణం చేశాడు కొంతసేపటికి అతనికి ఒక పెద్ద సొరంగం కనిపించింది అందులో శివన్నకు ఒక వెండిగిన్నె దొరికింది. పైకివచ్చి శివన్న రామన్నను కలుసుకున్నాడు తమ తమ ప్రయాణ విశేషాలు చెప్పుకుంటూ ఇద్దరూ ఇంటికి చేరారు

ఆనాటిరాత్రి కలలో మళ్ళీ ఎవరో కనిపించి, ఆ బంగారుగిన్నె ఎందరికైనా పంచభక్ష్య పరమాన్నాలు అందిస్తుందని, వెండి గిన్నె ముచ్చటగొలిపే కథలు చెప్తుందని చెప్పారు. కష్టించి సంపాదించవలసిన పనిలేదుకనుక. ఎందరు వచ్చినా వారు పంచభక్ష్య పరమాన్నాలు పెడుతూఉండేవారు. కాని వారిద్దరూ కాయకష్టం మాత్రం మానలేదు. అలా సంపాదించినడబ్బు వారు కూడబెట్టి, ఏదయినా ధర్మకార్యం చెయ్యాలని అనుకున్నారు.

ఒకనాడు సూరన్న అనేవాడు వారియింటికి భోజనానికి వచ్చాడు. భోజనాలవద్ద ఆ గిన్నెల మాహాత్మ్యం తెలుసుకున్నాడతడు. అర్ధరాత్రివేళ లేచి సూరన్న ఆ రెండు గిన్నెలూ, ధనమూ చేతబట్టుకుని పారిపోయినాడు.

తెల్లవారి చూచేసరికి గిన్నెలు, ధనమూ కనిపించలేదు. సూరన్న దొంగతనం చేసిఉంటాడని వారు గ్రహించారు కాని విచారించలేదు. అవి ఎలా వచ్చినాయో, అలాగే పోయినాయని అనుకున్నారు. నిశ్చింతగా యథాప్రకారం కూలి డబ్బులలోనే పొట్టపోసుకుంటూ ఏ ఒక్కరికో మాత్రమే ఆతిథ్యంఇస్తూ కాలం గడపటం మొదలుపెట్టారు.

ఆ ధనాన్ని గిన్నెలని అపహరించిన సూరన్న యింటికి వెళ్ళి,మూట విప్పి చూసుకున్నాడు. ఏముంది? గిన్నెలు రెండూ మట్టిబొచ్చెలయి ఉన్నాయి. ధనమంతా చిల్లపెంకులైపోయింది. తన తప్పిదానికి చింతించి అతడు ఆ మూటపట్టుకొని తిరిగి వారి యిల్లు చేరుకున్నాడు. రామన్న శివన్న ఎప్పటిప్రేమతో వానికి స్వాగతంఇచ్చారు. సూరన్న వారి కాళ్ళపై బడి క్షమించమని కోరాడు. ఆనాటినుండి అతడుగూడ దైవభక్తుడైనాడు. తాను న్యాయంగా సంపాదించి, వచ్చిందాంట్లోనే తాను తిని మరొకరికి పెడుతుండేవాడు.

అతడు తెచ్చిన గిన్నెలు, ధనం సోదరులవద్దకి రాగానే నిజరూపం పొందినాయి. సోదరు లిరువురూ చనిపోయేముందు ఆ గిన్నెలను సూరన్నకు ఇచ్చివేశారు. వారు తమధనంతో శివాలయం, రామాలయం నిర్మించారు.

ఇప్పటికీ ఆ గ్రామంలో ఆ రెండు దేవళాలవద్ద వారు చనిపోయిన రోజున సంబరాలుజరిపి, ఆ కథ చెప్పకుంటుంటారు. ★



ట్రాఫిక్ పోలీసు —ఫొటో: సి. ఎన్. పార్థసారథి, కడప.

మాటదక్కించిన మిత్రుడు

ఈశు, వాసు ఒకే క్లాసు-ఒకే డివిజన్ కూడ వాసు ఒక మంచి డిక్షనరీ కొనుక్కున్నాడు దాన్ని చూచినప్పటినుంచి ఎలాగైనా కాజేయాలని ఈశుకు దుర్బుద్ధి పుట్టింది కాని ఎప్పుడూ వీలు దొరకలేదు

ఒకనాడు వాసు నాన్నగారు ఏదో పనిమీద ఊరికి వెళ్లారు వాసు తల్లి జయమ్మగారు రాత్రి పూట భోజనం చేసినతరువాత చల్లగాలికి ఆరుబయట పడుకొన్నారు వాసు నిద్రపట్టక శివాలయంలో భజన జరుగుతుంటే చూడటానికి వెళ్లాడు జయమ్మగారు తలుపు తాళం వెయ్యలేదు కొంచెంసేపుండి వెయ్యవచ్చుకదా అని బద్ధకించారు పడుకున్న మరుక్షణం ఆమెకు నిద్ర పట్టేసింది గాలికి దగ్గిరగా వేసిన తలుపు తెరుచుకున్నది ఈ సమయానికి ఈశు భోజనంచేసి సరదాగా వాసు ఇంటికేసి వచ్చాడు తలుపు తీసి ఉండటం చూసి డిక్షనరీ కొట్టెయ్యాలని అనుకున్నాడు అంతగా జయమ్మగారు లేచి అడిగితే, వాసు లోపల ఉన్నాడేమో చూడటానికి వెళ్లానని చెప్పవచ్చునుగా!

ఈశు మెల్లగా ఇంటిలోనికి ప్రవేశించాడు ఆ ఇంటిలో బంగారపు నగలు, డబ్బు ఎక్కడ ఉంటాయో ఈశుకి తెలుసు ఆ పెట్టె చూసేసరికి ఈశుకి మనస్సు చెదరిపోయింది డిక్షనరీమాట మరచిపోయాడు ఆ డబ్బు తీసికొని పోదామనుకుంటున్నాడు

వాసు ఇంటికి వచ్చి "అమ్మకి ఏమీ జాగ్రత్తలేదు తలుపైనా వేసుకోలేదు" అంటూ మెల్లిగా తలుపు తాళంవేసి, పడుకున్నాడు

ఈ మాటలు విని ఈశుకు పాడలెత్తింది మెల్లగా తలుపుదగ్గరకు వచ్చి తలుపు లాగాడు తాళం వేసి ఉన్నది ఎటుపోవటానికి దారిలేదు

ఇందన కొండలరావు

ఇంక లాభం లేదనుకొని ఈశు ఇంట్లో ఉన్న ధాన్యపు గాదెలో దాక్కుంటే, సమయము వచ్చినప్పుడు తప్పించుకొనిపోవచ్చునను కున్నాడు

"ఎంత కర్మ పట్టిందిరా దేవుడా!" అనుకుంటూ ఈశు గాదెలో దిగి కూర్చున్నాడు

తెల్లవారింది తొమ్మిది గంటలైంది అంతవరకూ ఈశుకి పారిపోయేటందుకు అవకాశం దొరకనే లేదు.

వాసు అన్నంతిని, పుస్తకాలు ముందు వేసికొని చదువుకు కూర్చున్నాడు

ఇంతలో జయమ్మగారు "ఒరే వాసు! గాదెలో దిగి ధాన్యం తీయరా బియ్యం నిండుకున్నాయి" అన్నారు వాసు విసుగుకుంటూ పుస్తకాలు సంచిలోపెట్టి, గాదె దగ్గరికి వచ్చాడు

ఈ మాటలు వినగానే గాదెలో కూర్చున్న ఈశుకి ప్రాణాలు పోయినంత పని జరిగింది

వాసు గాదెలోకి దిగాడు 'వాసు చాలా మంచివాడు ఈ ఆపద నుండి ఎలాగైనా కాపాడుతాడని ఈశు ధైర్యం తెచ్చుకున్నాడు

గాదెలో కూర్చున్న ఈశుని చూచి వాసు భయపడి పెద్ద కేక వేయబోయాడు కాని ఈశు మెల్లిగా "ఒరే వాసూ! నేనురా ఈశుని" అన్నాడు అది విని వాసు ఆశ్చర్యపోయి నీవు ఇక్కడకు ఎలా వచ్చావురా ఈశూ?" అని అడిగాడు

ఏమీ దాచకుండా అంతా చెబుతూ "ఒరే వాసు! ఇక్కడ నుంచి నన్ను ఎలాగునైనా బైటకు చేర్చరా? నాకు బుద్ధి వచ్చింది" అన్నాడు ఈశు దీనంగా

ఈశు మాటలు వినేటప్పటికి వాసుకి జాలి కలిగింది అంగుచేత ఈశు మాట దక్కించటానికి వాసు ఉపాయం ఆలోచించాడు గాదెలో నుండి బైటకువచ్చి "అమ్మా నేనొక్కడినే ధాన్యం తియలేను ఈశుని కూడా కేకవేస్తాను ఇద్దరమూ కలిసి తీస్తాము" అన్నాడు వాసు సరేనంటూ జయమ్మగారు ఇంటిలో పని చేసుకోడానికి వెళ్లారు

వాను ఈశుని కేక వేసుకు వచ్చి నట్లు నటిస్తూ "ఓరే ఈశూ! మాళ్లమ్మ ధాన్యం తీయమందిరా, నేనొక్క డను తీయలేను. ఇద్దరము కలసి తీద్దాము. కొంచెం సాయముచేసి పెట్టు. ముందు నువ్వెదిగు." అంటూ గాదెలోనికి దిగిపోయాడు. లోపల ఉన్న ఈశు, వానుకలసి ధాన్యం తీసి, బైటకు వచ్చేశారు. తనమాట దక్కించుకొనుటకు గాను ఈశు వానుకి చెయ్యెత్తి దండం పెట్టాడు. ★



"రసమున కెల్లు కల్గె రుచి"

భీమసేనరావుగారు మాధ్వబ్రాహ్మణులు ఆయన బెజవాడలో తహసిల్దారుగా ఉండగా భీమాచారిఅనే మాధ్వపు వంటవాడు ఆయనవద్ద పనిచేస్తుండేవాడు మాధ్వులలో సాధారణంగా రసమునకు (చారుకు) వంటకాలన్నిటిలో ఎక్కువ ప్రాముఖ్యము వారికి ఏదున్నా లేకపోయినా చారుంటే చాలును లేకపోతే ముద్దదిగదు

భీమాచారి ఎంతబాగా ఎంత రుచిగా చారుచేసినా పంతులుగారికి తృప్తిఉండేదికాదు

"ఏమిటి భీమాచారి ! చారు ఎంతో బాగాచేస్తావని నిన్నుపెట్టుకుంటే నువ్వుకూడా ఇలాగు చేస్తే ఎట్లాగోయి? ఇంతకంటే బాగా చేస్తే నీకు పదిరూపాయలు ప్రమోషను" అనేవాడు

ఇంతకంటె బాగా చెయ్యలేనని భీమాచారి మనవిచేశాడు పంతులుగారు చాటుచాటుగా తన బంధువులతో సంప్రదించాడు- ఎవరైనా మరొక మంచివంటవానిని పంప

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

ఆర్. శాంత

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

మని చివరికి వామనరావనే ఒక వంటవాడు పంతులుగారి వద్దకు వచ్చాడు

పంతులుగారు వామనరావుతో అన్నారు

"అబ్బాయి ! ఏవంటకం ఎలాగున్నా నాకుపర్వాలేదు కాని చారుమాత్రం చాలా పసందుగా ఉండాలి"

"ఆ సందేహము మీకు అక్కర్లేదు నా చారుపాకము నలభీమపాకమే! ఐతే ఇంకొక్కమనవి తమరు జీతం పాతవంటవానికి ఇచ్చినంతే ఇవ్వవచ్చును కాని మీకు నచ్చేవిధంగా చారు తయ్యారుచెయ్యవలెనంటే పదిరూపాయల సామాను నెలకు ఎక్కువవుతుంది ఈ పది రూపాయలు నాకోసం మాత్రం కాదు చారు బాగా చెయ్యడానికే అనుకోండి"

"చారు బాగుండాలేకాని ఏధవ పదిరూపాయలు ఒక లెక్కటోయి" అన్నారు పంతులుగారు

ఈవామనరావు చాలా హోటళ్ళలో బాగా నిగ్గుతేరిన వంటవాడు ఆరోజు చారు రుచిచూసిన పంతులుగారికి జిహ్వ లేచివచ్చినట్లయింది

"వామనరావు ! ఏంచారుచేశావోయి ! ఇటువంటి చారు నా జన్మలో రుచిచూచిఎరుగను" అని మెచ్చుకున్నారు పంతులుగారు

రోజుకు రోజు పంతులుగారికి రసాను భూతి ఎక్కువవుతూ వచ్చింది కాని పదిరూపాయలు నెలనెలకు ఒక్కచారుకోసం ఖర్చవటము ఆయనకుచాలా కష్టముగానే తోచింది

ఒకరోజున భీమాచారి పంతులుగారికి తారసపడ్డాడు "ఏం భీమా

గోపీ చేసిన ఉపాయం

గోపీ ఒకసారి చుట్టాల యింటికి వెళ్లాడు. అక్కడి నుంచి ఒకనాడు సైకిల్ మీద పొరుగూరికి బయలుదేరాడు. ఆ ప్రాంతం అంతా అతనికి కొత్త. కొంతదూరం వెళ్ళిన తరువాత, నాలుగు దారులు కలిసే కూడలి స్థలం వచ్చింది. అతనికి ఏదారి వెంట వెళ్లాలో తెలియలేదు. ఏదారి వెంట వెళ్తే ఏఊరు వస్తుందో తెలిపే సైన్ పోస్ట్ అక్కడ విరిగి పడిపోయి ఉన్నది.

కొంతసేపు ఆలోచించిన తరువాత ఒక ఉపాయం చేసి ఆ పడిపోయిన సైన్ పోస్ట్ సహాయంతోనే గోపీ తానే దారిన వెళ్లాలో కనుక్కోగలి గాడు. సైకిలు ఎక్కి హాయిగా ఈలవేసుకుంటూ వెళ్ళిపోయి నాడు.

గోపీ ఏం చేసి ఉంటాడు? పడిపోయిన సైన్ పోస్ట్ వలన అతనికి దారి ఎలా తెలిసింది? మీరయితే కనుక్కోగలరా?

గోపీ ఏంచేసి ఉంటాడో తెలియకపోతే కొంచెం ఆగండి. తానేం చేశాడో గోపీయే వచ్చే వారం చెప్తాడు.

చారీ! బాగున్నావా? చారు మును పటికంటె బాగా పెట్టున్నావా? మాయింట్లో వామనరావనే వంటవాడు వచ్చాడు. ఏంచారు పెడుతున్నాడయ్యా! చాలా కాలంబట్టి మాఇంట్లో పనిచేశాడు కాబట్టి చెబుతున్నాను. వాడెలా అంత బాగా చేస్తున్నాడో కనుక్కోరాదూ? అలా చేశావా మళ్ళీ నిన్నే పెట్టుకుంటాను." అన్నారు.

భీమాచారి, నెమ్మదిగా ఆవిధానము కనిపెట్టేశాడు.

ఒకరోజు వామనరావు సెలవు మీద వెళ్లాడు. భీమాచారి పంతులుగారి వద్దకు వచ్చి "ఈ రోజున నేను చారు పెడతాను. ఇప్పుడు చూడండి" అన్నాడు. "అయితే కొన్ని సువాసనద్రవ్యాలు కొనవలసిఉంది. ఒక్కఆరణాలు ఇప్పించండి" అని పుచ్చుకున్నాడు భీమాచారి.

ఆరోజు భీమాచారి చేసినచారు రుచిచూసి పంతులుగారి ఆనందం ఇంతాఅంతా కాదు.

"ఓహో భీమాచారీ! ఏంచారు చేశావయ్యా! ఇంకొంచెం!" అని గిన్నెడు చారు తాగేశారు పంతులుగారు.

కాస్త విశ్రాంతి తీసుకొన్న తరువాత భీమాచారిని పంతులుగారు అడిగారు. ఎలా అంత బాగా చారు చెయ్యగల్గావని.

"ఈ రోజునుంచి వామనరావు బదులు మళ్ళీ నీవువచ్చి ప్రవేశించవచ్చు"నని పంతులుగారు హుకుం జారీచేశారు.

"ఏమో బాబూ! మీరు వామనరావుని తీసేస్తే తీసేశారు లేకపోతేలేదు కాని ఒక సంగతి మాత్రం చేయాలి. మీరు ఇన్నాళ్లు వామనరావుగారి చారు తాగేరు కాబట్టి నాలిక కాల్చుకోవాలి" అన్నాడు భీమాచారి.

"అదేమిటోయి! ఏమయింది?"

"మీకిన్నాళ్లూ పెట్టినది ఏమి చారనుకున్నారు? అది రొయ్యల చారు. ప్రతిరోజూ రొయ్యలు బజారునుంచి తీసికొనివచ్చి చారులో ఉడకపెడుతున్నాడు. అందుచేత చారుకు ఆరుచి."

పంతులుగారు మళ్లీ ఎప్పుడూ చారురుచికోసం ప్రాకులాడలేదని వేరేచెప్పాలా?

★



1

1792 వ సంవత్సరం సెప్టెంబరు నెలలో ఒకనాడు- సూర్యాస్తమయం కావస్తున్నది. పారిస్ నగరం పశ్చిమద్వారం దగ్గర రుసరుసలాడుతూ, గుసగుసలుపోతూ, వినవినవచ్చి గుంపులు గుంపులుగా చేరుతున్నారు జనం.

ఆనాడు గిలటైన్ (శిరచ్ఛేదంచేసే యంత్రం)కు పని బాగానే తగిలింది. స్వాతంత్ర్యంకోసం, సమానత్వంకోసం పోరాడుతున్న సామాన్య ప్రజానీకానికి కన్నులవిందుచేసే అనేక దృశ్యాలు చూసే అవకాశం అక్కడ కలిగింది. గిలటైన్ పని ఆనాటికి ముగిసిన తరువాత, అక్కడినుంచి ప్రజలు బయలుదేరి ఇంకా వింతలు వినోదాలు చూడటానికి పారిస్ నగరద్వారాలవద్దకు నడుకున్నారు. ఒక్క గిలటైన్‌వద్ద తప్పిస్తే అంతకంటె వినోదం ఇంకెక్కడా లభించదు.

ఈ జమీందార్లు, ప్రభువులు, ప్రభువంశీకులు వీళ్ళంతా ద్రోహులు! ఎన్నాళ్ళనుండో సామాన్య ప్రజలని తమ ఇనపపాదాలక్రింద త్రొక్కివేశారు. ఈనాటికి ఫ్రాన్సులో ప్రజలకి ఈ ద్రోహులుచేస్తున్న అఘాయిత్యం తెలిసివచ్చింది. అందుచేత తిరగబడి వారినందరిని పట్టుకొని దయ తలచకుండా గిలటైన్‌కు ఒక్కొక్కళ్ళని అర్పిస్తున్నారు.

మూర్ఖులైన ఈ ద్రోహులు ఎలాగైనా ఫ్రాన్సునుంచి తప్పించుకొని పారిపోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నారు. రకరకాల వేషాలు వేసుకొని, హామేషా కావలాలు కాస్తున్న విప్లవసైనికుల కళ్ళల్లో దుమ్ము కొట్టి పారిపోవాలని వారు పడేపాట్లు చూడాలంటె ఇలా నగరద్వారాలవద్దకు రావాలి.

మిగతా ద్వారాలదగ్గర జరిగే తమాషాలన్నీ ఒక యెత్తు; పశ్చిమద్వారంవద్ద జరిగేది ఒక యెత్తు; పశ్చిమద్వారంవద్ద కావలా పని సార్జెంట్ బిబట్‌ది. బిబట్ కాలాంతకుడు. తమాషాలు చెయ్యటమంటే భలే సరదా. ఒక్కోసారి ఈ ప్రభువంశీకులు — వారిపాటి తెలివితేటలు మరొకరికి లేవన్నట్లు — మగవారు ఆడవారి వేషం, ఆడవారు మగవారివేషం లేదా అందరూ కలిసి బిచ్చగాళ్ళవేషం — ఇలా వింతవింత వేషాలు వేసుకొని ఈ ద్వారంలోగుండా పోవటానికి వచ్చేవారు, బిబట్టు వారిని ఇట్టే పసికట్టేసేవాడు. కాని పమి గుర్తించనట్టే పోనిచ్చేవాడు. వారు స్వేచ్ఛగా ఊపిరిపీల్చుకొని, "అమ్మయ్య బయటపడ్డాం" అనుకొని, కాస్త కుదటబడుతుండగా వెనకాల సైనికులని పంపించి, వారివేషాలు ఊడదీయించి వెనక్కి పిలిపించేవాడు. అక్కడినుంచి నేరుగా వారికి గిలటైనుయాత్ర. అందుచేత ఇటువంటి తమాషాలు చూసేటందుకు జనం పశ్చిమద్వారందగ్గరకు ఎక్కువగా వచ్చేవారు.

ఏఒక్క ప్రభువంశీకుడు తప్పించుకుపోకుండా చూచి పట్టుకోవటానికే ఇంత సతమతమౌతుంటే పులిమీద పుట్ర ఇంకొకటి వచ్చిపడింది. ఈమధ్య కొన్నినాళ్ళనుండి ఈ ద్రోహులు ఎలా తప్పించుకు



అవ్వ బండిగుఱ్ఱాన్ని తోలే కొరడాతీసి చూపించింది. ఆ కొరడాకు రకరకాల రంగుల దీర్ఘశిరోజాలు కట్టిఉన్నాయి.

పోతున్నారోగాని చాలామంది చెయ్యిదాటిపోతున్నారు ఇలా వెళ్ళినవారంతా ఇక్కడినుండి ఛానెల్ దాటి ఇంగ్లండు చేరుకుంటున్నారు. దీన్నిగురించి రకరకాలవదంతులు బయలుదేరినాయి కొంతమంది ఆంగ్లేయులు ఒకసంఘంగా ఏర్పడి, ఈ ద్రోహులను దాటేస్తున్నారని, ఈ సంఘంవారి నాయకుడెవరో అఖండుడని, అంత ధైర్యసాహసాలు, తెలివితేటలు మరెవ్వరికి లేవని అక్కడక్కడ చెప్పుకోసాగారు. ఇతడు ప్రభువంశీకులను వివిధసమయాలలో ఎలా తప్పించాడో కథలుగా చెప్పుకోవటం మొదలుపెట్టారు. ఇతడు, ఇతనిద్వారా పారిపోతున్నవారు నగరద్వారాలదాకా మామూలుగానే వస్తారట! అక్కడ అమాంతం అదృశ్యమైపోతారట! ఇతని కేవో మాంత్రికశక్తులు ఉన్నాయట!

ఆ నాయకుడెవరో ఎవ్వరికీ తెలియదు — ఎవ్వరూ చూడలేదు. కాని అతనినిగురించి తలుచుకుంటేమాత్రం ప్రతిఒక్కడు "అతడా? అమ్మయ్యో!" అని జలదరించి పోవలిసిందే.

ప్రభువంశీకుల నందరిని బహిరంగంగా విచారించే అధికారి ప్రజాసంక్షేమ సంఘాధ్యక్షుడున్నాడు ఒక్కొక్కసారి అతనికి తన జేబులోనే ఒక కాగితం ముక్క దొరుకుతుంది అందులో "ఫలాని ఫలాని వారిని నేను సురక్షితంగా పారిస్‌నుండీ తప్పించుకొని పోతూఉన్నాను కాబట్టి తెలియజేయటమైంది" అని ఉంటుంది ఆ ఉత్తరం క్రింద సంతకంబదులు ఒక ఎఱ్ఱటి పువ్వుబొమ్మ ఉంటుంది ఆ పువ్వు ఇంగ్లాండు దేశంలో డొంకలవెంటా, కంచెలవెంట తెగపూస్తుంది. దాన్ని ఆ దేశంలో "స్కార్లెట్ పింపర్నల్" అంటారు. అధ్యక్షుడు ఆ ఉత్తరం చూచుకొన్న కాస్సేపటిలో కబురు రానేవస్తుంది, ఆ "ఫలాని ఫలాని"వారు తప్పించుకు పోయినారని ఒక్కొక్కసారి అలాంటి ఉత్తరం జనంగుంపులోనుండి ఎవరో అధ్యక్షుని చేతికే అందించటం కూడా కద్దు. కాని ఎవరందించారో మాత్రం తెలియదు.

ఆ స్కార్లెట్ పింపర్నల్ ఎవరో తెల్సి, పట్టుకోవాలని విప్లవప్రభుత్వంవారు నిశ్చయించారు. పారిస్‌నగరపు అన్ని ద్వారాలవద్ద కాపలావాం సంఖ్య పెంచారు ఎవడైనాసరే పొరపాటువల్లనైనా ఆ స్కార్లెట్ పింపర్నల్‌ను తన ద్వారంగుండా తప్పించుకు పోనిచ్చాడా మరణశిక్ష విధించబడుతుందని బెదిరించారు స్కార్లెట్ పింపర్నల్‌ను పట్టుకున్నవానికి యాభైవేల రూపాయలు బహుమాన మిస్తామని ప్రకటించారు

స్కార్లెట్ పింపర్నల్‌ను పట్టుకోలేక, విడిచిపెట్టినందుకుగాను ఉత్తరద్వార రక్షకుడు గ్రోపియర్‌ను పాపం గిలటైన్‌కు పంపించారు దీనితో నగరంలో పెద్ద సంచలనం కలిగింది అందరిలోకి తెలివైనవాడు— ఆ ఒక్క బిబట్ తప్ప మరెవ్వరూ స్కార్లెట్ పింపర్నల్‌ను పట్టుకోలేరని ప్రజలలో ఏదో ఒక నమ్మకం పడింది అందుకని బిబట్ ఆ ఇంగ్లీషువానిని ఎలా పట్టుకుంటాడో సరిగా ఆవేళకు అక్కడనే ఉండి కళ్ళారా చూడాలని చాలామంది ఆ ద్వారంవద్దనే పడిగాపులు గాయటం ఆరంభించారు ఇదంతా చూచి బిబట్ తృప్తిగా నవ్వుకొని సంతోషపడటం మొదలుపెట్టాడు. ఇదీ కథారంభంనాటి పరిస్థితి

బిబట్ ఒక ఖాళీచెక్కపెట్టె బోర్లించుకొని, దానిమీద కూర్చున్నాడు. ప్రక్కన అతనికి విశ్వాసపాత్రుడైన సహోద్యోగి ఒకడు నిలబడి ఉన్నాడు బిబట్ ఆరంభించాడు

"ఆ గ్రోపియర్ వట్టి చేతకానిదద్దమ్మ అయిపోయినాడు కాని అదే నేనయిఉంటేనా?"

"అసలు ఏమి జరిగిందండీ అక్కడ?"

బిబట్ అక్కడచేరిన జనం అందరివంక ఒక్కసారి చూసి, తాపీగా మొదలుపెట్టాడు జనం అందరూ గబగబ దగ్గరకు జరిగారు

"గ్రోపియర్ జాగ్రత్తగానే కాపలా కాస్తున్నాడు. సరే, ఈ స్కార్లెట్‌పింపర్నల్ సంగతి మన అందరికీ తెలిసిందేగా! వాడికి మనద్వారంలోగుండా పోవటానికి దమ్ములున్నాయా? ఏదీ, పొమ్మనండి చూద్దాం—చచ్చి దయ్యమై తేనేతప్ప! సరే, మామూలుగా మార్కెటుబళ్లు వచ్చినాయి మనవాడు ఏదో కొంచెం డోసు వేసుంటాడు. ఆ ఇంగ్లీషునన్నాసి దీనిలో ఉండొచ్చాడా అనుకున్నాడు. ఏదో చూసీ, చూడకుండా బండ్లు వదిలేశాడు."

అక్కడ చేరినజనంలో ఈ ప్రక్కనుండి ఆ ప్రక్కదాకా చీదరింపులు, విసుగుదల తరంగాలుగా

వ్యాపించినాయి. బిబట్ అది చూసి కొంచెం సంతోషించాడు.

"ఒక అరగంట అయిందో లేదో, రక్షక భటుల దళంతో ఒక దళవాయి చస్తూ పడుతూ గుఱ్ఱాలమీద వచ్చాడు.

"ఇంతకుముందు ఇక్కడేమయినా బళ్ళు వెళ్ళినాయా" అని అడిగాడు. "వెళ్ళినాయ"న్నాడు గ్రోపియర్. "అయితే వాళ్ళని నీవు పారిపోనిచ్చావన్నమాట! ఆ బండిలో కెలే ప్రభువు, అతనికుటుంబం వాళ్ళు ఉన్నారు. ఆ బండి తోలుతున్న దరిద్రుడు మరెవడో కాదు. ఆ స్కార్లెట్ పింపర్నలే! కానీ, నీవు చేసిన యీతప్పుకు నీకు మరణ శిక్ష తప్పదు" అంటూ ఆ దళవాయి తన భటులను "పదండి, ఉరికించండి గుఱ్ఱాలను! బండి ఎంతో దూరం పోయివుండదు. ఏమయినాసరే మీరు ఆ బండి పట్టుకోవాలి." అని హెచ్చరించాడు. అంతా కలిసి గుఱ్ఱాలను దౌడు తీయించారు."

గ్రోపియర్ బండిని సరిగా పరీక్ష చెయ్యకుండా విడిచిపుచ్చినందుకు అందరూ అతనిని నిరసించారు.

"వాళ్లెంత తొందరగా వెళ్తేమాత్రం ఏంలాభం?"


"గ్రోపియర్ చేతగాని దద్దమ్మ. బండి సరిగా పరీక్ష చెయ్యవద్దూ?"

"అయిందిగా తగిన ప్రాయశ్చిత్తం."

నలుగురూ అనే మాటలు విని బిబట్ పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వటం మొదలుపెట్టాడు. "గ్రోపియర్‌ది పట్టి మట్టిబుర్ర. ఏమిట్రా! మీరుగూడా ఆ

"నేనూ, నా మేకా!"

ఫొటో: పి. రామారావు—రాజమండ్రి.



బండిలో నిజంగా శవాలున్నా రనీ, ఆ బండితోలినవాడు ఇంగ్లీషువాడేనని అనుకుంటున్నారా?" అని ఇంకా విరగబడినవ్వాడు. చిట్టచివరకు ఇక నవ్వలేక ఆగి "ఆ బండిలో శవం ఎవ్వరూలేరు. అంతా వట్టిదే. ఆ వచ్చిన దళవాయి ఎవరని? వాడే స్కార్లెట్ పింపర్నల్. ఆ వెనక గుఱ్ఱాలమీద ఉన్నవారంతా భటులు కారు. ద్రోహులు న్యాయంగా గిలటైన్‌కు అర్పణ కావలసినవారు." అని చెప్పి బిబట్ కథ ముగించాడు.

భయంతో, ఆశ్చర్యంతో, 'ఆఁ!' అంటూ జనం నోరు తెరిచారు.

సూర్యాస్తమయం అయింది. మరునాడు మార్కెట్టుకు సామాన్లు తేవటానికి పోవలసిన బళ్లు ద్వారంవద్దకు వచ్చినాయి. ఈ బళ్ళన్నిటిపైనా గుడిసెలు వేసిఉన్నాయి. ముందు వెనక మూసిఉన్నాయి. బిబట్ కూర్చున్న చోటినుండి దర్పంగా లేస్తూ, "ఆ తలకు మాసిన గ్రోపియర్‌లాగా నేనేమీ సులభంగా మోసపోయేవాణ్ణికాను. కిందనించి పైదాకా అంతా శరీతు చెయ్యనిదే బండి కదలనిచ్చేదిలేదు." అన్నాడు. సాధారణంగా ఈ మార్కెటుబళ్ళు తోలేవారు ఆడవారే. వీరిలో చాలామంది ప్రొద్దుటిపూట కాలం వృథా అయిపోకుండా గిలటైన్‌దగ్గరకు చేరి, హాహాకారాలతో, విషాద వదనాలతో ఒకరొకరువచ్చి, తల తెగిపడే ప్రభువంశీకులను చూస్తూ, ఆ తెగే ఒక్కొకరు చింపే నెత్తురుచూచి ఉత్సాహంతో కబుర్లు చెప్పుకుంటూ కాలం గడుపుతుంటారు. బిబట్ ఆనాడు ఉదయం గిలటైన్‌దగ్గరకు వెళ్లినప్పుడు అక్కడ కనిపించిన ముసలి అవ్వ ఒక ఆమె మొదటి బండిమీదనే ఉన్నది. బిబట్ బండిదగ్గరకు వెళ్ళి అడిగాడు.

"ఏం అవ్వా! ప్రొద్దున్న గిలటైన్‌దగ్గర ఉన్నావే! ఏం పని అక్కడ?"

అవ్వ బండిగుఱ్ఱాన్ని తోలే కొరడాని చూపించింది. ఆ కొరడాకు రకరకాల రంగుల దీర్ఘ శిరోజాలు కట్టిఉన్నాయి. అవ్వ ఇలా చెప్పింది. "ఆ గిలటైన్‌దగ్గర లేడూ! వాడు చాలా మంచివాడు. అందంగా ఉంటుంది, నా కొరడాకి కట్టుకుంటానని. ప్రభువంశీకుల తలలు తెగినాక ఆ శిరోజాలు కత్తిరించి యివ్వు అని అడిగాను పాపం తీసిఇచ్చాడు. రేపు కూడా వస్తే ఇంకా ఇస్తానన్నాడు కాని రావటానికి పడుతుందో, లేదోకదా!"

"ఎందుచేత?"

అవ్వ గుడ్డ అడ్డంగా కట్టిఉన్న బండి గుడిసె వైపు చేయిచూపుతూ, చెప్పింది. "మా మనమడు లేడూ! వాడికి వంట్లో సరిగా లేదు. కాస్త వళ్ళు వెచ్చబడింది రెండురోజులకిందట. అమ్మవారు మాపేటట్లు ఉన్నది. 'అదేంలేదు. ప్లేగు వచ్చేముందు ఇట్లాగే ఉంటుంద'ని కొందరు అన్నారు. రెండూ అంటురోగాలే కాబట్టి, ఏదివచ్చినా నన్ను రేపు పట్నంలోకి రానివ్వరు."

ఎప్పుడయితే అవ్వ అమ్మవారన్నమాట అన్నదో, అప్పుడే బిబట్, తక్కినజనం రెండడుగులు వెనక్కివేశారు. ప్లేగు అనటంతో మరింత గాభరాపడి, ఇంకా వెనక్కి తగ్గారు ఆ రెండువ్యాధులూ ప్రబలితే ఇంకా ఏమన్నా ఉన్నదా? ప్రతివాడూ ఆమాట తలచుకొని గజగజలాడిపోయినారు. అప్పుడే తమకు అందులో ఏదో ఒకటో, రెండూనో సోకినట్లు దాదాపుగా అందరికి అనిపించింది. ప్రక్కనున్న వారిలో ఎవరికి ఈవ్యాధులున్నాయో, దూరముగా ఉంటే ఎందుకయినా మంచిదని ఎవరిమట్టుకు వారు తప్పుకోసాగారు.

బిబట్ భయంగా ఆగ్రహంగా "పోనీ, పోనీ బండీ నువ్వూ నువ్వూ, ఊరికి పీడ తొందరగా వదులుతుంది. పోని ముందు" అని ఉరిమాడు.

"అయ్యో! అంతభయమైతే ఎట్టాగయ్యా! బతుకులు శాశ్వతమా ఏమిటి?" అని పళ్ళికిలిస్తూ అవ్వ గుఱ్ఱాన్ని అదిలించింది—బండి ఒక్కసారి ఊగి కదిలి ద్వారం దాటింది.

బళ్ళన్నీ వెళ్ళినతరువాతకూడా ఎవరికీ నిరుత్సాహం వదలలేదు అందరూ దిగాలుపడి కూర్చున్నారు. ఇంతలోనే సరిగా గ్రోపియర్ విషయంలో అయినట్లే, దళవాయి ఒకడు రక్షకభటులతో ఉరకలు వేస్తూ, పరుగులుతీస్తూ వచ్చాడు.

అయితే ఈ వచ్చిన దళవాయి బిబట్‌కి బాగా తెలిసినవాడే.

"బండి ఒకటి..." రొప్పుతూ, రోజుతూ దళ

★ కీ॥ శే॥ ఐన్‌స్టీన్ ★

(11-వ పేజీ తరువాయి)

పోతాయి. కాని మండుతున్న కుంపటిమీద రెండు నిమిషాలైనా కూర్చో కుండానే రెండుగంటలు అయినట్లుంటుంది."

ఈయన కనిపెట్టిన సిద్ధాంతం వల్ల సృష్టిలోని అనేక రహస్యాలు, పదార్థము, శక్తి, కాలము, దూరము మొదలైన విషయాలు శాస్త్రజ్ఞులకు మంచు విడిపోయినట్టు విడిపోయాయి. ఇంత గొప్పశాస్త్రజ్ఞుడూ ఎంత నిరాడంబరుడో తెలుసా? ఆయనకుకీర్తి, ధనము, సౌఖ్యము, అధికారము మొదలైన వేనితోనూ ప్రమేయం లేదు. ఎప్పుడూ తన సిద్ధాంతాలూ, పరిశోధనలూ, ఆలోచనలూ యివే ఆయన ప్రపంచం.

యూదురాజ్యమైన ఇస్రాయెల్ ప్రజలు "మీరు మా దేశానికి అధ్యక్షులుగా వుండండి" అని కోరితే ఆయన నిరాకరించాడు.

జర్మనీలో పుట్టిపెరిగినా ఆయన 1933 తరవాత స్వదేశాన్ని విడిచిపెట్టవలసి వచ్చింది. అంతవరకూ ఆయనను జర్మన్ ప్రభుత్వమూ, విద్యాసంస్థలూ ఎంతోగౌరవంగానే చూశాయి. కాని హిట్లరు నాయకత్వాన నాజీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయన యూదుజాతీయుడు కావడంచేత ఆయన్ని నానా బాధలు పెట్టసాగింది. దేశం నుండి ఆయనపారిపోయి, బెల్జియం, ఫ్రాన్సు, ఇంగ్లండు దేశాలుతిరిగి చివరికి అమెరికాలో స్థిరపడ్డాడు. ప్రిన్స్‌టన్ ఇన్‌స్టిట్యూట్ వారు ఆయనకు ప్రొఫెసర్ ఉద్యోగం ఇచ్చారు. ఆయన జీతం 5000 పౌనులు; ఆయన అడిగినదానికి నాలుగురెట్లు ఎక్కువ. చనిపోయే వరకూ ఆయన ప్రిన్స్‌టన్‌లోనే వున్నాడు.

మన మెవ్వరం అందుకోలేని సిద్ధాంత శిఖరాలమీదే ఆయన ఎప్పుడూ విహరించే వాడని అనుకోరాదు. విశ్రాంతికోసం ఆయన అప్పుడప్పుడు కిందికిదిగివచ్చి స్నేహితులతో పిచ్చాపాటీ మాట్లాడే వాడు. ఆయన దగ్గిరిస్నేహితులలో హాలీవుడ్ హాస్యనటుడు చార్లీ చాప్లిన్ ఒకడు. చాప్లిన్ యింటికి సాయంత్రా లప్పుడువెళ్ళి కాలం గడిపేవాడు. ఐన్‌స్టీన్ ఫిడేలుఅద్భుతంగా వాయించేవాడు. ఆయనకి ఫిడేలంటే పంచప్రాణాలూ. అంత శాస్త్రజ్ఞుడికి సంగీతంమీద అంత యిష్టంవుండడం చిత్రం కదూ! గణితశాస్త్రాన్ని "ప్యూర్ సైన్సు" అంటారు. సంగీతాన్ని "ప్యూర్ ఆర్ట్" అంటారు. గణితం అంటే చాలామంది దూరంగా పారిపోతారు. సంగీతంఅంటేచాలామంది పరుగెత్తుకు వస్తారు. ఈ రెండూ ఐన్‌స్టీన్‌కు ఇష్టంకావడం ఆశ్చర్యమే. "నేను సంగీతంలో ఆలోచిస్తాను. ఆలోచనలలో గానం చేస్తాను" అని ఆయనొకసారి అన్నాడట.

ప్రొ॥ ఐన్‌స్టీన్ గొప్ప శాంతివాది. యుద్ధాలను నిరసిస్తూ ఆయనొకసారి యిలా అన్నాడు:

"మూడో ప్రపంచయుద్ధం ఏ ఆయుధాలతో జరుగుతుందో చెప్పలేను గాని, నాలుగో ప్రపంచ యుద్ధంమాత్రం కర్రలతో జరుగుతుంది."

మూడో ప్రపంచ యుద్ధమే గనకవస్తే (అటంబాంబులతో) నాగరికత యావత్తూ నాశనమవుతుందని, మళ్లీ మనుష్యులు మొట్టమొదటి ఆటవిక స్థితికి వస్తారని ఆయన భావం. ★

వాయి మాట్లాడలేకపోయినాడు. బిబట్ నిర్లక్ష్యంగా "ఏంబండి?" అని అడిగాడు.

"గుడిసెవేసి ఉన్నది. ఒకఅవ్వ తోలుతున్నది"

"ఓశ్. అలాంటివి డజను వెళ్ళినాయి."

"మనమడికి ప్లేగని చెప్పింది ఆ అవ్వ."

బిబట్ ముఖం వివర్ణమైంది. నోటమాట రాలేదు.

"విడిచిపెట్టావన్నమాట! అందులో కౌంటెస్ డి టూర్నే, ఆమెకుమార్తె, కొడుకు ఉన్నారు. వారందరూ మరణశిక్ష విధించబడినవారే!"

బిబట్ నోట తడి ఆరిపోగా "మరి బండి తోలుతున్నది..." అన్నాడు.

"వాడే! ఆ త్రాష్టుడు ఆ ఇంగ్లీషువాడే అనుకుంటాను —— స్కార్లెట్ పింపర్నల్!"

(ఇంకా ఉంది)



విఠల్ ప్రొడక్షన్స్‌వారి "కన్యాదానం"లో జానకి.



అంజలి పిక్చర్స్ "అనార్కలీ"లో అంజలీదేవి, నాగేశ్వరరావు.

బొంబాయి సినిమా లేఖ

దర్శక నిర్మాత మెహబూబ్ తన "మదర్ ఇండియా" (భారతమాత) చిత్రనిర్మాణం ఈ నెల 8వ తేదీనుంచీ ప్రారంభించారు. మెహబూబ్ చాల సంవత్సరాల క్రితం నిర్మించిన "ఔరత్" చిత్రమే ఈ కొత్త చిత్రానికి ఆధారం. ఈసారి దాన్ని గేవాకలర్‌లో తీస్తున్నారు.

నర్గీస్ మొదట్లో ఈ చిత్రంలో నటించడానికి నిరాకరించినా, చివరకి అంగీకరించింది. ఆమె అతి ముఖ్యమైన పాత్ర ధరిస్తోంది. మరి మూడు ముఖ్య పాత్రలకు రాజ్ కుమార్, అమీతా, కన్హయాలాల్ బుక్ అయ్యారు. బాబుల్, అమర్ చిత్రాల్లో కీర్తి శిఖరం అధిరోహించిన ప్రసిద్ధ సంగీత దర్శకుడు నౌషాద్ ఈ చిత్రానికి సంగీతం కూరుస్తున్నారు.

* * *

బిమల్ రాయ్ పునర్నిర్మిస్తున్న "దేవదాసు"కు ఎస్. డి. బర్మన్ సంగీతం సమకూరుస్తున్నారు. రాజేంద్రసింగ్ బేడీ సంభాషణలు రచిస్తున్నారు. వైజయంతీమాల చంద్రగానూ, సుచిత్రాసేన్ పార్వతిగానూ, దిలీప్‌కుమార్ దేవదాసుగానూ నటిస్తున్నారు. మోతీలాల్ కూడా ఈ చిత్రంలో ఉన్నారు.

* * *

సొహ్రాబ్ మోడీ తీస్తున్న "కుందన్" షూటింగ్ జోరుగా సాగుతున్నది. ప్రఖ్యాత హిందీ రచయిత పండిట్ సుదర్శన్ స్క్రీన్ ప్లే, సంభాషణలు వ్రాశారు. గులాం మహమ్మద్ సంగీతం సమకూరుస్తున్నారు. నిమ్మి, ఉల్హాస్, మనోరమ, ఓంప్రకాశ్, సునీల్ దత్, బేబీనాజ్, మురాద్, ప్రాణ్ మున్నగు పెద్ద నటీనటులు నటిస్తున్నారు.


* * *

మినర్వా మూవీటోన్ తీస్తున్న మరొక చిత్రం "పసీనా." నాయికా నాయకులుగా షకీలా, సజ్జన్ నటిస్తున్నారు. కథ, స్క్రీన్ ప్లే విశ్రాం బేడేకర్, సంభాషణలు ఏ. ఎల్. సంతోషి వ్రాశారు. దర్శకత్వం వహిస్తున్న జాగీర్దార్ ఒక ముఖ్యపాత్రను ధరిస్తున్నాడు కూడాను.

* * *

బొంబాయి తారలు దక్షిణాదికి మూకుమ్మడిగా వలసపోవడం బొంబాయి పరిశ్రమలో పెద్ద సంచలనమే కలిగిస్తోంది. హిందీ పరిశ్రమలో కొత్త కొత్త పేరుపడిన ప్రతి నటి, నటుడు దక్షిణాదిన బుక్ అవుతున్నారు.

[illegible] ఎ. వి. ఎమ్. వారి "భాయ్ భాయ్"లో నిమ్మి, నిరూపారాయ్, మీనా షోరి, అశోక్ కుమార్, కిశోర్ కుమార్,



"అనార్కలీ"లో పేకేటి, సురభి బాలసరస్వతి.

★ బొంబాయి సినిమా లేఖ ★

ఓంప్రకాష్ మొదలైనవారున్నారు. ఎమ్. వి. రామన్ దర్శకత్వం వహిస్తున్నారు.

రాజ్ కపూర్, నర్గిస్ లతో మరొక హిందీచిత్రం తీయడానికి ఎ. వి. ఎమ్. వారాలోచిస్తున్నారు.

భారత్ భూషణ్ కూడా దక్షిణాదిన బుక్ అయ్యాడు. జెమినీవారి భారీ బడ్జెట్ చిత్రం "ఇన్సానియత్"లో అతడు నటించవచ్చును. వాసన్‌గారు ఇంకా పలువురు పెద్ద తారలను ఈ చిత్రంలోకి తీసుకోవచ్చునని తెలుస్తోంది.

దిలీప్, మీనాకుమారి నటించిన "ఆజాద్" బాక్సాఫీస్ హిట్ కావడంతో ఎస్. ఎమ్. ఎస్. నాయుడుగారు మరొక భారీచిత్రం తీయబోతున్నారు. ఇందులో దిలీప్‌కుమార్, వైజయంతీమాల నటిస్తారు.

జూపిటర్ వారు "శిలంబు" ఎమ్. ఏ. వి. పిక్చర్స్‌వారు "పెణ్ణరసి" చిత్రాలను హిందీలో పునర్నిర్మిస్తారు. వీటిలోకూడా బొంబాయి తారల్లో అగ్రశ్రేణివారు పలువురు ఉంటారట.

*　　*　　*

ఈ యేడాది అంతంలో భారతీయ టాకీ చిత్రాల రజతోత్సవానికి భారీయెత్తున సన్నాహాలు జరుగుతున్నాయి. భారత ఫిలిం ఫెడరేషన్ సంస్థయే ఈ ఉత్సవానికి ఆధ్వర్యం వహిస్తోంది. ఎస్. ఎస్. వాసన్ అధ్యక్షులుగా ఉత్సవ నిర్వాహక సంఘం ఏర్పాటైంది. ఉత్సవం డిసెంబరులో జరుగుతుంది.

*　　*　　*

ఫెడరేషన్ అధ్యక్షపదవికి వాసన్‌గారిని రెండోసారి ఎన్నుకోవడంతో సభ్యులకు ఆయన పట్లగలవిశ్వాసం వెల్లడి అయింది. పరిశ్రమను ఎదుర్కొనే ప్రధాన సమస్యల విషయంలో ఫెడరేషన్ ఇంతవరకూ ఏమీ చేయలేకపోయిందని, కాని ప్రాథమిక ప్రయత్నాలు చాలా చేసిందనీ ఆయన అన్నారు.

భారత్ భూషణ్ సోదరుడూ, నిర్మాతా అయిన ఆర్. చంద్రా ఇటీవల వాసన్‌గారి సన్మానార్థం విందుచేశారు. ఆ సందర్భంలో ఎస్. కె. పాటిల్ మాట్లాడుతూ, బొంబాయి నిర్మాతలు ఐకమత్యం సాధించాలని ఉద్బోధించారు. ఫెడరేషన్ నుండి తప్పుకుని 'ఫిలిం ప్రొడ్యూసర్స్ గిల్డ్' అనే మరొక సంఘం స్థాపించుకున్న నిర్మాతలను తిరిగి ఫెడరేషన్‌లోకి తీసుకురావడానికి తాను శక్తివంచన లేక ప్రయత్నిస్తానని కూడా ఆయన చెప్పారు.

*　　*　　*

ముడి ఫిలిం ఉత్పత్తి కార్యకలాపాన్ని ప్రభుత్వం స్వయంగా నిర్వహిస్తుందని, రెండవ పంచవర్ష ప్రణాళికలో ఈ అంశాన్ని

బహుశా చర్చవచ్చునని కేంద్ర సమాచార శాఖామంత్రి డా॥ బి. వి. కేస్కార్ లోక్ సభలో చెప్పారు.

*　　*　　*

హైదరాబాదులోని రజీయం ఇన్స్టిట్యూట్, కాన్సర్ హాస్పిటల్ సహాయార్థం బొంబాయి తారలు ఇటీవల క్రికెట్ ఆట ప్రదర్శనం చేశారు. దిలీప్‌కుమార్, మోతీలాల్, అగా, జైరాజ్, బీగంపారా, మీనాషోరీ, భగవాన్, బేబీనాజ్, షీన్ కన్వాల్, నసీర్ ఖాన్, విజయలక్ష్మి, సితారా, ప్రాన్, మోహనా మున్నగువారు పాల్గొన్నారు. క్రికెట్ ఆటకు ముఖ్యమంత్రి బి. రామకృష్ణారావుగారు అధ్యక్షత వహించారు. ఆటతరువాత సితారా, బేబీనాజ్, మన్‌మోహన్ కృష్ణ, బీగంపారా, అగా, జీవన్, భగవాన్, జైరాజ్, మోహనా నృత్య, సంగీత, హాస్య ప్రదర్శనాల్లో పాల్గొన్నారు. ★

సినిమా వార్తలు

కన్నడంలో విజయవంతంగా నడిచిన "కన్యాదానం" అనే చిత్రాన్ని విఠల్ ప్రొడక్షన్స్ వారు తెలుగులో పునర్నిర్మిస్తున్నారు. ఈ చిత్రం చాలవరకు అయిపోయింది. మరొక డాన్సు దృశ్యం షూటింగ్‌తో విడుదలకు సిద్ధం అవుతుంది. బహుశా వచ్చేనెల మధ్య కాలంలో విడుదల కావచ్చును. విఠల్ ఆచార్య దర్శకత్వం నిర్వహించారు. అడ్డాల, జి. సుబ్రహ్మణ్యం గార్లు సహాయ దర్శకులు. మాటలు, పాటలు శ్రీ శ్రీ వ్రాశారు. సంగీతం నాగరాజారావు సమకూర్చారు. లీల, గానసరస్వతి, ఎ. ఎమ్. రాజా ప్లేబాక్ పాడుతున్నారు. నృత్యదర్శకుడు శర్మ. ఫోటోగ్రఫీ ఎమ్. ఎస్. మణి. నటీనటులు జానకి, సురభి బాలసరస్వతి, రమాదేవి, హేమలత, చంద్రకళ, కాంతారావు, వీరస్వామి, సి. ఎస్. ఆర్., రాజనాల మున్నగువారు.

*　　*　　*

వి. ఎస్. పి. పిక్చర్స్ వారి "అడవిపిల్ల" చిత్రం మే నెల 6 వ తేదీన విడుదల కాగలదట.

*　　*　　*

భారతప్రభుత్వ సమాచార శాఖవారి వార్తా చిత్రాలను, డాక్యుమెంటరీలను తిరిగి ప్రదర్శించాలని ఈ నెల 17 వ తేదీన ఆంధ్ర సినిమా ప్రదర్శకుల మహాసభవారు విజయవాడలో సమావేశమై నిర్ణయించారు. కోజ వెంకటరామయ్యగారి అధ్యక్షతను జరిగిన యీ సభకు సుమారు 100 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

*　　*　　*


సినిమా స్కోప్
(ట్వెంటియత్ సెంచరీ ఫాక్స్)

నాలుగు ట్రాక్‌ల స్టీరియో ఫోనిక్ సౌండ్‌తో ట్వెంటియత్ సెంచరీ ఫాక్స్ వారు నిర్మిస్తున్న సినిమా స్కోప్ చిత్రాలలోగల క్రొత్తదనాన్ని నిరూపించడానికి న్యూగ్లోబ్ థియేటర్‌లో 20వ తేదీ బుధవారం నాడు ఒక ప్రదర్శన ఇచ్చారు. బ్రోకన్ లాన్స్ అనే చిత్రంలో కొన్ని దృశ్యాలను పూర్వపద్ధతిలో తీసినదానినీ సినిమా స్కోప్‌తో తీసినదానినీ చూపించారు. పూర్వపు సింగిల్ ట్రాక్ సౌండ్‌లోనూ ఫోర్ ట్రాక్ స్టీరియో ఫోనిక్ సౌండ్‌లోనూ దూరంనించి దగ్గరకు వచ్చి తిరిగి దూరమై పోయేటప్పుడు వినవచ్చే శబ్దాలలో తారతమ్యం చక్కగా నిరూపించబడింది. సినిమా స్కోప్ కోసం ప్రత్యేకంగా తయారు చెయ్యబడిన లెన్సుల సహాయంతో సినిమా దృశ్యాలను నిర్మించడంలో ఎంత పెద్దమార్పులు తీసుకురావచ్చునో కొన్ని కొన్ని చిత్రాలలో దృశ్యాల సహాయంతో నిరూపించారు.

దీనితోపాటు రానున్న ట్వెంటియత్ సెంచరీ ఫాక్స్ సినిమాస్కోప్ చిత్రాలలో అక్కడక్కడ కొన్ని ఘట్టాలు చూపించారు. ★



బిమల్ రాయ్ నిర్మిస్తున్న "అమానత్" లో భారత్ భూషణ్, అసిత్ సేన్. ఈ చిత్రం దర్శకుడు అరవింద్ సేన్.



ఆరుబయలు సినిమా : మోడల్ డ్రాయింగ్ (దీనికి సంబంధించిన వ్యాసం గతవారం సంచికలో ప్రచురింపబడింది.)

"రోజులు మారాయి"
ప్రేక్షకుల అభిప్రాయాలు

భారతదేశమును నేడెదుర్కొనుచున్న క్లిష్టసమస్యలు చాల యున్నవి. వీని నన్నిటిని ప్రభుత్వము పరిష్కరించుటకు శాయశక్తుల కృషి చేయుచున్నది. ప్రభుత్వమే కాక ప్రజలుకూడ వీనికొఱకై పాటుపడవలసిన అవసరము కలిగినది. సినిమాలోకం కూడ ఉడుతాభక్తిని తోడు పడుచున్నది. నేడు ఈ సమస్యలను చిత్ర నిర్మాతలు తమ చిత్రకథలయొక్క ముఖోద్దేశముగ తీసికొని సమస్యా పరిష్కారమునకు మార్గములను సూచిస్తున్నారు. "రోజులు మారాయి" చిత్ర ముఖోద్దేశ్యము బంజర్ల పంపిణీ సమస్యను విపులీకరించి చెప్పుట. నేడు బంజరు కండలు కరగించి పంటలు పండించే భూములులేని రైతుల కళ్లు కొంచంచాపోవుచున్నవో, ఈ విషయమునందు భూస్వాములు, గ్రామాధికారులు, ప్రభుత్వము యెంతవరకు బాధ్యులో ఈ చిత్రకథా సంవిధానము తెల్పి ప్రభుత్వమునకు కర్తవ్యము బోధించుచున్నది.

కథలో క్రొత్తదనం లేకపోయినా చిత్రీకరణలో నేర్పు సాధించినారు కనుక చిత్రం రాణిస్తుంది. ఈ చిత్రంలో పాటలు భావగర్భితములై ఆకర్షణీయంగా గానము చేయబడ్డాయి. ముఖ్యంగా "ఏరువాక" గీతం ప్రేక్షకుల మన్ననలను బాగా పొందింది. నటులలో నాగేశ్వరరావు, రేలంగిల నటన అద్వితీయము. మిగతవారు తమ తమ పాత్రలను తగినట్లు నిర్వహించినారు.

టి. జె. వి. మాణిక్యం,—భీమవరం.

'రోజులు మారాయి' కథ, దానిపోకడ చక్కగ ఉన్నాయి విసుగెత్తించే దృశ్యాలు చాల తక్కువ కథలో సమస్యలు తెరలు తెరలుగవచ్చి కడపటికి ఒకకొలిక్కి వస్తాయి. ఇందువల్ల కథ మంచిరక్తి కట్టింది.

అక్కడక్కడ పెరుమాళ్లు నటన అతిగ కనబడ్తుంది. వహీదా రెహమాన్ నృత్యము, సీతారాము నటన బాగా ఉన్నాయి రేలంగికి స్వేచ్ఛానటనకు అవకాశము తక్కువ.

నృత్యసమయంలో సంగీతానికి చప్పట శబ్దాన్ని ఎంతో బాగా ఉపయోగించారు. మాటలు, దర్శకత్వం చిత్రం స్థాయిని పెంచాయి.

యు. శ్రీనివాసాచార్యులు

—అనంతపురం.

* * *

సారథి చిత్రము చాలా బాగున్నది. తాపీ చాణక్యగారి డైరక్షన్ అద్భుతముగానున్నది. ముఖ్యముగా చెప్పదగ్గది పెరుమాళ్లు, నాగేశ్వరరావుగార్ల నటన. వహీదా

(౫౯-వ పేజీ చూడండి)

(10-వ పేజీ తరువాయి)

ప్రభావం మీకు తెలుసు. ఇక మాకు తెలియనిదల్లా ఏమిటంటే: ఈ భౌతిక ప్రభావానికీ జ్యోతిషానికీ గల వింత సంబంధము ఎవరు కనిపెట్టినారూ అన్నది. ఇప్పుడా సంగతి తేలిపోయినది.

తమ తొలితరంలో "ఆ సంబంధాన్ని వివరించేది జ్యోతిషం" అని ఉద్ఘాటించిన వెంకటరావుగారే! (వా రెరిగినంతవరకూ ప్రాచీనులు కారు, మే మెరిగినంతవరకూ ఆధునిక వైజ్ఞానికు లెవ్వరూ కారు) వీరేనని అనుమానించే మేము "మీవంటి భౌతిక విజ్ఞానపరిచయంగలవారు మానలేక కనిపెట్టిందంటారా?" అన్నాము.

అవును 'మానలేక' కనిపెట్టినదే భౌతిక ప్రభావానికీ జ్యోతిషానికీ గల సంబంధము. నభోమూర్తులకూ మానవులకూ గల గురుత్వాకర్షణ సంబంధమువల్ల మానవుల బరువు మాత్రమే మారగలదు. వెంకటరావుగారు చెప్పిన కాస్మిక్ కిరణాలూ, గామాకిరణాలూ, ఎక్స్‌కిరణాలూ గ్రహములనుండి కాని, సూర్య - చంద్రులనుండికాని రావడములేదు. ఇక 'గ్రహము'లనుండి రాగల కొద్ది అతినీలలోహితకిరణాలూ, మామూలు వెలుగూ పరారుణకిరణాలూ, ఉష్ణకిరణాలూ శరీరములవల్ల పీల్చబడి తెచ్చేమార్పులు మనడాక్టరులు ఎరిగిన భౌతికపు మార్పులే. ఈ కిరణాలను వైద్యానికి ఉపయోగించే డాక్టరులు జ్యోతిష్కులుచెప్పే ఫలితాల్లాంటివి చెప్పడములేదు. వారు వెంకటరావుగారుచెప్పిన ఈ కొత్తసంబంధాన్ని గుర్తించుకోడానికి వెంకటరావుగారే వారికి సాయపడవలసి ఉంటుంది. కాదామరి?


అందమంతా ఎక్కడున్నదంటే, "జ్యోతిషం విజ్ఞానస్థాయీ నందుకోలేద"ని చల్లనిమాటలు అన్న వెంకటరావుగారే, విజ్ఞానము కనుక్కున్న ఫలితాలను విజ్ఞాన శాస్త్ర పద్ధతులకు వ్యతిరేకముగా జ్యోతిషానికి తగిలించ యత్నిస్తున్నారు. దీనినే మేము "మీవంటి...వారు మానలేక కనిపెట్టినది" అన్నాము.

అన్నట్టు, ఈసాగతీత రాహుకేతువులపట్ల అసలే సాగదు. వెంకటరావుగారు రచించిన 'ఎలెక్ట్రాను ఆత్మకథ'లో ఎలెక్ట్రాను వారితో అంటుంది: "మిత్రమా, మీ జ్యోతిశ్శాస్త్రజ్ఞు లంత పొరపాటు చేసేరేమి?.. అసలు గ్రహాలైన యురేనసుని, నెప్ట్యూనుని, ప్లూటోని వదలిపెట్టేరే!" అని. దానికి వెంకటరావుగారు చెప్పిన జవాబు ఇది: "భూలోక జీవులని అధికంగా ప్రచోదించే వాటినే ఎంచుకుని వాటిని గ్రహాలన్నారు" అని. రాహుకేతువులు యురేనస్‌వంటి దూరగ్రహాలకంటె ప్రచోదశక్తి ఎక్కువ కలిగినవని వారి అభిప్రాయమన్నమాటేకదా? వారు పట్టికవేసే కోటానుకోట్ల తరంగాలూ, గురుత్వాకర్షణా రాహుకేతువులకు కలవనే వారి అభిప్రాయమా? ఈ రెండు గుణాలూ యురేనసాది గ్రహాలకు తక్కువైనాయి కదూ? వాటి దురదృష్టము! కాదు. గ్రహచారము! ఈనాటి ఎలక్ట్రిక్కు దీపాలు నగరాలలో వెంకటరావుగారు చెప్పిన కోటానుకోట్ల తరంగాలలో కొన్నిటిని రాత్రి అంతా విరజిమ్ముతూనే వున్నాయి. వీటి కాంతిమత్వము గ్రహాల వెలుతురుయొక్క కాంతిమత్వముకంటె ఎన్నోరెట్లు ఎక్కువ కదా? కాంతి మాపణమువల్ల వచ్చే ఫలితాలకు ఇవీ కారణములే! పర్వతసీమ పక్కన ఉన్నవారిని పర్వతాలు ఆకర్షిస్తూ వుంటాయి. యురేనస్ నెప్ట్యూన్ గ్రహాల గురుత్వాకర్షణ వెంకటరావుగారు లెక్కించలేదు కదా; వీటి ఆకర్షణో?

వెంకటరావుగారు "అధ్యాత్మ విషయమంటారా?" అని ప్రారంభించి రమణమహర్షి, అరవిందులూ అంటూ చాలా వ్రాశారు. వారిద్దరూ ఏమి జ్యోతిషము చెప్పినారో మాకు తెలియదు. అతీంద్రియ శక్తిసంపన్నులైన నేటి యోగులుకూడా జ్యోతిషాన్ని పెంచియుంటే, అట్టి అతీంద్రియసంపన్నులే మొదట జ్యోతిషాన్ని నిర్మించారూ, అట్టివారే నేడూ పెంచినారూ, భౌతికశాస్త్రవిజ్ఞానులూ భౌతిక శాస్త్రాన్ని జ్యోతిషానికి తగిలించేవారూ చేయగలిగినపనికాదదీ" అని నమ్మడానికి వీలుండియుండును. అతీంద్రియశక్తి గలిగిన రామకృష్ణపరమహంస, శంకర, రామానుజ, మధ్వ ఆచార్యులూ, - ఎవరైనాసరే - జ్యోతిషశాస్త్రాన్ని స్పృశించనైనా స్పృశించారా? అట్టివారు ఎవరైనా జ్యోతిష శాస్త్రాన్ని పెంచి రచించియుంటే అది చూపించి అటువంటి అతీంద్రియ శక్తిసంపన్నులే ఆ శాస్త్రాన్ని పెంచగలరని చెప్పడానికి ఎవరికేనా ఆధారము దొరికియుండును. ఏఆధారమూ లేకుండా మీ "అనుభవిక" శాస్త్రాన్ని అతీంద్రియశక్తిసంపన్నుల కంటగట్టడానికీ వారిపక్షాన తప్పుడు సాక్ష్యములు చెప్పడానికీ మీకు ధైర్య మెలాగు వచ్చిందీ? మీరు రాసిన పెద్దపెద్ద మాటలు: "భౌతికాన్ని ఐహికాన్ని ఏవగించి తృణీకరించిన ఆత్మశక్తిసంపన్నులు." ఇలాటివారు ఐహికఫలాల్ని సూచించే శాస్త్రము రచించారా? చూడగా ఆ అతీంద్రియసంపన్నులు మీ ఊహాగానతరంగాలపై ఊగులాడే బుద్బుదాలలాగున్నారే?

క్రిందటి వ్యాసంలో తాము రచించిన 'మొదటి మూడు పేజీ లూ...కత్తిరించా'మన్నారు వెంకటరావుగారు. వాటిలో 'నిజాన్ని తేల్చడం మన మనుకొన్నంత సులభంగాదని నిరూపించా'మన్నారు. అసలు సంగతి ఏమిటంటే వారు ఆ మూడు పుటలలోనూ 'ఎలెక్ట్రాను తత్వము కణత్వమా, తరంగ స్వభావమా అన్న విషయము తేలింది గనకనా?' అని వివరిస్తూ, సూక్ష్మ సూక్ష్మతర ప్రపంచములోని అనిర్దేశిత్వమును తెచ్చి స్థూలప్రపంచములో తెలియదగిన సత్యాలకు కూడా తగిలించేస్తున్నారు. అనిర్దేశ సిద్ధాంతమువల్ల, వైజ్ఞానికుల పరిశీలనకు అనిర్దేశిత్వము ఏ రంగములో వస్తోందీ అన్నది తెలుస్తుందిగాని, వైజ్ఞానికులు కనుక్కున్న స్థూలనిజాలు అబద్ధాలైపోవు. కనక "(జ్యోతిషము దబ్బ గుద్దడ తప్పు.) ఇక నిజమంటే ఏమిటి?" అన్న మా స్థూల ప్రపంచ నిజానికి వెంకటరావుగారు ఆ మూడు పేజీలలోనూ వివరించిన సూక్ష్మప్రపంచ అనిర్దేశిత్వము అవహించదు. విశేషించి జ్యోతిష శాస్త్రాన్ని గురించిన ఈ చర్చలో—పైన చెప్పిన అతీంద్రియ శక్తికి తోడు ఈ—అనిర్దేశిత్వాన్ని కలిపి చదువరులకు "మేడ్డిఫికల్టు" చేయడ మెందుకని, ఆ మూడుపుటలూ వెనక పెట్టినాము కాని కత్తిరించి పారవేయలేదు. వెంకటరావుగారి కోరిక ప్రకారము అవి తప్పక ప్రచురిస్తాము.

ఈ చర్చ వినోదానికా విజ్ఞానానికా? అని వెంకటరావుగారు మమ్ము మందలిస్తున్నారు. మేము విజ్ఞానవీధులలో వినోదము మెరిపించలేదు ఇంతవరకు. మా ఆశ ఏమిటంటే, ఈ చర్చలో తమ వాదాని కాధారమైన పునాదులు నిలిస్తే, వెంకటరావుగారు అలవాటు చొప్పున ఏ కొంతో పరమాణు కవిత్వాన్ని వెలయించక పోతారా? అది చదువరులకు కావలసినంత ఆధునిక విజ్ఞాన వినోదము కాకపోతుందా? అని. ★



విఠల్ ప్రొడక్షన్స్‌వారి "కన్యాదానం"లో సురభి బాలసరస్వతి, కాంతారావు.

*　*　*　*　*　*

హైదరాబాదు, రేడియం ఇన్‌స్టిట్యూట్, కాన్సర్ ఆస్పత్రి సహాయార్థం జరిగిన నృత్య, సంగీత, హాస్య ప్రదర్శనంలో పాల్గొన్న బొంబాయి తారలు; డేవిడ్, సితారా, దిలీప్‌కుమార్, లీలాగుప్తే.



ప్రేక్షకుల అభిప్రాయాలు

యొక్క డ్యాన్సు బాగా చేసున్నది. మాస్టర్ వేణు సంగీతము చాలా బాగున్నది.

కట్టమూరి రమణమూర్తి

—విజయనగరం.

*　*　*

'రోజులు మారాయి' ఉత్తమచిత్రములలో ఒకటని పేర్కొనవచ్చును. కథ సహజమైనది. తాపీ చాణక్య దర్శకత్వము 'అంతా మనవాళ్ళే' చిత్రములో కన్న దీనిలో మెరుగనిపించుచున్నది. నటీనటులలో అందరును బాగుగా నటించినారు. ముఖ్యముగా నాగేశ్వరరావు, రేలంగి, జానకి, సి. ఎస్. ఆర్. నటన పేర్కొనదగినది. మాటలకన్న పాటలు చాల బాగున్నవి. ముఖ్యముగా క్రొత్తనటి 'వహీదా' యొక్క నాట్యము చిత్రమునకు ప్రత్యేక ఆకర్షణము.

సయ్యద్ కరీముద్దీన్

—అనంతపురం.

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, ThambuChetty St Madras


అతను కోటును తీసివేయడానికి భయపడతాడు
మోహన్ తన కోటును ఎందుకు తీసివేయడు ?
ష్ ! నీ కోటును తీసివేయి !
నేను తీసి వేయలేను !
ఎందుచేత ?
నా షర్టు చిరిగిపోయింది... దీనిని కొని రెండు నెలలే అయింది !
మ్మ్, తప్పు విధముగా ఉతుకబడియుంటుంది !
అయితే నా భార్య సాధారణ పద్ధతినే బట్టను బాది ఉతుకుతుంది.
బట్టలను బాదుటవలన వాటి పోగులు తెగిపోతాయి, చిరిగిపోతాయి. బట్టలను బాదకుండ సమృద్ధిగా నురగనిచ్చు సన్‌లైట్‌తో ఉతకాలి. అప్పుడు అంత త్వరగా అవి చిరిగిపోవు.
బాది ఉతుకుటవలన గలిగిన ఫలితము
ఈ మేలును నే నెప్పుడూ మరువను !
మోహన్ భార్య :
సన్‌లైట్ బట్టలను తెల్లగా, కాంతిగా ఉతుకును. ఇప్పుడు మా బట్టలు చాలకాలము మన్నుతాయి. ఇంతే కాకుండా డబ్బు ఖర్చు, శ్రమ, తక్కువ !
SUNLIGHT SOAP
Rs.10,000 Reward!
GUARANTEE
SUNLIGHT SOAP
సన్‌లైట్ సబ్బు
ఇండియాలో తయారుచేయబడినది
బట్టలను చాలకాలము మన్నునట్లుచేయును

S. 229-X52 TL